




ESTD: 1999
www.voodayam.com

# వుదయం






ఖమ్మం | 29-03-2026 ఆదివారం | సంపుటి : 13 | సంచిక : 260 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on

# మైనింగ్‌పై సభా యుద్ధం

## మంత్రి పొంగులేటిని లక్ష్యంగా చేసుకొని రాఘవ కన్ స్ట్రక్షన్స్ 'అక్రమాల'పై బిఆర్ఎస్ దాడి



### పాలక ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు

స్పీకర్ వెల్ లోకి దూసుకెళ్లిన బిఆర్ఎస్

సభా కమిటీ వేయాలని డిమాండ్

అన్ని రకాల అక్రమ మైనింగ్ ఆరోపణలపై సిబిసిఐడి విచారణకు సిఎం ఆదేశం



● శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో అక్రమ మైనింగ్ పై మండిపాటు ● స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లిన వైనం ● ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిఆర్ఎస్ ● ప్రతిపక్ష సభ్యులకు భట్టి, శ్రీధర్ బాబు కౌంటర్ ● సీబీ సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించిన సీఎం ● పొంగులేటి.. పైరవీలకు సహకరించడం లేదనే బ్లాక్ మెయిల్ రాజకీయాలు పోలీసు, ఆర్టీసీ, బీసీ సంక్షేమాన్ని కోరుతూ బీఆర్ఎస్ వాకౌట్ ● ఎల్ అండ్ టీ నుంచి మెట్రో స్వాధీనానికి సీఎం తీర్మానం ప్రస్తావన ● నిరసన తెలిపిన హరీశ్ రావు ● బడ్జెట్ పద్దులపై అసెంబ్లీలో ముగిసిన చర్చ ● సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు మంత్రులు, సీఎం వివరణ ● నేడు అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ ● కీలకం కానున్న చివరి రెండు రోజుల సభ

**హైదరాబాద్, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ శాసనసభ సమావేశాలు శనివారం ఆసక్తికరమైన చర్చల మధ్య కొనసాగాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బడ్జెట్ పద్దులపై సభలో జరిగిన చర్చ శనివారంతో ముగిసింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు, లేవనెత్తిన అంశాలకు సంబంధిత మంత్రులు వివరణలు ఇచ్చారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిపాదించిన వివిధ శాఖల బడ్జెట్ కేటాయింపులపై అధికార, ప్రతిపక్ష సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల వినియోగంపై చర్చ జరిగింది. పద్దులపై చర్చ పూర్తి కావడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను నేడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం, నేడు సభలో అప్రోప్రియేషన్ బిల్లుపై చర్చ జరగనుంది. ఈ బిల్లు ఆమోదం పొందితేనే ప్రభుత్వం బడ్జెట్ నిధులను వెచ్చించేందుకు పూర్తిస్థాయిలో అనుమతి లభిస్తుంది. కాగా, మార్చి 30తో బడ్జెట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో, చివరి రెండు రోజులు అత్యంత కీలకం కానున్నాయి. ప్రధానంగా పెండింగ్ బిల్లులు, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలపై సభలో మరిన్ని వేడివాడి చర్చలు జరిగే అవకాశం ఉంది. శాసనసభ సమావేశాలు శనివారం ఉద్రిక్తతకు దారితీశాయి. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' వ్యవహారం సభలో పెను దుమారం రేపింది. బీఆర్ఎస్ సభ్యులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో జరుగుతున్న అక్రమాలపై చర్చ చేపట్టాలని పట్టుబట్టారు.

మిగతా 2లో

### మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం : సిఎం రేవంత్ 2

# అంగన్‌వాడీలకు సొంత భవనాలు

● వచ్చే మూడేళ్లలో పూర్తయ్యేలా ప్రణాళికలు, కార్యాచరణ
● పిల్లలకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
● సంక్షేమం, కార్యక్రమాల అమలు గురుతర బాధ్యత అధికారులు, ఉద్యోగులదే
● ఆర్థిక వెసులుబాటుకు తగ్గట్టు సమస్యలు పరిష్కరిస్తాం
● అంగన్‌వాడీ చిన్నారులకు "తొలి ముద్ద" ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్






**హైదరాబాద్, మార్చి 28 (ఎఎంస్) :** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో కాకుండా వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవాల్లో కొనసాగేలా కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. శనివారం శాసనసభ సమావేశ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం "తొలి ముద్ద"ను సీఎం లాంఛనంగా ప్రారంభించారు.

మిగతా 2లో

# కేంద్రానికి మెట్రో విస్తరణ ప్రతిపాదనలు

● కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్-2 హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కు మెట్రో నెట్ వర్క్
● విస్తరణకు అడ్డంకులను, ఎదురవుతున్న ఇబ్బందులపై సమీక్ష
● ఫేజ్ 1ను హెచ్ఎంఆర్ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయానికి అసెంబ్లీ ఆమోదం



2



## ఆయిల్ సంక్షోభ తరుణంలో 'ఇథనాల్ రైతుల' పాత్ర గొప్పది

పెట్రోల్ లో ఇథనాల్ కలుపడం వల్ల రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అవుతుంది : నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ వల్ల తలెత్తుతున్న సవాళ్లను భారతదేశం పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం తెలిపారు. జేవార్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, దేశ పౌరుల రక్షణ కోసం ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటోందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో సంఘర్షణ ఒక నెలరోజులుగా నడుస్తోంది. యుద్ధం కారణంగా, ఆహారం, పెట్రోల్, డీజిల్, గ్యాస్, బొగ్గు సహా ఇతర నిత్యావసర వస్తువుల సరఫరాపై ప్రభావం నడిచింది. నలువైపులా సంక్షోభం ఆవహించి ఉంది, ప్రతి దేశం దానిని ఎదుర్కొనేందుకు యత్నిస్తోంది. మన భారతదేశం కూడా తన పౌరుల శక్తిని నమ్ముకొని, తన సర్వశక్తులతో ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని మోడీ అన్నారు. సంఘర్షణల ప్రభావానికి గురైన ప్రాంతాల నుండి వచ్చే ముడి చమురు, గ్యాస్‌పై భారతదేశం ఆధారపడి ఉందని నొక్కిచెబుతూ, ఈ భారం కుటుంబాలపై, రైతులపై పడకుండా చూసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది అని మోడీ అన్నారు. ముడి చము రుపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఇథనాల్ మిశ్రమం (బ్లెండింగ్) చూపే ప్రభావాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ఒకవేళ ఇథనాల్ ఉత్పత్తి, పెట్రోల్‌లో దాని మిశ్రమం పెరగకపోయి ఉంటే, దేశం ప్రతి ఏటా విదేశాల నుండి 4.5 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకోవాల్సి వచ్చేదని మోడీ వివరించారు.

మిగతా 2లో

# వాడి తగ్గని ఇరాన్ దాడులు

## సౌదీ అరేబియా, బహ్రెయిన్లలోని అమెరికా స్థావరాలపై క్షిపణుల వర్షం

● ప్రిన్స్ సుల్తాన్ హెయిర్ బేస్ పై దాడిలో గాయపడిన అనేక మంది అమెరికన్ సైనికులు
● అనేక యుద్ధ విమానాలకు నష్టం
● ఐరాస అభ్యర్థన మేరకు హోర్ముజ్ ద్వారా మానవత సాయాన్ని అనుమతించిన ఇరాన్
● ఇజ్రాయెల్ దాడుల్లో దెబ్బతిన్న ఇరాన్ అణుశుద్ధి ఏర్పాట్లు



**వుదయం డెస్క్, మార్చి 28 :** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై నెల దాటుతున్నా, దాడుల తీవ్రత తగ్గేలా కనిపించడం లేదు. అమెరికాకు మిత్రదేశాలైన గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను కొనసాగిస్తోంది. శనివారం నాడు అందిన సమాచారం మేరకు, తాజాగా సౌదీ అరేబియా, బహ్రెయిన్‌ల లోని అమెరికా స్థావరా లపై తెహ్రాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై జరిగిన దాడిలో అనేకమంది అమెరికా సైనికులు గాయపడా, యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్టు అధికారులు చెప్తున్నారు.

మిగతా 2లో

### రణరంగంలోకి హౌతీల ప్రవేశం

## ఇజ్రాయెల్ పై దాడి

**వుదయం డెస్క్, మార్చి 28 :** పశ్చిమాసియాలో సంఘర్షణ ప్రారంభమైన దాదాపు ఒక నెల తర్వాత, యెమెన్‌లోని ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై తమ తొలి దాడిని ప్రకటించడంతో, కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధం కొత్త దశలోకి ప్రవేశించింది. ఈ పరిణామం మధ్య ప్రాచ్యం అంతటా శత్రుత్వాలు విస్తరిస్తున్నాయని సూచిస్తోంది. వార్తల ప్రకారం, హౌతీలు ఇజ్రాయెల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడి ప్రయత్నాన్ని ఇజ్రాయెల్ సైన్యం ధృవీకరించి, తమ వాయు రక్షణ వ్యవస్థలను క్రియాశీలం చేసినట్లు తెలిపింది. యెమెన్ నుండి ఇజ్రాయెల్ భూభాగం వైపు ఒక క్షిపణి ప్రయోగాన్ని గుర్తించామని, ఆ ముప్పును అడ్డుకోవడానికి వైమానిక రక్షణ వ్యవస్థలు పనిచేస్తున్నాయని ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు తక్షణ నివేదికలు ఏవీ లేకపోవడంతో, ప్రాథమిక సూచనల ప్రకారం ఆ క్షిపణిని అడ్డుకుని ఉండవచ్చని తెలుస్తోంది.



**యుద్ధంలోకి ప్రత్యక్ష ప్రవేశానికి హౌతీలు సంకేతాలు**

ఇరాన్‌పై దాడులు కొనసాగినా లేదా మరిన్ని దేశాలు యుద్ధంలో చేరినా తాము సంఘర్షణలోకి దిగుతామని హౌతీ గ్రూపు గతంలోనే హెచ్చరించింది. ఈ తాజా దాడి ఆ హెచ్చరికను అమలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై తమ గ్రూపు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిందని ప్రతినిధి యాహ్యా సరీ ఎక్స్‌పై పోస్ట్ చేసిన ఒక వీడియో ప్రకటనలో తెలిపారు. హౌతీలు ఉత్తర యెమెన్‌లోని చాలా ప్రాంతాలను నియంత్రిస్తున్నారు. గతంలో గాజా యుద్ధ సమయంలో డ్రోన్‌లు, క్షిపణులను ఉపయోగించి ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రత్యక్ష సైనిక చర్యకు మేము సిద్ధంగా ఉన్నామని ధృవీకరిస్తున్నాం అని పేర్కొంటూ, ఇతర దేశాలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేయవద్దని హెచ్చరిస్తూ ఆ బృందం శుక్రవారం ఒక ప్రకటన జారీ చేసింది.

మిగతా 2లో

### నేపాల్ మాజీ ప్రధాని ఓలి అరెస్టు 5



## ట్రంప్, మోడీ సంభాషణలో మస్క్ లేడు

### భారత విదేశాంగ శాఖ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీల మధ్య ఇటీవల జరిగిన ఫోన్ సంభాషణలో బిలియనీర్ ఎలాన్ మస్క్ పాల్గొనలేదని శనివారం కేంద్రం స్పష్టం చేసింది. ఈ సంభాషణలో ఆయన ప్రమేయం ఉన్నట్లు వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించింది. మార్చి 24న జరిగిన సంభాషణ కేవలం ఆ ఇద్దరు నాయకుల మధ్యే జరిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) తెలిపింది.

మిగతా 2లో



### నెల రోజుల యుద్ధంలో ప్రముఖ నాయకులను కోల్పోయిన ఇరాన్ 2



# క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండండి

హైదరాబాద్ సీపీ సజ్జనార్

బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం



**హైదరాబాద్, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :** క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ యువతకు సూచించారు. సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్ సమాచారం ఉంటే డయల్ 100కు ఫిర్యాదు చేయాలని సూచించారు. క్రికెట్ అభిమానులకు కిక్కిచ్చే ఐపీఎల్ 19వ సీజన్ శనివారం బెంగళూరులో ప్రారంభమైంది. దాదాపు రెండు నెలలపాటు ఐపీఎల్ లీగ్ అభిమానులను అలరించనుంది. ఇక క్రికెట్ అభిమానులతో పాటు బెట్టింగ్ రాయుళ్లు కూడా ఐపీఎల్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏడాది బెట్టింగ్ ద్వారా వేల కోట్లు చేతులు మారుతుంటాయి. ముఖ్యంగా యువత ఎక్కువగా బెట్టింగులకు పాల్పడి అప్పులపాలవుతున్నారు. ఈనేపథ్యంలో బెట్టింగ్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ శనివారం ఎక్స్ వేదికగా హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి బతుకును ఛిద్రం చేసుకోవద్దని సూచించారు. 'ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. గతంలో నో టు బెట్టింగ్ యాప్స్ ప్రచారం ద్వారా వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్‌హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పైనా మా ప్రత్యేక నిఘా ఉంది. బెట్టింగ్ తో అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండి.' అని సీపీ సజ్జనార్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా కోరారు.

## ట్రంప్, మోడీ సంభాషణలో మస్క్ లేడు

మొదటి పేజీ తరువాయి

తాము ఆ వార్తను చూశామని, మార్చి 24న జరిగిన ఆ టెలిఫోన్ సంభాషణ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య మాత్రమే జరిగిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ గురించి చర్చించిన సమావేశంలో మస్క్ ఉన్నత స్థాయి సమావేశంలో చేరారని, పేరు చెప్పని అమెరికా అధికారులను ఉటంకిస్తూ ది న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఒక నివేదికలో పేర్కొన్న తర్వాత ఈ వివరణ వెలువడింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, మోడీ, ట్రంప్ మధ్య జరిగిన సంభాషణ ఆ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులపై కేంద్రీకృతమైంది. ఇంతకు ముందు చెప్పినట్లుగా, ఇది పశ్చిమ ఆసియాలోని పరిస్థితిపై అభిప్రాయాలను పంచుకోవడానికి అవకాశాన్ని కల్పించింది, అని ఆ ప్రతినిధి తెలిపారు. యుఎస్, ఇజ్రాయెల్ ఫిబ్రవరి 28న సైనిక దాడి ప్రారంభించిన నేపథ్యంలో ఈ ప్రాంతవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఇరువురి నాయకుల మధ్య ప్రత్యక్ష సంభాషణ జరిగింది. ఈ ఫోన్ కాల్ లో మాట్లాడుతున్న సమయంలో మస్క్ ఉన్నారని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఇద్దరు దేశాధినేతల మధ్య సంభాషణ జరిగేటప్పుడు, ముఖ్యంగా యుద్ధ సమయ సంభాషణలో ఒక ప్రైవేట్ వ్యక్తి అక్కడే ఉండటం అత్యంత అరుదు అని పేర్కొంది. ఈ సంభాషణల్లో మస్క్ ఎందుకు పాల్గొన్నారో, లేదా ఆ కాల్ సమయంలో ఆయన మాట్లాడారో లేదో స్పష్టంగా లేదని కూడా ఆ నివేదిక పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వంతో కలిసి పనిచేసిన మస్క్ — ఈ ఆరోపణలపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరణతో, ఆ కాల్‌పై నెలకొన్న ఊహాగానాలకు భారత్ తెరదించింది. ఆ ప్రాంతీయ అభివృద్ధిపై ఇద్దరు నాయకుల మధ్య జరిగిన ఆ సాధారణ ద్వైపాక్షిక సంభాషణ మాత్రమేనని భారత్ పునరుద్ఘాటించింది.

## కేంద్రానికి మెట్రో విస్తరణ ప్రతిపాదనలు

**హైదరాబాద్, మార్చి 28 (ఎఎంఎస్) :** విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కు మెట్రో నెట్ వర్క్ విస్తరించాలనే వివిధ వర్గాల డిమాండ్ మేరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విస్తరణకు ఉన్న అడ్డంకులను, ఎదురవుతున్న ఇబ్బందులను లోతుగా సమీక్షించింది. ప్రస్తుతమున్న మెట్రో ఫేజ్ 1 మొత్తం 69 కిలోమీటర్లు ఉండగా ఫేజ్ 2(ఏ) 76.4 కిలోమీటర్లు, ఫేజ్ 2 (బీ) 86.1 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రతిపాదనలను రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ మేరకు హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పరిస్థితిని శనివారం అసెంబ్లీలో సభ ముంచుంచింది. ఫేజ్–1 ప్రైవేట్ నిర్వహణలో ఉండగా, కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్–2 ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఎదురవుతున్న సాంకేతిక, చట్టపరమైన, నిర్వహణ సమస్యలను దృష్టిలోకి తీసుకుంది. కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్ 1 నెట్‌వర్క్ ను రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎంఆర్ఎల్ ద్వారా స్వాధీనం చేసుకునే నిర్ణయాన్ని ఈ సభ ఆమోదించింది. అందువల్ల.. మెట్రో ఫేజ్ 1 స్వాధీనం చేసుకునే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను గౌరవ సభ సమర్థించి, పూర్తి మద్దతు ప్రకటించింది

# ఆయిల్ సంక్షోభ తరణంలో ఇథనాల్ రైతుల' పాత్ర గొప్పది

మొదటి పేజీ తరువాయి

ఈ సంక్షోభ సమయంలో మన రైతుల కఠోర శ్రమ దేశానికి ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. దీనివల్ల దేశం లబ్ధి పొందింది, అలాగే రైతులు కూడా విశేషంగా ప్రయోజనం పొందారు. సుమారు రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా అయ్యింది. ఒకవేళ ఇథనాల్ లేకపోయి ఉంటే, ఈ సొమ్మంతా విదేశాలకు తరలిపోయేది," అని ఆయన పేర్కొన్నారు. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, వికసిత ఉత్తరప్రదేశ్, వికసిత భారత్ దిశగా సాగుతున్న ప్రయాణంలో నేడు ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది, అని అన్నారు. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుందని మోదీ పేర్కొన్నారు. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌కు చెందిన రైతులు, చిన్న వ్యాపారులు, యువతకు నాయిడా అంతర్జాతీయ విమానాశ్రయం సరికొత్త అవకాశాలను కల్పిస్తుంది, అని ఆయన తెలిపారు. భారత విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. భారతదేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తున్నందున, కొత్త విమానాలకు డిమాండ్ కూడా పెరుగుతోంది. ఫలితంగా, వివిధ విమానయాన సంస్థలు వందలాది కొత్త విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయి. ఈ కొత్త సౌకర్యాలు, విమానాలను నడపడానికి, సర్వీసింగ్ చేయడానికి, నిర్వహించడానికి పెద్ద సంఖ్యలో సిబ్బంది అవసరం అవుతారు. ఇది మన యువతకు ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తోంది. దీనికి మద్దతుగా, మా ప్రభుత్వం కూడా విమానయాన రంగ వ్యాప్తంగా శిక్షణా సౌకర్యాలను విస్తరిస్తోంది, అని ఆయన అన్నారు. ప్రధానమంత్రితో పాటుగా రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

**ఈ పర్యటన కోసం విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు**

సుమారు రూ. 11,200 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేస్తున్న ఈ విమానాశ్రయం మొదటి దశను, రోడ్డు, రైలు, మెట్రో, ప్రాంతీయ రవాణా వ్యవస్థల ద్వారా నిరంతరాయ అనుసంధానంతో కూడిన ఒక బహుళ–రవాణా కేంద్రంగా రూపొందించాలని భావిస్తున్నారు. ఒక అధికారిక ప్రకటన ప్రకారం, ఈ ప్రాజెక్ట్‌లో సంవత్సరానికి 2.5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ప్రారంభ నిర్వహణ సామర్థ్యం గల కార్గో హబ్ కూడా ఉంది, దీనిని సుమారు 18 లక్షల మెట్రిక్ టన్నుల వరకు విస్తరించవచ్చు. ఈ విమానాశ్రయ ప్రారంభ ప్రయాణీకుల నిర్వహణ సామర్థ్యం సంవత్సరానికి 12 మిలియన్ల ప్రయాణీకులుగా ఉంటుంది, దీనిని 70 మిలియన్ల వరకు పెంచవచ్చు. ప్రధానమంత్రి టెర్మినల్‌ను కూడా తనిఖీ చేశారు.

# వాడి తగ్గని ఇరాన్ దాడులు

మొదటి పేజీ తరువాయి

సుమారు 500మంది యుఎస్ సైనికులను గుర్తించి, వారిపై దాడులు చేసినట్టు ఐఆర్‌జిఎస్ అధికార ప్రతినిధి వెల్లడించారు. వీటితో పాటుగా, శనివారం ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను ఇజ్రాయెలీ సైన్యం గమనించిన తర్వాత జెరూసాలెంపై రెండు పేలుళ్లు వినిపించాయని ఎఎఫ్‌పి విలేకరులు చెబుతున్నారు. ఇరాన్ రాజధాని తెహ్రాన్ వ్యాప్తంగా ఉన్న స్థావరాలను లక్ష్యంగా చేసుకుని, వరుస వైమానిక దాడులను పూర్తి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన కొద్దిసేపటికే, ఈ దాడి జరిగినట్లు కనిపిస్తోంది. ఇలా ఉండగా, తమ దేశ రాజధాని రియాద్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను, డ్రోన్లను కూల్చివేసినట్టు సౌదీ అరేబియా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, తెహ్రాన్ దాడుల్లో కువైట్‌లోని పలు వాణిజ్య భవనాలు దెబ్బతిన్నట్టు కనిపిస్తోంది. ఇంత సంక్షోభం మధ్య కూడా ఐక్యరాజ్య సమితి అభ్యర్థన మేరకు హోర్మూజ్ జలసంధి గుండా మానవతా సా యం, వ్యవసాయ సరుకుల రవాణాను అనుమ తించడానికి ఇరాన్ అంగీకరించింది. దాదాపు నెలరోజులుగా ఇజ్రాయెల్, ఇరాన్ దాడులు, ప్రతిదాడులు నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ దాడులు ఆగే అవకాశం కనిపించడం లేదు.

తాజాగా ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేపట్టినట్టు ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ పేర్కొన్నారు. తమ దాడుల్లో అణ్వాయుధాల ముడి పదార్థాలను శుద్ధి చేసే కర్మాగారాలు ధ్వంసమయ్యాయని, ఇది తెహ్రాన్ అణు కార్యక్రమానికి పెద్ద దెబ్బ అని ఇజ్రాయెల్ తెలిపింది. టెల్ అవీల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్–అమెరికా దాడుల్లో ఇరాన్‌లోని పలు ఆసుపత్రులు, 82వేలకు పైగా పౌర నివాసాలు దెబ్బతిన్నాయని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ వలసల సంస్థ వెల్లడించింది. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే.. తీవ్రమైన విపత్తు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించింది. కాగా, హెజ్బొల్లా దాడుల నుంచి తమ ఉత్తర సరిహద్దు పట్టణాలను రక్షించుకునేందుకు ఆయా ప్రాంతాల్లో ఇజ్రాయెల్ తమ బలగాలను మోహరించింది. హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా చేపట్టిన దాడుల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.

# అంగన్‌వాడీలకు సొంత భవనాలు

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రధానంగా దృష్టి పెట్టాలన్న ఆలోచనతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని చేపట్టినట్లు వివరించారు. తల్లి గర్భంతో ఉన్నప్పుడు తల్లితో పాటు కడుపులోని శిశువు, అలాగే పుట్టిన తర్వాత పిల్లలకు ఎలాంటి పోషకాహారం అందించాలన్న అంశాలపై సమగ్రంగా చర్చించిన తర్వాత ఈ కార్యాచరణ చేపట్టామని వివరించారు. ప్రభుత్వం ఎంత మంచి కార్యక్రమం తీసుకొచ్చినా, క్షేత్రస్థాయి సిబ్బంది సరిగా అమలు చేసినప్పుడే దీనికి గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ఆ గురుతర బాధ్యత సంబంధిత శాఖాధికారులు, ఉద్యోగులదే అన్నారు. ఆకలిని మీరు అమ్మగా అర్థం చేసుకుంటారని, సమస్యలపై మీకు అవగాహన ఉంటుందని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. .మొదటి ఆరేండ్లు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. ఇది అత్యంత కీలక దశ అన్నారు. ఈ సమయంలో ఆరోగ్యవంతమైన ఆహారం అందించకపోతే ఆశించిన ఎదుగుదల ఉండదన్న సీఎం.. దీన్ని గ్రహించి అత్యంత పకడ్బంధీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అత్యంత విలువైన బాల్య దశ మీ చేతుల్లో ఉందనే విషయాన్ని మరచిపోవద్దని చెప్పారు. దేశంలో జనాభాకు తగ్గట్టు పోషకాహారం లేకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. జబ్బులు వచ్చిన తర్వాత చికిత్స కోసం రూ.వేల కోట్లు ఖర్చు పెడుతున్నామన్న సీఎం.. చికిత్స కన్నా జబ్బు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందనీ ఏమాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇ,చ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, పలు అంగన్‌వాడీ టీచర్లు, పలువురు పిల్లలు పాల్గొన్నారు.

# మైనింగ్ పై సభా యుద్ధం

మొదటి పేజీ తరువాయి

స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కసారిగా స్పీకర్ వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వంపై నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతున్న పనులు, మైనింగ్ అక్రమాలు , టెండర్లలో జరుగుతున్న అవకతవకలపై తక్షణమే హౌస్ కమిటీ వేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. మంత్రి పదవిని అడ్డం పెట్టుకుని తన సొంత సంస్థకు లబ్ధి చేకూరుస్తున్నారని, దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యుల తీరుపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సభా సమయాన్ని వృథా చేస్తున్నారని మంత్రులు మండిపడ్డారు. గందరగోళం మధ్యే సభను అదుపులోకి తెచ్చేందుకు స్పీకర్ ప్రయత్నించినప్పటికీ, సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సభలో ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ ఆరోపణలను గతంలోనే తోసిపుచ్చినప్పటికీ, ప్రతిపక్షం మాత్రం ఈ విషయాన్ని వదిలిపెట్టలేదు. మొత్తానికి ఈ వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామం (సర్వే నంబర్ 62, 63)లో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతోందని, చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "లైసెన్స్ లేకుండా అక్రమ మైనింగ్ చేస్తే ఏడాది జైలు శిక్ష పడాలని చట్టం చెబుతోంది. మరి ఇన్ని నోటీసులు ఇచ్చినా, మైనింగ్ శాఖ లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని హరీష్ రావు ప్రశ్నించారు.

**ఒకరికి ఒక న్యాయం.. మరొకరికి మరో అన్యాయమా?**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును హరీష్ రావు గుర్తు చేశారు. "మహిపాల్ రెడ్డి తమ్ముడు నా తమ్ముడు లాంటి వాడు. 20 ఏళ్లుగా మేమంతా కలిసి పనిచేశాం. చిన్న తప్పు జరిగిందని ఆయనను రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారు. మరి పొంగులేటి సంస్థపై ఎందుకు చర్యలు లేవు? ప్రతిపక్షానికి ఒక న్యాయం, అధికార పక్షానికి ఒక న్యాయమా?" అంటూ నిలదీశారు. అక్రమ మైనింగ్‌పై తాను ట్వీట్ చేస్తే.. మంత్రి పొంగులేటి తనను "మొరిగే కుక్కలు" అంటూ సంబోధించడాన్ని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. "నన్ను అంత మాట అన్నందుకే నేరుగా చెబుతున్నాను.. అది పొంగులేటి సంస్థే! అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. ఆయన మంత్రిగా ఉంటే విచారణ సరిగ్గా జరగదు. అందుకే వెంటనే రాజీనామా చేసి ఎంక్వైరీకి ఆదేశించాలి" అని డిమాండ్ చేశారు.

**నన్ను ఉరి తీయండి.. లేదా సస్పెండ్ చేయండి**

ఈ సందర్భంగా హరీష్ రావు ప్రభుత్వానికి సవాల్ చేశారు. "నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి లేదా ఎమ్మెల్యేగా సస్పెండ్ చేయండి. ఒకవేళ నేను చెప్పేవి నిజాలైతే వెంటనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మీద కఠిన చర్యలు తీసుకోండి." అని హరీష్ రావు సంచలన ప్రకటన చేశారు. ఈ పరిణామాలతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది, ప్రభుత్వం ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

**మండిపడ్డ భట్టి..** బీఆర్ఎస్ నిరసనపై స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. రోడ్లపై అల్లరి చేసినట్లు బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందని ఆక్షేపించారు. వెల్ లోకి వచ్చి చప్పట్లు కొడుతూ నిరసన వ్యక్తం చేయడం ఇదెక్కడి సంప్రదాయం? పవిత్రమైన సభలో చిన్నపిల్లలాట లాంటి ఈ వ్యవహారం ఎక్కడిదన్నారు. మీరు చేసిన ఆరోపణలన్నీ వాస్తవం అనుకుంటే ఎలా అని భట్టి ప్రశ్నించారు. ప్రతిపక్ష బాధ్యతతో మీరు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. చట్ట ప్రకారం ఎలా వెళ్లాలో అలా ముందుకు వెళ్తుందన్నారు. బీఆర్ఎస్ తీరు సభను యావత్ ప్రజాస్వామ్యాన్ని అగౌరవ పరుస్తోందన్నారు. బీఆర్ఎస్ బాధ్యత రాహిత్యాన్ని యావత్ తెలంగాణ ప్రజానీకం చూస్తోందన్నారు. బీఆర్ఎస్ చెప్పినట్లుగానే స్పీకర్ వ్యవహరించాలని, వారి ప్రకారమే ప్రభుత్వం వ్యవహరించడం కుదరదన్నారు. ఇదేం పద్ధతి అని మండిపడ్డారు.

**అక్రమ మైనింగ్ పై అట్టుడికిన అసెంబ్లీ..**

హైదరాబాద్ నగర శివారుల్లో, నగరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ సాగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. శాసనసభలో మైనింగ్ శాఖ డిమాండ్లపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న తీరును ఆధారాలతో సహా సభ ముందు ఉంచారు. మైనింగ్ శాఖ అనేది రాష్ట్రానికి పన్నేతర ఆదాయాన్ని సమకూర్చే అత్యంత కీలకమైన శాఖ అని, ఇక్కడ ప్రభుత్వం , అధికారులు ఎంత జాగ్రత్తగా ఉంటే రాష్ట్ర ఖజానాకు అంత మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు 'కంచే చేను మేసినట్లు' ఉన్నాయని హరీష్ రావు విమర్శించారు. రక్షకులే భక్షకులుగా మారుతుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆరోపించారు. తాను చేసే ప్రతి ఆరోపణకూ ప్రభుత్వ డాక్యుమెంట్లే సాక్ష్యమని, ఏ ఒక్క మాట కూడా గాలిలో మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నడిబొడ్డున ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ మైనింగ్ వ్యాపారాలు దర్జాగా సాగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న మనం రాష్ట్రానికి వచ్చే ప్రతి పైసాను కాపాడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. స్టోన్ క్రషర్ల నిర్వహణలో జరుగుతున్న అక్రమాలను ఆయన సభలో ప్రస్తావించారు. ప్రభుత్వం ఇటీవల తెచ్చిన 'తెలంగాణ స్టోన్ క్రషర్ రూల్స్ 2025' (జీఓ నెంబర్ 26) నిబంధనలను తుంగలో తొక్కి, నగర పరిసరాల్లో డీజిల్ జనరేటర్ల సహాయంతో క్రషర్లు నడుపుతున్నారని ఆరోపించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికే కాకుండా ప్రభుత్వ ఖజానాకు కూడా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, దీన్ని ఒక సద్విమర్శగా తీసుకుని ప్రభుత్వం తక్షణమే సరిదిద్దుకోవాలని సూచించారు. తాను సేకరించిన అన్ని డాక్యుమెంట్లను మంత్రికి అందజేస్తానని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుని రాష్ట్ర ఆదాయాన్ని కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

**సీబీసీఐడీ విచారణకు సీఎం ఆదేశం**

హరీశ్ రావు చేసిన ఆరోపణలపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మైనింగ్ పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. సిరిసిల్ల ఇసుక మాఫియాపై సంతోష్ రావు, తండ్రి రవీందర్ రావు పై విచారణకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అదే విధంగా గంగుల కమలాకర్ సంబంధించి ఇల్లీగల్ గ్రానైట్ మైనింగ్ పై విచారణకు సిద్ధంగా ఉన్నామన్నారు. వీరితో పాటు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్ పై విచారణకు సిద్ధమన్న సీఎం.. రాఘవ కన్స్ట్రక్షన్ తో పాటు వీటన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. ఈ విచారణలో నిజాలు నిగ్గు తేలుస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎలాంటి తప్పిదాలు జరిగినా తమ ప్రభుత్వం ఉపేక్షించదని తేల్చి చెప్పారు. అందులో భాగంగానే రాఘవ కన్స్ట్రక్షన్స్ కు నోటీసులు ఇచ్చి... చర్యలు తీసుకోమని చెప్పానన్నారు. రాఘవ కన్స్ట్రక్షన్ నుంచి మైనింగ్ శాఖ జరిమానా కట్టించుకుందన్న సీఎం.. ఇది వాళ్లు కనిపెట్టి ఫిర్యాదు చేస్తే తీసుకున్న చర్యలు కాదన్నారు. తమ ప్రభుత్వమే వివరాలు తీసుకుని చర్యలు తీసుకుందన్నారు. మంత్రిపై బురద చల్లాలని, వాళ్ల పైరవీలకు సహకరించడం లేదని బ్లాక్ మెయిల్ చేయాలని ప్రయత్నిస్తున్నారని సీఎం మండిపడ్డారు. ప్రతిపక్షాల బ్లాక్ మెయిల్ లకు ప్రభుత్వం లొంగదన్న సీఎం... సీబీసీఐడీ విచారణతో నిజాలు నిగ్గు తెలుస్తామని స్పష్టం చేశారు.

**పోలీసు, ఆర్టీసీ, బీసీ సంక్షేమాన్ని కోరుతూ బీఆర్ఎస్ వాకౌట్**

శనివారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత పోలీసు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీ నుండి వాకౌట్ చేసింది. అంతకు ముందు మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శాసనసభలో మాట్లాడుతూ.. వడ్డించే వాడు మనవాడు అయితే లడ్డు ఎక్కడున్న వస్తుంది అంటారు కానీ, పోలీసు శాఖ ముఖ్యమంత్రి వద్దనే ఉండి కూడా ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు. ఈ రాష్ట్రం కోసం సమాజం కోసం ఎంతో పని చేస్తున్నారన్నారు. కేసీఆర్ పోలీసులను ఎంతో గౌరవించారని 40,50వేల పోలీసు పోస్టులు భర్తీ చేసి కొత్త కమీషనరేట్లు ఏర్పాటు చేశారన్నారు. ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేశారని చెప్పారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్న ఆయన.. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారన్నారు. కొత్తగూడెం జిల్లాలో 72 టీఏలు పెండింగ్‌లో ఉన్నాయనీ కొన్ని జిల్లాల్లో ఇచ్చి కొన్ని జిల్లాల్లో పెండింగ్ పెట్టారని ఆరోపించారు. లక్షా 30వేల మంది పోలీసుల తరుపున మాట్లాడుతున్నానని గతేడాది కంటే రూ. 400 కోట్ల బడ్జెట్ ఎందుకు తగ్గించారని నిలదీశారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గింది? అని ప్రశ్నించారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అష్యూరెన్స్ లేదన్నారు.అలాగే పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయడం లేదని పోలీసుల ఆరోగ్య భద్రత పథకం పై భరోసా ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పడం లేదని పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం ఇవ్వడం లేదన్నారు. బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు, బీసీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపుపై వైఖరి చెప్పడం లేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పడం లేదని వీటన్నింటికి నిరసనగా సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

**మెట్రో తీర్మానంపై హరీశ్ నిరసన..**

హైదరాబాద్ మెట్రోపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. ఎల్ అండ్ టీ నుంచి మెట్రోను స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. దీనిపై అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి.. ఈ ఏకగ్రీవ తీర్మానానికి సభ్యులంతా ఆమోదం తెలపాలని కోరారు. మెట్రో విస్తరణకు ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే స్వాధీన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రజా రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగు పరిచి, మెట్రో నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు కావలసిన ప్రణాళికలను రచించామన్నారు. అనంతరం మెట్రో స్వాధీనాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ క్రమంలో మెట్రోపై సీఎం చేసిన ప్రకటనపై హరీష్ రావు నిరసన తెలిపారు. ఇది ఏకగ్రీవ తీర్మానం కాదని, ఏకపక్ష తీర్మానమని విమర్శించారు. బీఆర్ఎస్ సభ్యుల అభిప్రాయం తీసుకోకుండా ఏకగ్రీవంగా బిల్లును ఎలా పాస్ చేస్తారని ప్రశ్నించారు. శాసనసభ నడిపే వ్యవహారం, పద్ధతి ఇది కాదన్నారు. ప్రకటన చేసే హక్కు ఉంది కానీ.. దానిపై ఎలాంటి చర్చ జరపకుండా సభ్యులంతా ఆమోదించినందుకు ధన్యవాదాలు అని ఎలా చెప్తారని ఫైరయ్యారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలుపుతున్నారన్నారు.

**సభలో మంత్రి పొన్నం సెన్స్ షేనల్**

అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ శివ పార్వతులు వారిద్దరి కుమారులకు సంబంధించిన చిత్రపటాన్ని సభలో ప్రదర్శించారు. దీంతో రూల్స్ ప్రకారం సభలో ఫోటోలు చూయించవద్దు కదా అని ప్రతిపక్ష సభ్యులు అడ్డు చెప్పడంతో తాను అనుమతి తీసుకున్నానని చెప్పారు. సభలో రవాణాశాఖ, బీసీ సంక్షేమ శాఖకు కేటాయింపులపై చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇస్తూ. ఇటీవల వేములవాడకు శృంగేరి పీఠాధిపతి వచ్చినప్పుడు అక్కడ శంకరుడి కుటుంబానికి సంబంధించిన చిత్ర పటాన్ని చూపిస్తూ అందులోని వైరుధ్యాలు ఉన్నా కలిసి ఉండాల్సిన విషయాలను వివరించారని చెప్పారు. శంకరుని పరివారానికి సంబంధించిన చిత్రపటంలో శంకరుని వాహనం నంది, పార్వతి వాహనం సింహం, కుమారస్వామి వాహనం నెమలి, వినాయకుడి వాహనం ఎలుక ఉంటాయి. వీటిలో ఒకదానికి మరొక దానితో పడదు. కానీ దైవభక్తి విషయంలో అన్ని కలిసే ఉంటున్నాయన్నారు.

**వాకౌట్ డ్రామాలొద్దు.. : మంత్రి శ్రీధర్ బాబు**

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై దుద్దిళ్ల శ్రీధర్ బాబు విరుచుకుపడ్డారు. ముఖ్యమైన అంశాలపై సభలో చర్చ జరుగుతుంటే వాకౌట్ చేయడం బీఆర్ఎస్ సభ్యుల చిత్తశుద్ధి లేమికి నిదర్శనమని మండిపడ్డారు. గత పదేళ్ల పాలనలో బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని ఆరోపించారు. అలాంటిది ఇప్పుడు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు వారికి ఎక్కడిదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై తమ ప్రభుత్వం రాహుల్ గాంధీ ఆలోచనల మేరకు అడుగు ముందుకేస్తుంటే, బీఆర్ఎస్ సభ్యులు అక్కసుతో పది అడుగులు వెనక్కి లాగే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలా బయటకు వెళ్లి, మళ్లీ అలా లోపలికి రావడం ఏంటని ఫైర్ అయ్యారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనే విషయం మర్చిపోవద్దని హితవు పలికారు. బీసీలపై నిజంగా ప్రేమ ఉంటే బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని, వాటిని స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. కేవలం ఇన్నోవాలు సమకూర్చడమే పోలీస్ సంక్షేమం కాదని, పోలీసుల నిజమైన సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కార్మికులు సమ్మె చేసినప్పుడు కనీసం మాట్లాడేందుకు ఒక్కరంటే ఒక్కరూ వెళ్లలేదని విమర్శించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించింది తమ ప్రభుత్వమేనని వివరించారు. పారదర్శకత కోసం టెక్నాలజీ ఆధారిత విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని వెల్లడించారు.

**వచ్చే ఎనిమిదేళ్లూ మాదే అధికారం..**

ప్రభుత్వ కాలపరిమితిపై వస్తున్న ప్రచారాలకు మంత్రి శ్రీధర్ బాబు గట్టి కౌంటర్ ఇచ్చారు. తమకు ఇంకా మూడేళ్ల సమయం ఉందని.. ఆ తర్వాత కూడా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది తామేనని స్పష్టం చేశారు. అంటే మొత్తం ఎనిమిదేళ్ల సమయం తమకు ఉందంటూ సెటైర్లు వేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తామని శ్రీధర్ బాబు అన్నారు

# మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

హైదరాబాద్ మరో ఢిల్లీని చేయం

విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా వెనక్కి తగ్గం

ఇదో దైవకార్యం..అడ్డుకునే వారిపై శివతాండవం చేస్తాం

ఉప్పల్–నాగోల్ లో చర్చి, పురానాపూల్‌లో మసీదును నిర్మిస్తాం

గోదావరి జలాలను మూసీకి తరలించి నిరంతర జలప్రవాహం చేస్తాం

మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**హైదరాబాద్, మార్చి 28 (వుదయం, ప్రతినిధి) :** విపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా మూసీ పునరుజ్జీవనం ఆగదని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీ ప్రక్షాళనను ఒక యజ్ఞంలా భావిస్తున్నామన్న ఆయన దాన్ని అడ్డుకునే వారు ప్రజల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. కాలుష్య రహిత మూసీ ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ ప్రక్షాళన అనివార్యమన్న ఆయన లేకపోతే హైదరాబాద్ మహానగరం మరో ఢిల్లీలా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.శనివారం మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఎనిమిది ఎకరాల్లో నిర్మించే ఈ క్షేత్రంలో వంద అడుగుల శివుడి విగ్రహం ప్రధాన ఆకర్షణగా నిలవనుందని చెప్పారు. మూసీ నది ఒడ్డున మంచిరేవులలో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణ కార్యక్రమం దేవుడి నిర్ణయమన్నారు. అ ఆలయాన్ని నిర్మించడం భగవత్ కార్యంగా భావిస్తున్నామన్నారు. మూసీ నదిని బాగు చేయాలని గతంలో అనేక మంది ప్రయత్నించారన్న సీఎం.. ఈ అవకాశం తమ ప్రభుత్వానికి దక్కడం అదృష్టమన్నారు. మూసీ వేదిక మత సామరస్యానికి కానుందని సీఎం వ్యాఖ్యానించారు. ఉప్పల్–నాగోల్ ప్రాంతంలో అద్భుతమైన చర్చి, పురానాపూల్‌లో మసీదు నిర్మిస్తామని వెల్లడించారు. అద్భుతమైన పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మూసీని తీర్చిదిద్దుతామని, గోదావరి జలాలను మూసీకి తరలించి నిత్యం జల ప్రవాహం ఉండేలా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం తమకు బాధ్యతే కాదు, పవిత్ర కార్యమని చెప్పారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే నాగరికత అభివృద్ధి చెందిందన్నారు. సముద్ర తీరంలోనే నగరాలు వెలిశాయన్న ఆయన దేశాల అభివృద్ధికి సముద్రాలు, నదులే ఆధారమని చెప్పారు. నదీ జలాలను సరిగా వాడుకోకుంటే ఎంతో నష్టమన్నారు. తెలిసో తెలియకో నదులను కలుషితం చేస్తున్నామన్న సీఎం... కాలుష్యంతోనే వచ్చే సమస్యలేంటో ఢిల్లీని చూస్తే తెలుస్తోందని చెప్పారు.

**పునరుజ్జీవాన్ని అడ్డుకుంటే శివ తాండవం..!** ఈశ్వరుడి ఆశీర్వాదంతో మూసీ నది ప్రక్షాళన చేస్తామని సీఎం చెప్పారు. ఎవరైనా అడ్డుపడితే రాష్ట్ర ప్రభుత్వం శివతాండవం చేస్తుందని హెచ్చరించారు. కాలుష్యంతో భావితరాలు నాశనమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పిల్లలకు అనేక వ్యాధులు వస్తున్నాయన్నారు. అసలు మూసీనది కాలుష్యం అనేది మానవ తప్పిదమని చెప్పారు. ఇది ప్రకృతి తప్పిదం కాదన్నారు మానవ తప్పిదాన్ని అరికట్టాలని లేకుంటే భావితరాలు నష్టపోతాయన్నారు. వాళ్లు చేయలేని పనిని ఎవరూ చేయకూడదని కొంతమంది అడ్డుపడుతున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలు చూసి ఎన్జీటీలో కేసు ఎలా వేశారని నిలదీశారు. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు పటోళ్ల కార్తీక్ రెడ్డి వేసిన కేసును వెనక్కి తీసుకోవాలన్న సీఎం.. ఇప్పటికైనా మనసు మార్చుకోవాలని సబిత్కను కోరుతున్నానని వెల్లడించారు. లేకుటే ఈ ప్రాంత ప్రజలు సామాజిక బహిష్కరణ చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు పూర్తి చేసి తీరుతామని సీఎం స్పష్టం చేశారు..

**మూసీతో ఉమ్మడి నల్లగొండ అల్లాడుతోంది..**

హైదరాబాద్ కాలుష్యమంతా మూసీలో కలుస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి, దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఫ్లోరైడ్‌తో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, అందుకే మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని అన్నారు. కానీ, కొందరు రాజకీయ కారణాలతో పనులను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని, గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి అడ్డుకోవాలని చూస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అంతకు ముందు గండిపేట మండలం మంచిరేవులలో సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా వీరభద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఓంకారేశ్వర స్వామి ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క , పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ ఆలయ నిర్మాణానికి ఇప్పటికే డిజైన్ ఖరారు కాగా.. త్రీడీ వీడియోను కూడా ప్రభుత్వం రిలీజ్ చేసింది. చారిత్రక వీరభద్ర స్వామి ఆలయానికి సమీపంలోనే ఓంకారేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు. 8 ఎకరాల్లో రూ.700 కోట్లతో ఓంకారేశ్వరస్వామి ఆలయ నిర్మాణం జరగనుంది. మూసీ నదిలో 100 అడుగులు శివుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ప్రభుత్వం చెబుతోంది. పార్కులు, బోటింగ్‌తో పాటు విశాలమైన పార్కింగ్ సదుపాయాలు కల్పించనున్నారు.

# రణరంగంలోకి హౌతీల ప్రవేశం

మొదటి పేజీ తరువాయి

ఎర్ర సముద్రంలో ఉద్రిక్తతలు అధికంగానే ఉన్నాయి గాజా యుద్ధ సమయంలో హౌతీలు ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్‌లో నౌకా రవాణాపై దాడి చేసినప్పటికీ, ప్రస్తుత సంఘర్షణలో వారు ఇంకా అటువంటి చర్యలను పునఃప్రారంభించలేదు. అయినప్పటికీ, వారి హెచ్చరికలు ఈ ప్రాంతంలో సముద్ర భద్రతపై ఆందోళనలను పెంచాయి. కొనసాగుతున్న యుద్ధంలో ఎర్ర సముద్రం వ్యూహాత్మక ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని సమర్థవంతంగా మూసివేయడంతో, ప్రధాన చమురు ప్రవాహాలు దారి మళ్లించబడ్డాయి. సౌదీ అరేబియా తన ఎగుమతులలో గణనీయమైన వాటాను ఎర్ర సముద్రంలోని యాన్‌బు ఓడరేవుకు మళ్లించింది.



# గ్రేటర్ హైదరాబాద్




**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో పొందగలరు.

**ఇ-టెండర్ ప్రకటన నెం: N-SG-36- 2025-26-Conf-48, తేదీ: 23.03.2026** PUB/2188

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి ఆదేశాల మేరకు, Sr.DSTE/NED వారు ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ సంఖ్య మరియు తేదీ: N-SG-36-2025-26-Conf-48, తేదీ 23.03.2026. **పని పేరు:** నాందేడ్ (NED) లోని DRM కార్యాలయ ప్రాంగణంలో, తమ నిర్దేశిత కాలపరిమితి (Codal Life) పూర్తి చేసుకున్న కాన్ఫరెన్స్ హాల్ పరికరాల మార్పిడి (టెలికాం ఏర్పాట్ల విస్తరణ/ అప్‌గ్రేడేషన్). **అంచనా ప్రాజెక్టు వ్యయం (రూ.):** ₹ 57,87,118/-. **బిడ్ భద్రతా మొత్తం (Bid Security) (రూ.):** ₹ 1,15,800/-. **పని పూర్తి చేయడానికి గడువు:** 09 నెలలు. **బిడ్ దాఖలుకు చివరి తేదీ (Bid Due Date):** 15.04.2026న 15:00 గంటల వరకు. **బిడ్ల ప్రారంభ తేదీ:** 15.04.2026న 15:00 గంటల తర్వాత. **ఆఫర్ చెల్లుబాటు కాలం:** బిడ్ దాఖలుకు చివరి తేదీ నుండి 60 రోజులు. **టెండర్ పుస్తకం ధర (రూ.):** ₹ 0/-.

బిడ్ల దాఖలు ప్రక్రియ అంతా భారతీయ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in ద్వారా మాత్రమే జరుగుతుంది. ఈ టెండర్‌కు సంబంధించి మాన్యువల్ (చేతి రాత/ కాగితపు రూపు) ఆఫర్లకు అనుమతి లేదు. తదుపరి వివరాలను www.ireps.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్.

**ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-23-2025-26 తేదీ: 24.03.2026** PUB/2189

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి ఆదేశాల మేరకు, దిగువ సంతకం చేసిన అధికారి, 15.04.2026 తేదీన మధ్యాహ్నం 3:00 గంటల వరకు, ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 టెండర్ సంఖ్య: B/E.221/TRS/RC/572 ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-23-2025-26 తేదీ: 24.03.2026 పని పేరు: విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్‌లో BG ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ల (WAP4, WAG5, WAP7 & WAG9 HC) బోగీ ఫ్రేమ్‌ల మధ్యంతర మరమ్మత్తు (Intermediate over-hauling) పనులు. **టెండర్ విలువ (రూ.):** 2,45,36,156.63 **E.M.D (ముందస్తు ధరావత్తు):** 4,90,700/- **టెండర్ పత్రాల ధర (రూ.):** 0 **పని పూర్తి కాలపరిమితి:** 24 నెలలు (2 సంవత్సరాలు) **టెండర్ ముగింపు తేదీ & సమయం:** 15.04.2026, మధ్యాహ్నం 3.00 గంటలు.

1) టెండర్ నిబంధనలు / పని పేరు పూర్తి వివరాలు, పైన పేర్కొన్న పనికి సమానమైన స్వభావం గల పనులు, అర్హత ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు www.ireps.gov.in అనే వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్ దాఖలు చేయాలనుకునే వారు, ఏదైనా టెండర్‌కు సంబంధించి ఏవైనా మార్పులు / సవరణలు (corrigenda) ఉన్నాయేమో గమనించడానికి, టెండర్ ముగింపు తేదీకి ముందే www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవలసిందిగా సూచించడమైనది.
3) ఈ టెండర్ ప్రకటన, విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్, ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ విభాగంలో ఉన్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై కూడా ప్రదర్శించబడింది; ఆసక్తి గలవారు దీనిని అక్కడ చూడవచ్చు.
4) ఎటువంటి కారణం చూపకుండానే టెండర్ను రద్దు చేసే హక్కు రైల్వే శాఖకు ప్రత్యేకంగా ఉంది.

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS), ELS, విజయవాడ.

**ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-24-2025-26 తేదీ: 24.03.2026** PUB/2190

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి ఆదేశాల మేరకు, దిగువ సంతకం చేసిన అధికారి, 15.04.2026 తేదీన మధ్యాహ్నం 3:00 గంటల వరకు, ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.: 01 టెండర్ సంఖ్య: B/E.221/TRS/RC/573 ఇ-టెండర్ నెం: ELS-BZA-eTN-24-2025-26 తేదీ: 24.03.2026 పని పేరు: ELS/BZA - Hitachi TM Stators (రకం HS15250A) యొక్క యాంత్రిక పునరుద్ధరణ (Mechanical Rehabilitation). **టెండర్ విలువ (రూ.):** 69,60,080.05 **E.M.D (రూ.):** 1,39,200/- **టెండర్ పత్రం ధర (రూ.):** 0 **పని పూర్తి కాలం:** 24 నెలలు (2 సంవత్సరాలు) **టెండర్ ముగింపు తేదీ & సమయం:** 15.04.2026, 15.00 గంటలు.

1) టెండర్ నిబంధనలు / ఇతర వివరాలు (పని పేరు పూర్తి వివరాలు, పై పనికి సమానమైన స్వభావం గల పనులు, అర్హత ప్రమాణాలు మొదలైనవి) www.ireps.gov.in అనే వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్ ముగింపు తేదీకి ముందే, ఏవైనా మార్పులు / సవరణలు (corrigenda) ఉన్నాయేమో గమనించడానికి, ఆసక్తిగల టెండర్ దారులు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
3) ఈ టెండర్ ప్రకటన, విజయవాడలోని ఎలక్ట్రిక్ లోకో షెడ్, ట్రాక్షన్ రోలింగ్ స్టాక్ విభాగంలో ఉన్న సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై కూడా ప్రదర్శించబడింది; దీనిని అక్కడ చూడవచ్చు.
4) ఎటువంటి కారణం చూపకుండానే టెండర్ను రద్దు చేసే హక్కు రైల్వే శాఖకు ప్రత్యేకించబడి ఉంది.

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (TRS), ELS, విజయవాడ.

**టెండర్ ప్రకటన నెం: CRS-E-15-25-26** PUB/2192

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి తరపున వ్యవహరిస్తున్న, DY.CME/CRS/TPTY, ఇక్కడ పేర్కొన్న టెండర్ నెం: కు గాను, క్రింద పేర్కొన్న చివరి తేదీ ఉదయం 11:00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు తమ అసలు / సవరించిన బిడ్లను చివరి తేదీ మరియు సమయం వరకు మాత్రమే సమర్పించగలరు. ఈ టెండర్‌కు మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు, మరియు స్వీకరించబడిన అటువంటి ఏదైనా మాన్యువల్ ఆఫర్ విస్మరించబడుతుంది.

క్ర.సం.: 01 పని వివరణ: టెండర్ నెం: CRS-E-15-25-26 తిరుపతిలోని క్యారేజ్ రిపేర్ షాప్ వద్ద విద్యుత్ సరఫరా ఏర్పాట్ల విశ్వసనీయతను మెరుగుపరచడానికి వెస్ట్ కాలనీలో OH లైన్లను UG కేబుల్స్‌గా మార్చడం సుమారు. **వ్యయం (రూ.)లలో:** 1,86,00,143.50/- **బిడ్ సెక్యూరిటీ (రూ.)లలో:** 3,72,000 **పూర్తిచేయడానికి కాలపరిమితి:** 90 రోజులు **ముగింపు తేదీ:** 16.04.2026 ఉదయం 11:00 గంటలకు.

వెబ్‌సైట్ వివరాలు: www.ireps.gov.in

టెండర్ పూర్తి వివరాలు చూడగలిగే నోటీస్ బోర్డ్ చిరునామా: చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ రిపేర్ షాప్, తిరుపతి. మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం (టెండర్ పత్రాలలో లభ్యం) మరియు టెండర్ పత్రాలు, సవరణలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి మా వెబ్‌సైట్ https://www.ireps.gov.in ను సందర్శించండి.

డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, CRS, తిరుపతి


## ప్రగతి సేవ సమితి ఉచిత హెల్త్ క్యాంపు

**కుత్బుల్లాపూర్, మార్చి 28 (వుదయం ప్రతినిధి ):**



శ్రీరామ నవమి సందర్భంగా నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి మండల్, సాయినగర్ కాలనీలో ప్రగతి సేవా సమితి, నెక్సిజన్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ ఏర్పాటు చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ కాసాని శిరీష ముదిరాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఉచిత హెల్త్ క్యాంపు ను ప్రారంభించారు. కాలనీవాసులకు పలు రకాల ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని, ప్రగతి సేవా సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ ప్రసాద్, అధ్యక్షులు పద్మావతి, విటల్, శ్రీనివాస్, కె.శ్రీనివాస్, చౌదరి, మాధవి, రాజ్ కుమార్, నవీన్, నెక్సిజన్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


**ఇ-టెండర్ ప్రకటన నెం: S&T/06/2026, తేదీ: 26.03.2026.** PUB/2191

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి ఆదేశాల మేరకు, దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్లు విభాగం యొక్క సీనియర్ డివిజనల్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్వహణ), 20.04.2026 తేదీన మధ్యాహ్నం 3.00 గంటల వరకు, ఈ క్రింది పనుల కోసం ఇ-టెండర్లను (ఓపెన్) ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం: 01-SNT-06-2026 పని వివరణ (సిగ్నల్ మరియు టెలికాం పనులు):** (1) గుంతకల్లు డివిజన్‌లోని RU-GY సెక్షన్‌లో TTR (రైలు పట్టాల మార్పిడి) పనులకు సంబంధించిన S&T (సిగ్నల్ మరియు టెలికాం) అవసరాలు. (2) గుంతకల్లు డివిజన్‌లోని BAY-GTL & GTL-WD సెక్షన్లలో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (3) గుంతకల్లు డివిజన్‌లోని RU-TPTY-KPD సెక్షన్‌లో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (4) గుంతకల్లు డివిజన్‌లోని GDR-TPTY సెక్షన్‌లో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (5) గుంతకల్లు డివిజన్‌లోని RU-GY & NDL-DHNE సెక్షన్లలో TTR పనులకు సంబంధించిన S&T అవసరాలు. (6) ONTIMITTA (VNM) స్టేషన్: ప్రతిపాదిత PQRS సైడింగ్‌కు సంబంధించిన సిగ్నలింగ్ & టెలికాం ఏర్పాట్లు. (7) SSE/P-Way/CTO అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (8) SSE/P-Way/PAK అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (9) SSE/P-Way/ATP అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (10) SSE/P-Way/KLU అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (11) SSE/P-Way/MPL అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. (12) SSE/P-Way/GY అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు మరియు (13) SSE/P-Way/KDP అధికార పరిధిలోని వివిధ యార్డులలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత యార్డు అభివృద్ధి మరియు ఆధునీకరణ పనులకు సంబంధించిన S&T అవసరాలు. **పని యొక్క ప్రకటిత టెండర్ విలువ (రూ.):** 7,80,11,605.40. **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) (రూ.):** 5,40,100.00. **పనుల పూర్తి కాలపరిమితి:** 12 నెలలు.

టెండర్ల ప్రారంభ తేదీని ఆ తర్వాత సెలవు దినంగా ప్రకటించినట్లయితే, టెండర్లను తదుపరి పని దినాన నిర్దేశించిన సమయంలో తెరవడం జరుగుతుంది. ఆఫర్ యొక్క చెల్లుబాటు, టెండర్లు తెరిచిన తేదీ నుండి **60 రోజులు** ఉండాలి. అవసరమైతే, పై టెండర్ నోటీసుకు సవరణలు (corrigendum) కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడతాయి. మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, (ఎం), గుంతకల్.

**టెండర్ ప్రకటన నెం: B-E29-TRD-TNDR-49-2025-26 తేదీ: 25.03.2026** PUB/2194

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి ఆదేశాల మేరకు, ఈ క్రింద సంతకం చేసిన అధికారి ఈ క్రింది పని కోసం ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**టెండర్ నెం:** B-E29-TRD-TNDR-49-2025-26 **పని పేరు:** BZA డివిజన్‌లోని NDD యార్డ్‌లో యార్డ్ పునఃవ్యవస్థీకరణ పనులకు సంబంధించి OHE (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్)లో అదనపు పనులు మరియు మార్పులు చేయడం. **సుమారు విలువ (రూ.):** 1,73,36,827.70 **బిడ్ సెక్యూరిటీ (EMD) (రూ.):** 2,36,700/- **పని పూర్తి కాలం:** 12 నెలలు **ముగింపు తేదీ:** 16.04.2026 **టెండర్ ఫారం ధర:** నిల్ (Nil).

పూర్తి వివరాలు మరియు నిబంధనల కోసం మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను సందర్శించండి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, TrD, విజయవాడ.

**ఇ-టెండర్ ప్రకటన నెం: GNT/SG/36/373 తేది: 25.03.2026** PUB/2195

ఈ క్రింద పేర్కొన్న పనుల కోసం, **17.04.2026** తేదీ సాయంత్రం **4:00** గంటల వరకు ఇ-టెండర్లను ఈ క్రింద సంతకం చేసిన అధికారి ఆహ్వానిస్తున్నారు.

ఐడి నెం: 373 పని పేరు: గుంటూరు డివిజన్ పరిధిలోని GNT-RAL & PGRN-SYM సెక్షన్ల రైలు మార్గం (Track) పక్కన 2x48 OFC (96 ఫైబర్లు) సరఫరా, అమర్చడం (Laying), కందకాలు తవ్వడం (trenching), డక్ట్ వేయడం, బ్లోయింగ్ మరియు టెర్మినేషన్ పనులు. **ప్రకటించిన టెండర్ విలువ (రూ.):** 9,03,54,104.15 **E.M.D/బిడ్-సెక్యూరిటీ (రూ.):** 18,07,100/- **టెండర్ పత్రం ధర (రూ.):** నిల్ (NIL).

1. ఒకవేళ టెండర్లు తెరిచే తేదీని, ఆ తర్వాత ఏదైనా కారణం చేత సెలవు దినంగా ప్రకటిస్తే, ఆ టెండర్లను తదుపరి పని దినం నాడు నిర్ణీత సమయానికి తెరుస్తారు.
2. ఇ-బిడ్లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ: **17.04.2026**, సాయంత్రం **4:00** గంటల వరకు. వివరమైన సమాచారం కోసం, మా వెబ్‌సైట్ www.ireps.gov.in ను సందర్శించండి.
3. తదుపరి సమాచారం లేదా సవరణలు ఏవైనా ఉంటే, అవి కేవలం www.ireps.gov.in అనే ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే తెలియజేయబడతాయి.

A2771 సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, గుంటూరు.

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


## అప్పికు జన్మదిన శుభాకాంక్షలు



**షాద్ నగర్ మార్చి 28 (వుదయం):** షాద్ నగర్ మున్సిపాలిటీ 27 వార్డు కౌన్సిలర్ మురళీ మోహన్ (అప్పి) జన్మదిన సందర్భంగా షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కార్యాలయంలో మురళీ మోహన్(అప్పి) శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు పెంటయ్య, రాజు నాయక్, దిలీప్, చందు, అనిల్, పరమేశ్వర్, అక్రం, సాయి కుమార్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌కు సత్కారం

**శంకర్‌పల్లి, మార్చి 28 (వుదయం) :**



శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టల్ టౌన్షిప్ కాలనీలో ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్య, సీసీ రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, మురుగు నీటి నిల్వలతో వస్తున్న ఆరోగ్య సమస్యలు వంటి అనేక అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలోని ప్రజలు గత కొంతకాలంగా ఈ సమస్యల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే చర్యలు తీసుకొని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సభ్యులు కోరారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే డ్రైనేజ్, రోడ్లు, విద్యుత్ సౌకర్యాలు అత్యంత కీలకమని వారు వివరించారు.

ఈ సమావేశంలో మున్సిపాలిటీ కమిషనర్ యోగేష్ కుమార్‌తో పాటు ఒకటవ వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు, పదవ వార్డు కౌన్సిలర్ రాజుండ్ల వసంత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. కాలనీలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో చిన్నపిల్లలు, వృద్ధులు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని సొసైటీ సభ్యులు అధికారులకు వివరించారు. వర్షాకాలం వచ్చినప్పుడు డ్రైనేజ్ లేక మురుగు నీరు రోడ్లపై నిలిచి కాలనీ అంతా దుర్వాసన వ్యాపిస్తోందని, దీనివల్ల దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలనీలో వీధిదీపాల కొరత వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయని, భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ సమస్యలు పరిష్కారమైతే క్రిస్టల్ టౌన్షిప్ ప్రజలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని వారు స్పష్టం చేశారు.

ఈ సమస్యలపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్ కాలనీలో ఉన్న సమస్యలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని మున్సిపల్ ఇంజనీర్‌ను వెంటనే పిలిపించి ఆదేశించినట్లు సమాచారం. క్రిస్టల్ టౌన్షిప్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి పూర్తి నివేదిక రూపొందించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు సీసీ రోడ్ల పనులు చేపట్టేందుకు సానుకూలంగా స్పందించినప్పటికీ, ముందుగా సెంట్రలైజ్డ్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన తరువాతే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు గట్టిగా డిమాండ్ చేశారు. డ్రైనేజ్ పనులు లేకుండా రోడ్లు వేస్తే మళ్లీ తవ్వాల్సి వస్తుందని, దీని వల్ల ప్రభుత్వ నిధులు వృథా అవుతాయని, ప్రజలకు కూడా ఇబ్బందులు కలుగుతాయని వారు వివరించారు. దీనిపై చైర్మన్ మరియు కమిషనర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు.

ఈ భేటీ అనంతరం ఇటీవల మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సాత ప్రవీణ్ కుమార్‌ను క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీ కమిషనర్ యోగేష్ కుమార్‌తో పాటు ఒకటవ వార్డు కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనందరావు, పదవ వార్డు కౌన్సిలర్ రాజుండ్ల వసంత మహేందర్ రెడ్డిలకు కూడా సొసైటీ సభ్యులు ప్రత్యేకంగా శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలను సత్వరంగా స్పందించి పరిష్కరించేందుకు ముందుకు రావడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా మున్సిపాలిటీ పాలకవర్గం ప్రజల తరఫున నిలబడాలని వారు కోరారు. క్రిస్టల్ టౌన్షిప్ అభివృద్ధి కోసం అధికారులు సానుకూలంగా స్పందించడం పట్ల కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రమౌళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, క్రిస్టల్ టౌన్షిప్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షులు ఎం. విఠలయ్య, కొలాన్ గోవింద్ రెడ్డి, అధ్యక్షులు కొలాన్ ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్పల్లి అశోక్, సంయుక్త కార్యదర్శి కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే కాలనీవాసులు రవికుమార్, రాఘవేందర్ రెడ్డి, రామచంద్రయ్య, గోపాల్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. క్రిస్టల్ టౌన్షిప్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపాలిటీ అధికారులు త్వరిత చర్యలు తీసుకోవాలని వారు మరోసారి విజ్ఞప్తి చేశారు. అధికారులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ సొసైటీ సభ్యులు సమావేశం ముగించారు.

## తెలంగాణ జాగృతిలో భారీ చేరికలు

**చేవెళ్ల, మార్చ్28(వుదయం)**

### కవిత నాయకత్వానికి పెరుగుతున్న మద్దతు



తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊపు తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ జాగృతి పార్టీ బలోపేతానికి రంగం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో శనివారం భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. నగరంలోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి సమక్షంలో, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కె. శివశంకర్ ఆధ్వర్యంలో చేవెళ్ల, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నుంచి 100 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు.

**కండువా కప్పి ఆహ్వానం**

ఈ సందర్భంగా రూప్ సింగ్, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లమల్ల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర నాయకులు దూకుంట్ల నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు కొత్త సభ్యులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**రాజకీయ శూన్యతను భర్తీ చేసే శక్తి తెలంగాణ జాగృతిదే**

జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లాడుతూ...ప్రస్తుతం రాష్ట్రం కీలకమైన రాజకీయ దశలో ఉందని, ప్రజలు ఆశిస్తున్న ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ జాగృతి అందిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రజల సమస్యలే లక్ష్యం**

ఉద్యమ కాలం నుంచి తెలంగాణ సంస్కృతి, అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిన కవిత నాయకత్వంలో, పార్టీ కేవలం నినాదాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందన్నారు. ప్రత్యేకంగా యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు ఈ పార్టీ ఒక నమ్మకమైన వేదికగా మారుతుందని తెలిపారు. ప్రగతిశీల దిశగా అడుగులు ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా ప్రగతిశీల మార్గంలో పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

**పార్టీలో చేరిన ముఖ్యులు**

సంగేరి నగేష్, పుట్నాల పరమేష్ గౌడ్, గుణాల మాధవ రెడ్డి, గౌరవ్ కుమార్, గౌరవ్ మల్లేష్, తుమ్మలూరు అంజయ్య, గోల రాజు వీరేష్ సంజీవ రెడ్డి షణ్ముఖ్ కుమార్ విశాల్ శివరామకృష్ణా రెడ్డి, కార్తీక్ రెడ్డి, ఆనంద్ తదితరులు పార్టీలో చేరారు.



## ఇష్టంతో చదివితే ఉన్నత స్థానం

### షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్

**షాద్ నగర్ మార్చి 28 (వుదయం):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం కుంట్ల రాం రెడ్డి గార్డెన్ లో మాంటిసోరి గ్రూప్స్ ఆఫ్ స్కూల్ 25వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్లు అగ్గనూర్ విశాలవిశ్వం, పెంటయ్య మురళీమోహన్ (అప్పి),తదితరులు హాజరయ్యారు, ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. ఉపాధ్యా యులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధవహిస్తే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో మాంటిసోరి స్కూల్ గ్రూప్ సీఈవో జార్జ్ థామస్,వైస్ ప్రిన్సిపాల్ బిలు జార్జ్, ప్రిన్సిపాల్ రంజిత్, పాఠశాల డైరెక్టర్ సరాపు రమేష్ కుమార్ ప్రైవేట్ పాఠశాల సంఘం అధ్యక్షుడు వంశీకృష్ణ, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు..

## టిఆర్ఎస్‌లో చేరిన యువకులు



**జిన్నారం, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :** కాంగ్రెస్ సర్కార్ పై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందని జిన్నారం మాజీ జడ్పిటిసి కోలన్ బాల్ రెడ్డి ఆరోపించారు. శనివారం బొల్లారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన యువకులు ఆయన సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. రేవంత్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందండడానికి ఈ చేరికలే నిదర్శనం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. ప్రభుత్వం రోజు రాజుకు ప్రజల విశ్వాసం కోల్పోతుందన్నారు. గులాబీ పార్టీకి జనాలు బ్రహ్మరథం పడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరుణ్ రత్నం ఆధ్వర్యంలో పలు కాలనీలకు చెందిన యువకులకు బాల్రెడ్డి గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో శివ మున్నా సర్వనా మనీ రాజా గోపి మహేష్ వాసు భరత్ వెంకటేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు సాయికిరణ్ రెడ్డి శ్రీకాంత్ యాదవ్ బీరప్ప యాదవ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు చేస్తే సాహించం

### డాక్టర్ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ డిమాండ్



**చేవెళ్ళ, మార్చ్28 (వుదయం):** షాబాద్ లో దళిత జర్నలిస్టుల మీద వరుసదాడుల నేపథ్యంలో మాదిగ జర్నలిస్టుల ఫోరం శనివారం(ఎంజేఎఫ్ )నియోజకవర్గం కన్వీనర్ మహేష్ ఆశిగారి మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు శంకర్ రావుమాదిగ ఎమ్మార్పిఎస్జె జిల్లా ఉపాధ్యక్షులు కాడిగళ్ల ప్రవీణ్ మాదిగ జర్నలిస్టు శేఖర్ శివగళ్ల మాదిగ ఆధ్వర్యంలో పద్మశ్రీ గ్రహీత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ను శనివారం నగరంలోని ఆయన నివాసంలో మందక్రిష్ణమాదిగను కలిశారు. అనంతరం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో దళిత జర్నలిస్టులపై, దళితులపై జరుగుతున్న వరుస దాడులపై మందకృష్ణ మాదిగ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ...ఇటీవల రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దళిత జర్నలిస్టులపై, దళితులపై జరిగిన దాడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని రాజ్యాంగం పై జరిగిన దాడిగానే చూస్తామని డాక్టర్ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు.దళిత జర్నలిస్టులపై దాడి జరిపిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వ్యక్తులపై నేటికీ కేసు నమోదు చేసి రిమాండ్ చేయకపోవడం దళితులను అవమానించడమేనని మండిపడ్డారు. ఎంజేఎఫ్ నేతృత్వంలో త్వరలో షాబాద్ లో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో దళితులు ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ శేఖర్ శివగల్ల మాదిగ, తాళ్లపల్లి మల్లేష్ మాదిగ, అడ్వకేట్ ప్రభాకర్, షాబాద్ మండల బిజెపి యువ నాయకుడు విక్రమ్ రెడ్డి, ఎం జె ఎఫ్ శంకర్పల్లి మండలం కన్వీనర్ సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

## దామరగిద్దలో వాలీబాల్ టోర్నమెంట్

### ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతుల మీదుగా ప్రారంభం



**చేవెళ్ల, మార్చి 28(వుదయం):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద 7వ వార్డులో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్-2026 శనివారం ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కాలే యాదయ్య ఘనంగా ప్రారంభించారు.ముఖ్య అతిథులు మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, 15వ వార్డ్ కౌన్సిలర్ శైలజ ఆగిరెడ్డి పాల్గొన్నారు. యువతకు ఎమ్మెల్యే పిలుపు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు నిర్వహించడం వల్ల ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆయన అన్నారు.

దామరగిద్దలో క్రీడా జోష్

టోర్నమెంట్ ప్రారంభంతో దామరగిద్దలో క్రీడా ఉత్సాహం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నాయి.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాము గౌడ్,కౌన్సిలర్స్ తాళ్లపల్లి నర్సింలు,మద్దెల శ్రీనివాస్ గోపాల్ రెడ్డి మధుసూదన్ రెడ్డి దయాకర్ మాజీ సర్పంచులు మధుసూదన్ గుప్తా శంకర్ మాజీ ఉపసర్పంచ్ మాల వెంకటయ్య, డిసిసి ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి,మాజీ సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి,సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి,ప్రభు గుప్తా, మాచన్ పల్లి రాంచంద్రయ్య,దొడ్డి అంజయ్య, దొడ్డి సత్తయ్య, దొడ్డి మల్లేష్,మంగలి అంజయ్య, బోడ అంజయ్య క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE XX ADDL. JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD.
O.S.No. 443 of 2026

Between:
1) **Smt. MARIGANTI SWAROOPA,** W/o. Late M. Umapathi Raju, aged about 55 years, Occ: Housewife,
2) **Sri. MARIGANTI GYANESHWAR,** S/o. Late. Sri. M. Umapathi Raju, aged about 32 years, Occ: Business,
3) **Ms. MARIGANTI NAVYA SRI,** D/o. Late. Sri. M. Umapathi Raju, aged about 29 years, Occ: Household,
4) **Mr. MARIGANTI NIKHIL RAJU,** S/o. Late. Sri. M. Umapathi Raju, aged about 26 years, Occ: Business, That the plaintiffs no' 1 to 4 Are R/o. H.No. 4-7-1102, Esaamia Bazar, Hyderabad-500027
5) **Sri. DUVVANAPALLY SIDDHARTHA NAGA RAMESHWAR RAO,** S/o. Late. Sri. D. Raghu Ramulu, aged about 44 years, Occ: Business, R/o. H.No.2-3-734 /b/42, Shanker Nagar, Amberpet, Hyderabad-500013,
6) **Smt. KOPPULA AISHWARYA,** W/o. Sri. K. Anjesh Kumar, (D/o. Late. Sri. D. Raghu Ramulu), aged about 46 years, Occ: Household, R/o. H.No.2-3-703/B/50/92, Maruthi Nagar, Near Vardhaman Steel Factory, Amberpet, Hyderabad-500013,
7) **Smt. KAVYA LAXMI,** W/o. Late. Sri. Duvvanapally Shanker Sandeep, aged about 34 years, Occ: Household, R/o. H.No. 2-3-734/B/12/B, 1st Floor, Shanker Nagar, Amberpet, Hyd- 500013

...Plaintiffs

AND

1) **THE TAHSILDAR,** Nampally Mandal Revenue Office, Office at Public Gardens, Nampally, Hyderabad District- 500004
2) **ALL CONCERNED** ... **Defendants**

To,
All Concerned,
Whereas the above named plaintiff has filed the above suit for seeking to declaration to declare her as the Legal Heir and successor of Late. Sri. Mariganti Shyamalamma, who was died on 27.09.2011, wherein the Hon'ble court was pleased to pass orders by permitting the plaintiff to serve substitute service of summons to the 'All Concerned'. Hence you are hereby directed to be present before the above said court on **17.04.2026,** at 10.30 A.M., either in person or through Advocate, failing which the matter will be decided ex-parte against you.

**(By Order of the Court)**
**N. RAKESH REDDY ADVOCATE**
Flat No. 108, PGR Divine Apart, St. No. 1, Nalanda Nagar, Hyderguda, Hyderabad -500048, Ph. No. 9000755566
COUNSEL FOR PLAINIFFS


## రెండు రోజుల్లో డయాలసిస్ సేవలు ప్రారంభం

**చేవెళ్ల,మార్చి28(వుదయం)**



చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను రెండు రోజుల్లో తిరిగి ప్రారంభించాలని శనివారం మున్సిపల్ చైర్పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు ఆమె ఆసుపత్రిని సందర్శించారు.ఆసుపత్రిలో ప్రస్తుతం సుమారు 30 మంది రోగులు డయాలసిస్‌పై ఆధారపడుతున్నట్లు తెలిసింది. ఆసుపత్రి పనుల కారణంగా పలువురు రోగులను పటాన్ చెరు, శంషాబాద్, వికారాబాద్ ప్రాంతాలకు తరలించడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.రాత్రివేళల్లో డయాలసిస్ చేయించుకోవడం, తిరిగి ఇంటికి చేరుకోవడం కష్టంగా మారిందని తెలిపారు.ఇంకా, ఆసుపత్రిలో నెల రోజులుగా కొన్ని వైద్య పరీక్షలు నిలిచిపోవడంతో ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోందని, ప్రతీసారి వేల రూపాయలు ఖర్చవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త రోగులకు అవసరమైన ఫిస్టులా చికిత్స కోసం నెఫ్రాలజిస్ట్ అవసరమని కూడా కోరారు.రోగుల సమస్యలను గమనించిన చైర్పర్సన్ వెంటనే స్పందించారు. ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, డయాలసిస్ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కేబుల్ వైరు దెబ్బతినడం కారణమని తెలుసుకుని, వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు.

**తక్షణ చర్యలు -రూ.50 వేల అందజేత**

విద్యుత్, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి అవసరమైన ఖర్చును తానే భరిస్తానని ప్రకటిస్తూ, వెంటనే రూ.50 వేల నగదును అందజేశారు. డయాలసిస్ రోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను

డయాలసిస్ సేవలు ఆగిపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడకూడదని, రెండు రోజుల్లోనే సేవలను పునరుద్ధరించాలని అధికారులను కట్టుదిట్టంగా ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సైలు శిరీష, తేజశ్రీ, బీజేపీ జిల్లా కార్యదర్శి కృష్ణాగౌడ్, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



“ ప్రస్తుత రోజుల్లో రాజకీయ పార్టీలు పెట్టడం సులభమే.. అయితే వాటిని నడపడం ప్రజల మద్దతుపై ఆధారపడి ఉంటుంది. ప్రజలు ఆదరించినప్పుడు మాత్రమే ఏ రాజకీయ పార్టీ అయినా మనుగడ సాగిస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ పెట్టుకోవచ్చు. అది వారి రాజ్యాంగబద్ధమైన హక్కు. కవిత కొత్త పార్టీ పెట్టడాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాం. కేవలం పార్టీ ప్రకటించినంత మాత్రాన సరిపోదు. క్షేత్రస్థాయిలో ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొత్త పార్టీ వస్తే కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదు. మా ఓటు బ్యాంక్ చెక్కుచెదనిది. ప్రజలు మా ప్రభుత్వంపై మేము తీసుకునే విధానాలపై పూర్తి నమ్మకంతో ఉన్నారు.

* మహేశ్ కుమార్ గౌడ్, టిపిసిసి అధ్యక్షుడు ”

## వే'మన'పద్యం

**మిరపగింజచూడ మీద నల్లగనుండు**
**గొరికిచూడలోన జురుకు మనును**
**సజ్జనులగువారి సారమిట్లుండురా**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# నేపాల్ లో నవశకం

పాల్ ఎన్నికల ఫలితాలు ఊహించినట్టే వచ్చాయి.ప్రధాని బాలేంద్ర షా నాయకత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా తనంత తానుగా అనూహ్య మైన విజయాభిషేకం చేయించుకున్నది. నేపాల్ లో గల రెండు విధానాల ఓటింగ్ పద్ధతిలో ఇటువంటి విజయం అసాధారణమైనది.మొత్తం 275 పార్లమెంట్ స్థానాల్లో 165 స్థానాలకు మాత్రమే సాధారణ మెజారిటీ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీలకు పడిన ఓట్ల దామాషా మేరకు మిగతా 110 స్థానాల్లో విజేతలను నిర్ణయిస్తారు.ఇటువంటి క్లిష్ట మైన ఎన్నికల్లో అధికార అర్ ఎస్ పి మొత్తం 275 స్థానాల్లో 182 సీట్లు గెలుచుకోవడం పాత పాలకులపై నేపాలీలు ఎంతగా విసిగి పోయారో తెలియజేస్తున్నది .గత పాలకులు ప్రజల మంచి చెడ్డలను బొత్తిగా పట్టించుకోకుండా సొంత బాగు చూసుకోడం లోనే నిత్యం మునిగి తేలడంతో అక్కడ ఆబాలగోపాలం పాత పాలక పార్టీలన్నింటిని కట్టగట్టి తిరస్కరించారు. సహనం కోల్పోయి సాయుధ మార్గం పట్టడం లేదా పూర్వపు రాచరిక పాలనవైపు మొగ్గకుండా ప్రజాస్వామికంగా స్పందించడం బాగుంది పాత పాలక శక్తులను సమూలంగా పెరికివేసి కొత్త యువ శక్తులను ఎన్నుకోవడం ఎంతో హృద్యంగానూ ఉంది.ఇది పూర్తి జెన్-జెడ్ విప్లవం. నూతన ప్రధాని బాలేంద్ర షా వయసు 35.ఆయన మంత్రివర్గంలో అత్యధికులు 40 సంవత్సరాల లోపు వయసువారే. నిరుద్యోగం నిప్పుల కొలిమిలో నానా బాధలు పడుతున్న ప్రజలకు 12 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని ప్రధాని బాలేంద్ర షా వాగ్దానం చేశారు.చైనా -ఇండియాలకు సమాన దూరంలో ఉండి అలీన విదేశాంగ విధానాన్ని పాటిస్తామని చెప్పుకున్నారు. అవినీతిని రూపుమాపుతామన్నారు. అన్ని వైపులా భూమి మాత్రమే గల నేపాల్ నూతన నాయకత్వం లో భారత చైనా ల ఒత్తిడిని ఎలా తట్టుకోగలుగుతుందో చూడాలి.వెనక్కు తిరిగి చూస్తే ఢిల్లీ లో మొదటిసారి ఆప్ అధికారంలోకి రావడం వంటి సందర్భాలు గుర్తుకు వస్తాయి. అయితే అవినీతికి వ్యతిరేకంగా పాత తుప్పుపట్టిన వ్యవస్థ లు కూలిపోయినట్టు అనిపించినా తిరిగి అవే రకం శక్తులది పైచేయి కావడమూ చూస్తున్నాము. నేపాల్ లో మాత్రం ఈ మంచి ఇంకా పెరిగి అక్కడి ప్రజలకు అపారమైన మేలు జరగాలని ఆశిద్దాము.మొదట రాచరికం కాడిని మోసిన నేపాల్ ప్రజలు తరువాత చండ ప్రచండ మావోయిస్టుల ధోరణులనూ చూశారు చివరికి యువశక్తుల శుద్ధ పాలన ముంగిట ఉన్నారు.అనవసరమైన నిత్య వివాదభరితమైన పొత్తుల అవసరం లేకుండా అఖండ మెజారిటీ తో అధికారంలోకి వచ్చిన కొత్త శక్తులు నేపాల్ ప్రజల ఆశలను వమ్ము చేయరని సఫల ప్రజా స్వామ్యంతో ఈ చిన్న దేశం ప్రపంచానికి పాఠం చెబుతుందని ఎదురు చూద్దాం.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# చమురుపై ఎక్సైజ్ తగ్గింపు మతలబేమిటి !

కుక్క పిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా కాదేదీ కవితకనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. భారత చక్రవర్తి నరేంద్రమోడీకి భజన చేసేందుకు ఏ అవకావశాన్నీ వదలం అంటున్నారు ఆంధ్రప్రదేశ్ రాజు చంద్రబాబు నాయుడు, యువరాజు లోకేష్ నాయుడు, సామంత రాజు పవన్ కల్యాణ్. పెట్రోలు,డీజిలు మీద కేంద్ర ప్రభుత్వం లీటరుకు పది రూపాయల చొప్పున ఎక్సయిజ్ డ్యూటీ తగ్గించిందన్న వార్త రాగానే ముగ్గురూ మోడీని అభినందించారు. ఎందుకటా ! వినియోగదారులకు ధర తగ్గించినందుకు కాదు, పెంచనందుకు అన్నది వారి స్పందనల సారం. పూర్వం రాజుల కాలంలో రాజుగారు ఏది చేసినా గొప్పదే అని పొగిడే భట్రాజుల(కులం గురించి కాదు)ను వారు గుర్తుకు తెచ్చారంటే అతిశయోక్తి కాదు. భట్రాజులకు రాజులు, రంగప్పలు నజరానా ఇచ్చేవారు, కేంద్రం ఇస్తున్నది వడ్డీలకే చాలటం లేదని చంద్రబాబు నాయుడు మంత్రులతో అన్నట్లు లీకు వార్తలు. ఈ పూర్వరంగంలో మోడీని పొగిడినందుకు ఆంధ్రప్రదేశ్‌కు ఏమైనా ఒరగబెడతారా ? వ్రతం చెడ్డా ఫలం దక్కదా ! చూద్దాం. కొసమెరుపు ఏమంటే నరేంద్రమోడీని పొగడటంలో పోటీపడే వైసిపి నేత జగన్‌మోహన రెడ్డి ఈ విషయంలో వెనుకబడినట్లు కనిపిస్తున్నది, స్పందన కనిపించలేదు, వినిపించలేదు. ఇక్కడ ఒక్క సందేహం. చంద్రబాబు సిఎం, పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, మరి మోడీని పొగడటంలో మంత్రిలోకేష్ పాత్ర ఏమిటి ? పలుకుబడి, ప్రతిష్ట పెంచేక సరత్తులో భాగమా ? మిగిలిన మంత్రులు ఎందుకు స్పందించలేదు.ఎవరికి తోచింది వారు అనుకొనే స్వేచ్ఛ ఉంది గనుక వదిలేద్దాం !చిత్రం ఏమిటంటే వినియోగదారుల మీద విపరీత భారం మోపినపుడు చంద్రబాబు అండ్ కో మౌనంగా ఉండి ఇప్పుడు ఏదో ఒరగబెట్టినట్లు భజన చేశారు. ?ఏమి రాజకీయంరా నాయనా ! అసలు నరేంద్రమోడీ ఎందుకీ నిర్ణయం తీసుకున్నారు ? శుక్రవారం నాడు ఎక్సయిజ్ పన్ను తగ్గింపు వార్త వినగానే శ్రీరామనవమి వేడుకల్లో ఉన్న జనం ఒక్కసారి ఆశ్చర్యపోయారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తికాగానే చమురు ధరలు పెరుగుతాయని మానసికంగా సిద్ధం అయిపోయిన వారు నిజమేనా మోడీ సర్కార్ ఇంత మేలు చేసిందా అని కాళ్లు చేతులు గిల్లుకున్నారు, తలలు కొట్టుకున్నారు.చర్మాలు స్పందించటంతో రామా ఇలా కరుణించావా అని సంబరపడ్డారు. అయితే బంకుల వద్దకు వెళ్లగానే ఆ '' తగ్గింపు '' అంబానీ, నయారా వంటి ప్రైవేటు కంపెనీలతో బాటు కేంద్ర ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలకు లబ్ది చేకూర్చేందుకు తప్ప వినియోగదారులకు కాదని తెలియగానే చల్లబడిపోయారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దుర్మార్గదాడుల కారణంగా తలెత్తిన సంక్షోభంతో ప్రపంచ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరిగాయి. ఆ పేరుతో నయారా అనే ప్రైవేటు కంపెనీ పెట్రోలు మీద లీటరుకు ఐదు, డీజిలు మీద మూడు రూపాయల చొప్పున ధర పెంచింది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం పవర్ పెట్రోలు ధర లీటరుకు రు.2.36వరకు పరిశ్రమల్లో ఉపయోగించే డీజిల్ ధరను 22 రూపాయలు పెంచింది. దిగుమతి ఖర్చు పెరిగినందున మన దేశంలోని చమురు మార్కెటింగ్ కంపెనీలకు లీటరు పెట్రోలు మీద రు.18-20. డీజిలు మీద రు.30-35 నష్టం వస్తున్నదని చెబుతున్నారు. (అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పతనమైనపుడు వాటికి ఎంత లాభవచ్చిందో చెప్పరు) అందువలన వాటికి ఉపశమనం కలిగించేందుకు మోడీ పూనుకున్నారు. ప్రత్యేక ఎక్సయిజ్ డ్యూటీని పెట్రోలు మీద రు.13ను మూడుకు తగ్గించగా, డీజిల్ మీద పదిరూపాయలను పూర్తిగా ఎత్తివేశారు.ఈ శ్రద్ధ కోట్లాది మంది వినియోగదారుల మీద లేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభం కాగానే వంటగ్యాస్ మీద గృహ వినియోగదారులకు అరవై రూపాయలు పెంచారు, ముష్టిగా విదుల్చుతున్న 40రూపాయల సబ్సిడీని గుట్టు చప్పుడు కాకుండా ఎత్తివేశారు, అంటే వంద రూపాయల మేరకు




వడ్డించారు. అచ్చేదిన్ పేరుతో 2014లో అధికారానికి వచ్చిన మోడీ జనాలకు ఏదో ఒరగబెడతారని అందరూ ఆశించారు.అదనంగా అన్నవస్త్రాలు ఇస్తారనుకొంటే ఉన్న వస్త్రాలను లాగేసుకున్నట్లు కొత్తగా మేలు చేస్తారనుకుంటే డీజిలు, పెట్రోలు మీద సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేశారు,గ్యాస్ మీద ముష్టి మాదిరి విదిల్చారు.ఇప్పుడు దాన్ని కూడా రద్దు చేశారు. మేలు సంగతి తరువాత భారం ఎలా మోపారో చూద్దాం. మోడీ అధికారానికి వచ్చిన 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం ప్లానింగ్ ఎనాలసిస్ సెల్ సమాచారం ప్రకారం చమురు రంగం నుంచి ఎక్సైజ్ డ్యూటీ రాబడి రు.99,068 కోట్లు, దాన్ని 2020-21 నాటికి రు.3,72,930 కోట్లకు పెంచారు. తరువాత ఎన్నికలు, తదితర కారణాలతో 2023-24 నాటికి రు.2,73,684 కోట్లకు తగ్గించారు.2025-26 తొలి ఆరు నెలల్లో రు.1.30వేల కోట్ల మేర రాబడి వచ్చింది.పెట్రోలు మీద కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న అసలు సిసలు ఎక్సయిజ్ పన్ను లీటరుకు రు.1.40,(దీన్లో మాత్రమే రాష్ట్రాలకు వాటా ఉంది) ఇదిగాక ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ రు.13, వ్యవసాయ మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పేరుతో రు.2.50, రోడ్ల పేరుతో రు.5 వంతున మొత్తం రు.20.50 వసూలు చేస్తున్నారు. (అంతకు ముందు రు.30కి పెంచి తరువాత తగ్గించారు). ఇప్పుడు రు.13లో పది రూపాయలు తగ్గించినప్పటికీ అది వినియోగదారులకు చేరటం లేదు. సాధారణ డీజిల్‌పై పదహారు రూపాయల బాదుడులో పది రూపాయలు రద్దు చేశారు. అయినా వినియోగదారులకు ఒక్క పైసా కూడా తగ్గలేదు. అంటే చమురు మార్కెట్ కంపెనీలు పది రూపాయల మేరకు ధరలను పెంచినట్లే.ఈ మాత్రానికే మోడీకి భజన చేయాలా ? తాజా నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తగ్గిన ఆదాయలోటును ఎలా సర్దుబాటు చేయనుంది ?బడ్జెట్‌లో సంక్షేమ పథకాల కేటాయింపులకు కోత పెట్టటం లేదా ఏదో ఒకసాకుతో జిఎస్‌టి, సెస్‌ల పెంపుదలకు పూనుకోవాల్సి ఉంటుంది. పశ్చిమాసియా సంక్షోభం ముగిసిన తరువాత తిరిగి అదనపు ఎక్సయిజ్ పన్నుబాదుడు ద్వారాపూడ్చుకోవచ్చు.చావు కబురు చల్లగా చెప్పినట్లు ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సమీక్షించి ధరల నిర్ణయం చేస్తామని శుక్రవారం నాడు కేంద్ర ప్రభుత్వం చెప్పింది. పరోక్ష పన్నులు మరియు కస్టమ్స్ కేంద్ర బోర్డు అధ్యక్షుడు వివేక్ చతుర్వేది విలేకర్లతో మాట్లాడుతూ '' మీరు ఊహించుకొనే విధంగా పరిస్థితి లేదని, మనం కష్టకాలంలో ఉన్నామని '' చెప్పారు. నరేంద్రమోడీ గారేమో అంతా సజావుగా ఉందని చాలా రోజుల పాటు చెప్పించి, కరోనా మాదిరి పరిస్థితిని ఎదుర్కొంటున్నాం అని పార్లమెంటులో మాట్లాడి జనాన్ని భయపెట్టిన సంగతి తెలిసిందే.అధికారులెందుకు ఈ విధంగా మాట్లాడుతున్నట్లు ? ప్రత్యేక అదనపు ఎక్సయిజ్ డ్యూటీ పది రూపాయలు తగ్గించిన కారణంగా ప్రతి పదిహేను రోజులకు ఏడువేల కోట్ల రూపాయల మేర కేంద్ర ప్రభుత్వం రాబడిని కోల్పోతున్నదని వివేక్ చెప్పారు, అంటే ఏడాదికి రు.1.68లక్షల కోట్లు. మోడీ సర్కార్ వంచన గురించి చెప్పుకోకపోతే జనాలకు అన్యాయం చేసినవాళ్లం అవుతాము.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే వినియోగదారులకు తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అని చెప్పిన వారు 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి ధరలను సవరించటం నిలిపివేశారు. ఆ ఏడాది ఏప్రిల్, మే,జూన్,జులై నాలుగు నెలల్లో మనం దిగుమతి చేసుకున్న ముడి చమురు ధర సగటున 108.5 డాలర్లు. ఆ తరువాత క్రమంగా తగ్గుతూ వచ్చింది.2022-23 ఏడాది సగటు ధర 93 డాలర్లు. ఇక 2025 ఏప్రిల్ నుంచి 2026ఫిబ్రవరి వరకు పదకొండు నెలల సగటు ధర 66.53 డాలర్లు, అంటే నాలుగేండ్లలో ఇంతగా తగ్గినప్పటికీ వినియోగదారులకు పైసా తగ్గించలేదు. పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభమైన తరువాత మార్చినెల 25వ తేదీ వరకు ఉన్న కొనుగోలు సగటు ధర 123 డాలర్లకు చేరింది. ఈ వివరాలు ఏ కమ్యూనిస్టులో, కాంగ్రెస్ వారో చెప్పినవి కాదు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పెట్రోలియం ప్లానింగ్, అనాలిసిస్(పిపిఏసి) వెబ్‌సైట్ వెల్లడించిన సమాచారం.

ఆయిల్ ప్రైస్ డాట్‌కామ్ సమాచారం ప్రకారం ఫిబ్రవరి 25న మనదేశం కొనుగోలు చేసిన ముడి చమురు ధర 70.25 డాలర్లు ఉంటే మార్చినెల 23న 157డాలర్లకు చేరింది. ఈ కారణంగానే ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ధరలను సమీక్షిస్తామని కేంద్రం చెప్పింది. నాలుగేండ్ల పాటు జనాల నుంచి లక్షల కోట్లు అదనంగా వసూలు చేసి ఖజానా నింపుకొని అదానీ, అంబానీ వంటి వారికి సబ్సిడీలు రూపంలో కట్టబెట్టారు, పారుబాకీల పేరుతో లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రద్దు చేశారు.ఇప్పుడు ధరలు పెరిగి ఒక నెల రోజులు కూడా గడవక ముందే చమురు కంపెనీల కోసం నడుంకట్టారు. మోడీ మీద తెలుగుదేశం, జనసేన, వైసిపి వంటి పార్టీలకు ఉన్న మోజు తెలిసిందే. అది ఎంత ఉన్నా జనాన్ని ఇలా చావబాదుతుంటే పల్లెత్తు విమర్శ చేయలేదు.అఫ్ కోర్స్ జనానికి కూడా ఆ మత్తు వదలలేదు అన్నది నిజం. ఇతర సందర్భాలలో మాట్లాడినపుడు బిజెపి, తెలుగుదేశం పార్టీ పెద్దలు ప్రభుత్వం వ్యాపార సంస్థ కాదు అంటారు. కానీ ఆచరణలో కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేసినట్లు కనిపించటం లేదా ? దిగుమతి చేసుకున్న చమురు భారంగా మారుతున్నదంటూ గుండెలు బాదుకుంటారు. దీనికి రూపాయి విలువపతనాన్ని అరికట్టటంలో వైఫల్యం లేదా ? మోడీ అధికారానికి వచ్చినపుడు, ఇప్పుడు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు పీపా ధర ఒక డాలర్‌గానే ఉంది అనుకుందాం. నాడు అరవై రూపాయలు చెల్లిస్తే సరిపోయేది, ఇప్పుడు అదే డాలరుకు 94చెల్లించాల్సి వస్తోంది.ఈ నిర్వాకానికి బాధ్యత ఎవరిది ? యుపిఏ పాలనలో రూపాయి పతనం చెందినపుడు అసమర్ధ మన్మోహన్ సింగ్ కారణం అన్నారు కదా ! ఇప్పుడు '' సమర్ధ '' నరేంద్రమోడీ అని చెప్పక తప్పదు. దేశంలో ముడిచమురు ఉత్పత్తి పెంచలేదని గతంలో తీవ్రవిమర్శలు చేశారు.పన్నెండ్ల నరేంద్రమోడీ ఏలుబడి నిర్వాకం ఎలా ఉందో తెలుసా ? 2014-15లో ప్రభుత్వ-ప్రైవేటు ఉత్పత్తి 35.9 మిలియన్ టన్నులుంటే 2023-24నాటికి 27.2మి.టన్నులకు పడిపోయింది. ఇప్పుడు ఇంకా దిగజారింది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలన్ని కలసి 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేసిన మొత్తం 25.6మిలియన్ టన్నులే. ఇలాంటివారు ఆత్మనిర్భరత, వికసిత్ భారత్ పేరుతో 2047నాటికి దేశాన్ని ఎక్కడికో తీసుకుపోతామని కబుర్లు చెబుతుంటే జనం చెవుల్లో పూలు పెట్టుకొని తలలు ఊపాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గితే తగ్గిస్తాం, పెరిగితే పెంచుతాం అంటూ అంతకు ముందు ప్రతిరోజూ సవరించిన ధరల విధానాన్ని నాలుగేండ్లు ఎందుకు పక్కన పెట్టారో ఇప్పుడు తిరిగి దాని గురించి ఎందుకు మాట్లాడుతున్నారో జవాబుదారీ తనం గురించి తమ భుజాలను తామే చరచుకొనే పెద్దలు ఎవరైనా చెబుతారా ? రాజకీయనేతలను కాసేపు పక్కన పెడదాం. వారు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని తెలిసిన జనంలో అసలు ప్రశ్నించే గుణం ఎందుకు అంతరించినట్లు ? నిజంగానే ఈ ధోరణి గురించి పరిశోధనలు జరపాల్సిన అవసరం ఉంది. ఆక్రమిత కాశ్మీరులో పాక్ ప్రభుత్వం భారాలు పెంచితే వాటిని భరించలేక అక్కడి జనం మనదేశంలో విలీనం కావాలని కోరుకుంటున్నట్లు వీడియోను చూపి కొందరు వీరంగం వేస్తుంటారు. ఇక్కడి జనం మీద మోడీ మోపుతున్న భారాలు వారికి పట్టవు. పాకిస్తాన్ సుత్తి ఇనుపదైనా భారత్‌ది బంగారపుదైనా తల పగులుతుంది. మంచి రోజులను(అచ్చేదిన్) తెస్తామంటే జనం నమ్మారు. ప్రజలకు అన్యాయం జరిగితే నిలదీస్తాం, తాటవలుస్తాం అందుకే పార్టీని పెట్టాం అని జనసేన నేత పవన్ కల్యాణ్ గతంలో ప్రకటించినపుడు జనం నిజమే కదా నిజమే కదా అనుకున్నారు. 2019కి ముందు నరేంద్రమోడీని, చంద్రబాబు నాయుడిని అదే మాదిరి నిలదీసినమాట నిజం. తరువాత చంద్రబాబును వదలి వేశారు.నరేంద్రమోడీతో చేతులు కలిపారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మాత్రమే 2024 ఎన్నికల వరకు అది జనం సమస్యలైనా, జగన్ వ్యవహారశైలినైనా నిలదీశారు, తాటవలిచారు. ఇప్పుడు తత్వం తలకెక్కింది గనుక మౌన దీక్ష పట్టారు. అక్రమం జరుగుతుంటే మౌనంగా ఉండమని సనాతనం కూడా ఎక్కడా చెప్పలేదు.ఎదుటి వారి జేబులో పర్సు కొట్టేసినట్లు తెలియగానే ఎవరైనా వెంటనే దాన్లో ఎంత డబ్బు ఉంది అని అడుగుతాం, తక్కువ మొత్తమే అని తెలిస్తే పోనీలే అని ఊపిరి పీల్చుకుంటాం.అదే కేంద్ర ప్రభుత్వమైనా మరొకరైనా చమురు పన్ను పేరుతో మన పర్సుకొట్టేస్తున్నపుడు ఎంత పోగొట్టుకున్నాం అని ఆలోచించాలా వద్దా ? అఫ్ కోర్స్ అది కష్టపడిన సొమ్ము కాకపోతే వదిలేద్దాం !



ఎం కోటేశ్వరరావు
8331013288

# నింబ కుసుమ సేవనం

వేప పువ్వు గుణ వంతమైన ఓషధి. రక్తాన్ని శుద్ధి చేసి, వృద్ధి పరిచే గుణం కలిగి ఉంటుంది. వైద్యానికి చాలావరకు ఉపయోగించే వేప చెట్టుకు ప్రాధాన్యత ఉంది. వృక్ష సర్వాంగాలు వైద్యానికి ఉప యుక్తాలే. ప్రధానంగా రోగ క్రిమి నాశని (యాంటీ బయాటిక్) గా వాడటం కద్దు. మానవునికి ఆరోగ్య ప్రదాయిని అయిన వృక్ష రాజా లలో వేప ముఖ్యమైనది. స్వర్గలోకంలో ని "Ambrosia" వృక్షం యొక్క అంశతో, భూలోకాన "వేపచెట్టు" పుట్టిందని, మహారాష్ట్ర సంప్రదాయక విజ్ఞానం స్పష్ట పరుస్తున్నది. ప్రాణవాయువు మూలాధారమైన వేప వృక్ష గాలి ఆరోగ్య ప్రధానమైనదని, విజ్ఞాన శాస్త్రం స్పష్టం చేస్తున్నది. వేపపువ్వు, వేప ఆకు రెండూ ఉపయోగకరమైనవి. ఆయుర్వేద వైద్యులు వేపాకు విరివిగా వాడతారు. చర్మవ్యాధులకు పచ్చి వేపాకు నలుగు పెడతారు. అమ్మవారి జబ్బులలో రోగులకు, ఆకులు దట్టంగా ఉండే వేప రొట్ట వాడుతారు. వ్యాధులు సోకకుండా, ఇళ్ళ ముంగిళ్ళలో వేపాకు తోరణాలు కడుతుండడం, సర్వత్రా దర్శనమిచ్చే దృశ్యం. వసంత రుతువు సంబంధిత పర్వదినమైన ఉగాదినాడు దొరికే వేప పువ్వు వాడమనే పెద్దల ఉద్దేశం, ప్రాప్త కాలజ్ఞతకు నిదర్శనం. ఆ ఆచారమే సంప్రదాయ సిద్ధం, స్తవనీయం, సర్వోత్తమం. ప్రకృతి ఆరాధనకు పేరు మోసిన మన పెద్దలు, రాగల కష్టాలను, సుఖాలను అనుభవించడానికి, సంసిద్ధంగా ఉంటామని సూచించడానికి, "ఉగాది" నాడు, "నింబ కుసుమ భక్షణం", "పచ్చడి సేవనం" విధిని కల్పించారు. వేప చెట్టుకు వృక్ష శాస్త్ర నామం Helia azadirachta అని. ఇందులో Helia అన్నది గ్రీకు పదం. azadirachta అన్నది పారశీక తద్భవం. పారశీక భాషలో వేప చెట్టుకు,Helia azadirachta అని పేరు. దీనికి ఉత్తమ వృక్షం అని అర్థం పంచాంగంలో "నింబ కుసుమ భక్షణం" అని ఉన్నా, "ధర్మసింధువు" ఈ పర్వపు ఆచరణ విధానంలో "నింబ పత్రాషనం" అని ఉంటుంది. దీనినిబట్టి ఉగాదినాడు వేపాకు తినాలని స్పష్టమవుతున్నది. పొరుగు వారైన కర్ణాటక వారు అరవ వారు, ఉగాది రోజులు వేరైనా, ఆనాడు ప్రత్యేకంగా వేప వాడతారు. తెలుగువారితో సంపర్కం ఉన్న తావులలో వారిలాగే వేప పువ్వులు ఉగాది పచ్చడికి వినియోగిస్తారు.ఇక మాళవ, మహారాష్ట్ర, వంగ దేశస్తులు ఉగాది నాడు వేపపువ్వు కాకుండా వేపాకులను వాడతారు. మాళవ దేశస్థులు ఉగాది నాడు, వేపాకులను ముద్దగా నూరి సేవిస్తారు. వంగ దేశస్థుల ఉగాది తెలుగు వారి కంటే నెల రోజుల అనంతరం రావడం చేత, వేపపువ్వు అప్పటికి అరుదుగా లభించే కారణంగా వేపాకు వాడతారు. తెలుగునాట ఉగాది నాటికి వేపచెట్లు, ముమ్మరంగా పోతపోసి ఉంటాయి. అందుకే మన పూర్వీకులు వేప వృక్ష సంబంధిత కొత్త చిగుళ్ళను ఉగాది పర్వదినాన తినడాన్ని నిర్ణయించారు. వేప పువ్వు పచ్చడి ఉగాది నాడు మాత్రమే తినడమే కాదు, దాని లభ్యతను బట్టి విశేషంగా సేకరించి, ఎండబెట్టి ఉంచుకొని, ఏడాది పొడుగునా వేయించుకుని కూరలో, పచ్చడి గానో చేసుకుని, దానితో చారు కాచుకొని సేవిస్తూ, రక్తశుద్ధి, రక్త వృద్ధిని కలిగించుకోవడం, ఆరోగ్య కాముకుల ఆచరణ. "ఉగాది పండుగ నాడు ఏమి చేస్తే, ఏడాది పొడవునా అదే చేస్తుంటారు" అనే నానుడి, వేపపువ్వు వాడకం విషయంలో వాస్తవమే అనిపిస్తుంది.





సంగనబట్ల
9440595494

# ఇప్ప గొప్పను ఏమని చెప్పాలి?

అడవుల్లో నిశ్శబ్దంగా రాలిపడే ఇప్పపూలు గిరిజనుల జీవితాల్లో ఒక ఆర్థిక విప్లవానికి నాంది కావచ్చు. వేల ఏళ్లుగా ఈ చెట్టు వారి జీవన విధానంలో భాగమై ఉంది. పూలు ఆహారం, గింజలు నూనె, చెట్టు నీడ జీవనాధారం. కానీ ఈ ప్రకృతి ఇచ్చిన ఈ వరం ఇప్పటికీ సరైన గుర్తింపు, మార్కెట్, పాలసీ లేక నిస్సహాయంగా ఉంది. ఇటీవల తెలంగాణ అసెంబ్లీలో ఒక సభ్యుడు ఇప్పసారా, ఇప్పపూలలో పోషకాల గురించి సంచలన వ్యాఖ్యలు చేశాక ఇంత వరకు ప్రభుత్వాలు ఇప్ప చెట్టు విలువను నిజంగా అర్థం చేసుకోలేక పోయాయి అనే దిశగా ఈ చెట్టుమీద సర్వత్రా చర్చ మొదలైంది. మధ్య భారతదేశంలో ముఖ్యంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో ఇప్ప చెట్టు గిరిజనుల ఆరోగ్యానికి అండగా 'ఆర్థిక అస్త్రం'గా ఉంది. అయితే దాన్ని ఆధునిక మార్కెట్‌తో సమన్వయం చేయడంలో మనం వెనుకబడ్డాం. ఇప్ప పూలతో తయారయ్యే సారా ఒక సంప్రదాయ పానీయం మాత్రమే కాదు , అది ఒక ఉపాధి అవకాశమూ. కానీ ఇప్పటికీ ఇది ' చట్టబద్ధం కాదు' అనే ముద్రతోనే కొనసాగుతోంది. సరైన ప్రభుత్వ విధానాలు లేకపోవడం వల్ల ఈ విలువైన అటవీ సంపదను ఉపయోగించుకోలేక పోతున్నాం. వీటి అమ్మకాల్లో గిరిజనులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారు.

**మధ్యప్రదేశ్ చెప్పే పాఠం..** ఈ విలువైన చెట్ల మీద మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రయోగం చేసింది. ఇప్ప సారాను "హెరిటేజ్ లిక్కర"గా గుర్తించి, గిరిజనులతో కలిసి ఉత్పత్తి చేసి "Mond" అనే బ్రాండ్‌తో మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది ఒక నిర్మాణాత్మక దిశగా పెద్ద అడుగు. కానీ మార్కెటింగ్ లోపం, వినియోగదారుల అవగాహన లేకపోవడం వల్ల ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. ఇది మనకు ఒక స్పష్టమైన పాఠం చెబుతోంది ఉత్పత్తి మాత్రమే సరిపోదు, మార్కెట్‌ను కూడా నిర్మించాలి.

**తెలంగాణలో సాధ్యమా?..** తెలంగాణ లోని ఆదిలాబాద్, భద్రచలం అడవుల్లో కూడా ఇప్ప చెట్లు సమృద్ధిగా ఉన్నాయి. అయితే ఇక్కడ ఇప్ప సారా ఉత్పత్తి ఒక వ్యవస్థగా అభివృద్ధి చెందలేదు. ఆదివాసీలు పండుగలు, శుభకార్యాలపుడు సొంతంగా తయారు చేసుకుంటారు



> మనం ఇప్ప చెట్టును కేవలం "సారా చెట్టు"గా చూసుకుంటామా? లేక "గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు ప్రతీక"గా గుర్తిస్తామా? సరైన పాలసీలు, మార్కెటింగ్, బ్రాండింగ్ ఉంటే ఇప్ప చెట్టు గిరిజన ప్రాంతాల్లో బంగారు భవిష్యత్తును నిర్మించగలదు. లేకపోతే అది అడవుల్లోనే నిశ్శబ్దంగా ఎండిపోయే మరో కోల్పోయిన అవకాశంగా మిగిలిపోతుంది.

. దానికి కూడా కొంత వరకే ప్రభుత్వ పరిమితి ఉంది. అయితే దీనిని ఒక ఉపాధి మార్గంగా చూసినపుడు ఇది ఒక కోల్పో తున్న అద్భుత అవకాశం. గిరిజన మహిళా సంఘా లు, స్వయం సహాయక సంఘాలు, కోఆపరేటివ్ మోడల్ ద్వారా ఇప్ప ఉత్పత్తులను ప్రాసెస్ చేసి మార్కెట్లోకి తీసుకొస్తే, ఇది వేల కుటుంబాలకు ఉపాధి కల్పించగలదు. ముఖ్యంగా "సహజ ఉత్పత్తులు"పై పెరుగుతున్న డిమాండ్‌ను ఉపయోగించుకోవచ్చు.

**ఇప్ప పూలను తాకితే పులి వస్తుందా?**

' అడవుల్లో విస్తారంగా పెరిగే ఇప్ప చెట్ల మీద పూలను మేం తాకము. అవి కింద రాలిపోయిన తరువాతనే ఏరుకుంటాం. చెట్లమీద పూలను తాకితే పులి వస్తుందని మా గోండు గిరిజనులు గట్టిగా నమ్ముతారు. అందుకే కట్టెతో కూడా వాటిని టచ్ చేయరు.' అంటాడు ఆదిలాబాద్‌జిల్లా, ఉట్నూరులో 'ఆదివాసీ ఆహార కేంద్రం' నిర్వహిస్తున్న కుమ్రా విటల్ రావు.

**తొలి ఇప్పపూవు లడ్డూ కేంద్రం**

ఈ ప్రాంతంలో ఏటా క్వింటాళ్ల కొద్దీ ఇప్పపూలు అడవుల్లో రాలిపోతుంటాయి. కొందరు సేకరించినా ఎక్కువ శాతం వృధా అవుతుంటాయి. విలువైన ఈ అటవీ ఉత్పత్తి నుండి అడవిబిడ్డల ఆదాయం పెంచాలనే ఆలోచనతో 2020లో అప్పటి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ దివ్యా దేవరాజన్ ఉట్నూరులో కొంత స్థలం కేటాయించి 12 మంది మహిళలతో భీంబాయి ఆదివాసీ మహిళా సహకార సంఘం ఏర్పాటు చేశారు . ' మాకు ఆర్థిక సహాయం అందించడమే కాక, ఇప్పపూలతో విలువ ఆధారిత ఉత్ప త్తుల తయారీలో జార్ఖండ్‌లో శిక్షణకు పంపించి, ఆహార పదార్థాలు తయారీకి అవసరం అయిన యంత్రాలను కూడా సమకూర్చడంతో ఇపుడు తెలంగాణలో తొలి ఇప్పపూవు లడ్డూ కేంద్రంగా పేరు వచ్చింది. అన్నారు, అధ్యక్షురాలు కుమ్ర భాగు బాయి. ఈ కేంద్రంలో ఇప్పపూల లడ్డూలు, జ్యూస్ తయారు చేస్తున్నారు. ఆదిలాబాద్ ,కుమురం భీం అసిఫాబాద్ జిల్లాల్లో 2,600 మంది గిరిజన గర్భిణులకు, ఆశ్రమ స్కూళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థినులకు ఈ లడ్డూలను సరఫరా చేస్తున్నారు.

**ఇప్ప సారాలో ఏముంది?**

ఇప్ప సారా ఆరోగ్య పరంగా కెమికల్ లిక్కర్ కంటే మెరుగైనదని కొందరు భావిస్తున్నారు. ఇది సహజ ఫర్మెంటేషన్ ద్వారా తయారవుతుందని నిపుణులంటారు కానీ ఇది కూడా ఆల్కహాల్ అన్న విషయం మర్చిపోవద్దు. కాబట్టి దీన్ని "హెల్త్ డ్రింక"గా కాకుండా, నియంత్రిత వినియోగంతో కూడిన సంప్రదాయ ఉత్పత్తిగా చూడాలి. ఆరోగ్యంపై దాని ప్రభావం కంటే, గిరిజనుల ఆర్థిక స్థితిపై దాని ప్రభావం చాలా ముఖ్యమైనది. నిజానికి ఇప్ప చెట్టు చుట్టూ ఒక సంపూర్ణ ఆర్థిక వ్యవస్థను నిర్మించవచ్చు. పూలతో సారా మాత్రమే కాదు, జ్యూస్, సిరప్, జామ్, గింజల నూనె, బయోఫ్యూయల్ వంటి అనేక ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఎకోటూరిజంతో కలిపితే "ట్రైబల్ ఎక్స్‌పీరియెన్స్"గా ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే మార్గం. అంతిమంగా ఒక ప్రశ్న మనం ఇప్ప చెట్టును కేవలం "సారా చెట్టు"గా చూసుకుంటామా? లేక "గిరిజనుల ఆర్థిక స్వావలంబనకు ప్రతీక"గా గుర్తిస్తామా? సరైన పాలసీలు, మార్కెటింగ్, బ్రాండింగ్ ఉంటే ఇప్ప చెట్టు గిరిజన ప్రాంతాల్లో బంగారు భవిష్యత్తును నిర్మించగలదు. లేకపోతే అది అడవుల్లోనే నిశ్శబ్దంగా ఎండిపోయే మరో కోల్పోయిన అవకాశంగా మిగిలిపోతుంది.



శ్యాంమోహన్
9440595858



# జాతీయం-అంతర్జాతీయం



## సీట్ల పంపిణీని ఖరారు చేసిన డీఎంకె



**చెన్నై, మార్చి 28 (వుదయం డెస్క్) :**
మిత్రపక్షాలతో సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం, అధికార డిఎంకె శనివారం నాడు తన వారికి నియోజకవర్గాల కేటాయింపును ఖరారు చేసింది. ఆ వెంటనే, పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ప్రత్యక్షంగా పోటీ చేస్తున్న మొత్తం 164 నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొత్తం 234 స్థానాల్లో మిత్ర పక్షాలకు 70 సీట్లు ఇచ్చింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్‌కు 28 సీట్లు కేటాయించింది. వాటిలో పొన్నేరి, ఈరోడ్ ఈస్ట్, విలవన్‌కోడ్, శివకాశి, కారైకుడి మొదలైన స్థానాలు ఉన్నాయి. డీఎండీకేకు 10 సీట్లు, రెండు వామపక్ష పార్టీలకు చెరో 5 స్థానాలు, వీసీకేకు 8, ఎండీఎంకే 4, ఎంఎంకే 2, ఐయూఎంఎల్ 2, ఎంజేకే ఎస్‌డీపీఐకు చెరొక సీటు కేటాయించింది.

మిత్రపక్షాలకు కేటాయించిన నియోజకవర్గాల జాబితాలో, ఆ పార్టీలు కోరుకున్న వాటితో పాటు కొన్ని కొత్త నియోజకవర్గాలు కూడా ఉన్నాయి. కాగా, డీఎంకే అభ్యర్థులలో కూడా సుపరిచిత ముఖాలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, 60 మందికి పైగా తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న వారు ఉన్నారు.
పార్టీలోని చాలా మంది సీనియర్, ప్రముఖ నాయకులు అవే నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నారు. వీరిలో కోలత్తూరు నుంచి నాలుగోసారి ముఖ్యమంత్రి స్టాలిన్, చేపాక్ నుంచి ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తిరిగి ఎన్నిక చేస్తున్నారు. ఆయన 2021లో చేపాక్‌లో తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేయనున్న డీఎంకే అభ్యర్థుల తొలి జాబితాను స్టాలిన్ విడుదల చేశారు. కొయంబత్తూర్ సౌత్ నుంచి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ బరిలోకి దిగారు. బోడినాయగనూర్ నుంచి పన్నీర్‌సెల్వం పోటీలో ఉన్నారు. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23న జరగనుంది. కౌంటింగ్ మే 4న ఉంటుంది.

## దేశ భద్రతకు బెంగాల్ ఎన్నికలు కీలకం

### కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**కోల్‌కత, మార్చి 28 (వుదయం) :**
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, శనివారం నాడు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తృణమూల్ ప్రభుత్వంపై ఒక చార్జిషీటును విడుదల చేయడం ద్వారా తమ పార్టీ ప్రచారాన్ని ఉధృతం చేశారు. అంతేకాక, ఈ ఎన్నికలను కేవలం రాష్ట్రం కోసమే కాకుండా, దేశ భద్రత కోసం జరుగుతున్న పోరాటంగా ఆయన అభివర్ణించారు. కోల్‌కతాలో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన షా, ఆ పార్టీ సాగించిన 15 ఏళ్ల పాలనలో ఈ రాష్ట్రం అక్రమ చొరబాట్లు, బుజ్జగింపు రాజకీయాలు, సరిహద్దు అభద్రతకు దేశంలోనే ప్రధాన కారిడార్‌గా మారిందని ఆరోపించారు.
బెంగాల్ ఎన్నికలు కేవలం ఈ రాష్ట్రానికి మాత్రమే కాక, యావత్తు దేశానికి కూడా ఎంతో కీలకం. ఒక రకంగా చెప్పాలంటే, దేశ భద్రత బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉంది, అని షా పేర్కొన్నారు.
అసెంబ్లీ ఎన్నికల ముందు అధికార పక్షంపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను ప్రస్తావిస్తూ, బెంగాల్‌లో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తృణమూల్ ప్రభుత్వంపై అపూర్వ రీతిలో విరుచుకుపడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే, అవినీతి, సిండికేట్ రాజ్ విషయంలో పశ్చిమ బెంగాల్ అగ్రస్థానంలో ఉంది. ఈ రాష్ట్రం అవినీతికి ఒక ప్రయోగశాల లాగా తయారైందని షా అభివర్ణించారు. బెంగాల్ ఎన్నికలు కేవలం ఆ రాష్ట్రానికే కాకుండా, యావత్తు దేశానికి కూడా ఎంతో కీలకం. ఒక రకంగా చెప్పాలంటే, దేశ భద్రత బెంగాల్ ఎన్నికలతో ముడిపడి ఉంది, అని షా అన్నారు.
భారీ ఎత్తున అవినీతి ఆరోపణలపై జైలు పాలైన నాయకులను తృణమూల్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో బరిలోకి దింపింది. ఆ పార్టీ అబద్ధాలు, హింసతో కూడిన రాజకీయాల ఆధారంగా నడుస్తోంది. మమతా దీదీ కొన్నిసార్లు తన విరిగిన కాలు, తలకు తగిలిన గాయం గురించి అబద్ధాలు చెబుతుంటారు; అంతేకాకుండా, తరచుగా ఎన్నికల సంఘంపై విమర్శల దాడికి దిగుతుంటారు, అని అధికార పార్టీపై షా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అస్సాంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఆ రాష్ట్రం గుండా సాగే చొరబాటు మార్గాలు మూసివేశామని, చొరబాటుకు ఇప్పుడు పశ్చిమ బెంగాల్ మాత్రమే మిగిలి ఉన్న ఏకైక మార్గం అని షా పేర్కొన్నారు. చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశించి అలజడులు సృష్టిస్తున్న ఏకైక రాష్ట్రం పశ్చిమ బెంగాల్ మాత్రమే, అని ఆయన అన్నారు.
శనివారం, కోల్‌కతలో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రసంగించారు.
సర్ విషయంలో కేవలం పశ్చిమ బెంగాల్‌కే ఎందుకు సమస్య ?: అమిత్ షా ప్రశ్నించారు.
టిఎంసి అనుసరిస్తున్న తుష్టీకరణ, ఓటు బ్యాంకు రాజకీయాలకు ఈ అంశాన్ని పదేపదే ముడి పెట్టారు; సరిహద్దు నిర్వహణను బలోపేతం చేసే ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడుతోందని ఆయన ఆరోపించారు.
కేంద్రం నుండి పదేపదే అభ్యర్థనలు వచ్చినప్పటికీ, సరిహద్దు కంచె నిర్మాణానికి మమతా బెనర్జీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని షా ఆరోపించారు. ఈ నిరాకరణ రాజకీయంగా ప్రేరేపితమైనది అని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేసే అవకాశం ఉన్న తమ ఎన్నికల ప్రణాళిక లేదా సంకల్ప పత్రంలో, తృణమూల్ కాంగ్రెస్ ఆరోపిత లోపాలను ఎత్తిచూపడానికి, ప్రత్యామ్నాయాలను ప్రదర్శించడానికి కాషాయ పార్టీ ఈ ఛార్జ్‌షీట్'ను ఉపయోగించుకోవాలని యోచిస్తోంది.
మీరు ఎవరిని ఎన్నుకోవాలనుకుంటున్నారు భీభత్సాన్ని, హింసను ప్రేరేపించే పార్టీనా, లేక విశ్వాసం, స్థిరత్వం, సుపరిపాలనను అందించే పార్టీనా? బీజేపీ బెంగాల్‌లో సుపరిపాలనను అందిస్తుంది. మేము అంగా (అస్సాం), కళింగ (ఒడిశా) గెలిచాం, ఇప్పుడు బంగను గెలుస్తాం," అని ఆయన అన్నారు.
బెంగాల్‌లో మహిళలు సురక్షితంగా లేరు. ఇక్కడ ఆర్.జి. కార్ ఆసుపత్రి, కామ్దుని, హన్స్‌ఖాలిలలో అత్యాచారాలు, హత్యల వంటి దిగ్భ్రాంతికరమైన సంఘటనలు జరిగాయి. పార్క్ స్ట్రీట్ అత్యాచార కేసు కల్పితమని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం కంటే కమ్యూనిస్టు పాలనే మెరుగ్గా ఉండేదని ఈ రాష్ట్ర ప్రజలు అంటారు, అని ఆయన విలేకరులతో అన్నారు.
ఇటీవల బెంగాల్ పర్యటనలో గౌరవనీయ రాష్ట్రపతిని కూడా ఆమె వదల్లేదు. ఆమె గిరిజన వర్గానికి చెందినప్పటికీ, ఆమెను అవమానించారు. మమతా దీదీ ఎన్నికల సమయంలో ఎప్పుడూ బాధితురాలి కార్డును ఉపయోగించడానికి ప్రయత్నిస్తారు. సమస్యలపై చర్చించడానికి నేను ఆమెను చాలాసార్లు సంప్రదించడానికి ప్రయత్నించాను కానీ విఫలమయ్యాను. నాతో మాట్లాడటానికి ఆమెకు తీరిక లేదు. ఆమె భయం, తీవ్రవాదం, విభజన రాజకీయాలతో కూడిన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు, అని కేంద్ర హోం మంత్రి ఆరోపించారు.
ఎన్నికల ఓటర్ల జాబితాకు సంబంధించి జరుగుతున్న ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియపై మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కొనసాగుతున్న ఇతర 14 రాష్ట్రాల్లో ఎక్కడా ఎటువంటి కోర్టు కేసులు దాఖలు కాలేదు. కానీ కేవలం బెంగాల్‌లో మాత్రమే ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా కేసులు దాఖలయ్యాయి. పత్రాల పరిశీలన బాధ్యతలను నిర్వహించడానికి న్యాయాధికారులను నియమించారు. కేరళ, తమిళనాడు వంటి బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో కూడా, ఎటువంటి వ్యతిరేకత లేకుండా సర్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. బెంగాల్‌లో మాత్రం, సర్‌ను వ్యతిరేకించే ముసుగులో అక్రమ ముస్లిం ఓటర్లను కాపాడాలని ఆమె భావిస్తున్నారు, అని ఆయన వ్యాఖ్యానించారు.
టిఎంసి అధికారంలోకి రావడానికి అబద్ధాలు, భయం, హింస మూలంగా ఉన్నాయి. అయితే 2011 నుండి బీజేపీ దీనికి వ్యతిరేకంగా పోరాడుతోంది, ఈసారి బెంగాల్‌లో బీజేపీనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నేను విశ్వసిస్తున్నాను, అని ఆయన అన్నారు.
బెంగాల్ ఎన్నికలు ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. ఈ రెండు దశల ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది.

## రాష్ట్రం తర్వాత ఢిల్లీనే మా లక్ష్యం

### మమతా బెనర్జీ



**కోల్‌కత, మార్చి 28 (వుదయం) :**
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్‌లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటు చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమ బెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే భాజపా దేశంలో అధికారాన్ని కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తానన్నారు. బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఆరోపించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ భాజపా నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను భాజపా పావులా వాడుకుంటోందన్నారు. రాష్ట్రంలో భాజపా ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు.
రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితో పాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.

## గగనతలంలో ఇంజిన్ సమస్య

### ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర పరిస్థితి




**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :**
శనివారం ఉదయం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక విమానం అత్యవసర ల్యాండింగ్ కావడంతో, అత్యవసర సేవల సిబ్బంది తక్షణమే స్పందించారు. ఢిల్లీ అగ్నిమాపక సేవల ఇచ్చిన వివరాల ప్రకారం, ఉదయం 10:53 గంటలకు ఈ అత్యవసర పరిస్థితికి సంబంధించిన సమాచారం అందింది; దీనితో ముందు జాగ్రత్త చర్యగా అనేక అగ్నిమాపక వాహనాలను వెంటనే విమానాశ్రయానికి పంపారు.

**తక్షణ అత్యవసర ప్రతిస్పందన**
ప్రయాణికుల భద్రతను నిర్ధారించడానికి , సంభావ్య ప్రమాదాలను ఎదుర్కోవడానికి సిబ్బందిని ఆలస్యం లేకుండా సమీకరించినట్లు అగ్నిమాపక అధికారులు ధృవీకరించారు. అగ్నిమాపక వాహనాలను వేగంగా మోహరించడం వల్ల విమానం రావడానికి ముందే రన్‌వే ప్రాంతాన్ని సురక్షితం చేయడానికి అది సహాయపడింది. ప్రామాణిక అత్యవసర నిబంధనలను పాటిస్తూ, ల్యాండింగ్ ప్రక్రియ సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉన్నారు.

**సురక్షిత ల్యాండింగ్**
విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, ఎటువంటి గాయాలు లేదా నష్టం జరగలేదని డిఎఫ్ ఎస్ పేర్కొంది. ప్రయాణీకులు, సిబ్బంది అందరూ క్షేమంగా ఉన్నారని ధృవీకృతమైంది. అత్యవసర ల్యాండింగ్‌కు గల కచ్చితమైన కారణాన్ని ఇంకా వెల్లడించలేదు, మరిన్ని వివరాల కోసం విమానయాన అధికారులను సంప్రదించాల్సి ఉంది.
పరిస్థితి అదుపులో ఉంది: ప్రామాణిక భద్రతా విధానాలకు మించి ఎటువంటి అంతరాయం లేకుండా, పరిస్థితిని సమర్థవంతంగా చక్కదిద్దినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం విమానాశ్రయ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయి. సాధారణ భద్రతా విధానాలకు మించి ఎటువంటి అంతరాయం లేకుండా, పరిస్థితిని సమర్థవంతంగా నిర్వహించామని అధికారులు తెలిపారు.

## 50 శాతం విమానాల్లో పునరావృతమయ్యే లోపాలు

### తీవ్రంగా దెబ్బతిన్నఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్: నివేదిక




**న్యూఢిల్లీ, మార్చి 28 (వుదయం) :**
అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత, భారతదేశ విమానయాన రంగంలో వాణిజ్య విమానాలలో లోపాలు క్రమంగా పెరుగుతున్నాయి. ఒక పార్లమెంటరీ ప్యానెల్ తీవ్రమైన భద్రతా సమస్యలను ఎత్తిచూపుతూ, దేశ భద్రతా వ్యవస్థను సమూలంగా పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చిందని ఎన్డీటీవీ పేర్కొంది. పౌర విమానయాన స్థాయీ సంఘం తాజా నివేదికల ప్రకారం, జనవరి 2025 నుండి ఫిబ్రవరి 2026 మధ్యకాలంలో మొత్తం 754 వాణిజ్య విమానాలను తనిఖీ చేశారు. ఈ 754 విమానాలలో, ఏకంగా 377 విమానాలలో పదేపదే సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఈ నివేదికను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఆధారంగా రూపొందించారు.
పునరావృతమయ్యే సాంకేతిక లోపాల జాబితాలో ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ అగ్రస్థానంలో నివేదికల ప్రకారం, అత్యధిక లోపాలు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లోనే కనుగొన్నారు. మొత్తం 166 ఎయిర్ ఇండియా విమానాలను తనిఖీ చేయగా, వాటిలో 137 విమానాలలో పునరావృతమయ్యే సాంకేతిక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు, ఈ కాలవ్యవధిలో తనిఖీ చేసిన 101 ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలలో 54 విమానాలలో నిరంతర సాంకేతిక సమస్యలు ఉన్నాయి. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తరువాత, 2025 జూలై 1 నుండి 4 మధ్య ఎయిర్ ఇండియాపై డీజీసీఏ ఒక వివరణాత్మక ఆడిట్‌ను జారీ చేసింది. ఇందులో తక్షణమే సరిదిద్దే చర్యలు తీసుకోవాల్సిన ఏడు లెవెల్ 1 ఉల్లంఘనలతో సహా, సుమారు 100 భద్రతా లోపాలను గుర్తించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, బోయింగ్ 787 777 విమానాలకు సంబంధించి పైలట్లకు ఇచ్చే పునరావృత శిక్షణలో ఉన్న లోపాలు, కనీసం నాలుగు అంతర్జాతీయ విమానాలలో క్యాబిన్ సిబ్బంది కొరత, ఫ్లైట్ డ్యూటీ సమయ పరిమితుల ఉల్లంఘనలను ఈ ఆడిట్ వెలుగులోకి తెచ్చింది. మిలన్ నుండి న్యూఢిల్లీకి వెళ్లాల్సిన ఒక విమానం, అనుమతించిన పరిమితిని మించి రెండు గంటలకు పైగా ఆలస్యమైంది. భద్రతాపరమైన ఆందోళనల కారణంగా డీజీసీఏ, ఎయిర్ ఇండియాకు తొమ్మిది షో కాజ్ నోటీసులను జారీ చేసిందని కమిటీ పేర్కొంది.
డిసెంబర్ 2025లో చెల్లుబాటు అయ్యే ఎయిర్‌వర్తినెస్ రివ్యూ సర్టిఫికేట్ లేకుండా ఎనిమిది ఫ్లైట్లలో ఎయిర్‌బస్ ఎ320ను నడిపినందుకు, డీజీసీఏ ఎయిర్ ఇండియాపై సుమారు రూ. 1 కోటి జరిమానా విధించింది. విమానయాన రంగంలో ఖాళీల రేటు 48.3 శాతానికి పెరగడం ఆందోళన కలిగించే విషయమని కూడా ఈ కమిటీ పేర్కొంది. ఇంత ఎక్కువ ఖాళీల రేటుతో విమానయాన రంగాన్ని విస్తరించేందుకు ఆ సంస్థకు తగినంత సామర్థ్యం ఉందా అని కమిటీ డీజీసీఏను ప్రశ్నించింది.

## గత ఏడాది భీకర జెన్ జీ నిరసనల కేసులో నేపాల్ మాజీ ప్రధాని ఓలీ అరెస్టు



**వుదయం డెస్క్, మార్చి 28:**
దేశ నూతన ప్రధానమంత్రిగా బాలేంద్ర షా ప్రమాణ స్వీకారం చేసిన సరిగ్గా ఒక్క రోజు తర్వాత, గత ఏడాది జరిగిన భీకర జెన్ జీ నిరసనల్లో ఆయన ఆరోపిత పాత్రకు నేపాల్ మాజీ ప్రధాని కె.పి. శర్మ ఓలి అరెస్టు కావడం, నాటకీయ పరిణామాలకు దారితీసింది.
దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన, పలువురి మరణాలకు దారితీసిన నిరసనల దర్యాప్తులో ఒక కీలక పరిణామంగా, ఓలిని ఆయన మాజీ హోం మంత్రి రమేష్ లేఖక్‌తో పాటు అదుపులోకి తీసుకున్నారు.
"వారిని ఈ ఉదయం అరెస్టు చేశారు, చట్టం ప్రకారం తదుపరి ప్రక్రియ ముందుకు సాగుతుంది," అని ఖాట్మండు లోయ పోలీసు ప్రతినిధి ఓం అధికారి తెలిపారని ఎఎఫ్‌పి పేర్కొంది. కాగా, తన అరెస్టు ప్రతీకార చర్య అని, దీనిని చట్టపరంగా సవాలు చేస్తానని నేపాల్ మాజీ ప్రధాని ఓలీ పేర్కొన్నారు. గత ఏడాది చోటు చేసుకున్న హింసాత్మక ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల అనంతరం నేపాల్ సున్నితమైన రాజకీయ పరివర్తన దశలో ఉన్న తరుణంలో ఈ పరిణామం చోటు చేసుకుంది.
ఈ అరెస్టు ప్రతీకార చర్యే. దీనిని నేను న్యాయపరంగా ఎదుర్కొంటాను, మీరందరూ సిద్ధంగా ఉండండి," అని ఓలి తన న్యాయవాదులతో చెప్పినట్లు నేపాలీ వార్తా సంస్థ ఆన్‌లైన్ ఖబర్ తెలిపింది. ఈ హింసాకాండలో తనకు ఎటువంటి పాత్ర లేదని ఓలి ఖండించినట్లు కూడా ఆ సంస్థ పేర్కొంది.
ఓలీ పార్టీ అయిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్‌లెనినిస్ట్) నాయకులు ఈ అరెస్టుకు గల ప్రాతిపదికను ప్రశ్నించారు. ఈ దర్యాప్తు నివేదికలో తగినంత ఆధారాలు లేవని పార్టీ సీనియర్ సభ్యుడు రఘుజీ పంత్ పేర్కొంటూ, ఇది ఉద్దేశ్యపూర్వకంగానే రూపొందించినట్టు ఆరోపించారు.

## నెలరోజుల యుద్ధంలో అగ్రనాయకులను కోల్పోయిన ఇరాన్



**వుదయం డెస్క్, మార్చి 28:**
ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భారీ సైనిక చర్యను ప్రారంభించిన ఒక నెల తర్వాత కూడా, ఆ విధ్వంసం, రాజకీయ అలజడి తాలూకు ప్రభావం ఆ ప్రాంతమంతటా ఇంకా ప్రతిధ్వనిస్తూనే ఉంది. 2026 ఫిబ్రవరి 28న వరుస సమన్వయ, కచ్చితమైన దాడులుగా ప్రారంభమైన ఈ పరిణామం ఇటీవలి పశ్చిమ ఆసియా చరిత్రలోనే అత్యంత కీలకమైన సంఘర్షణలలో ఒకటిగా రూపుదిద్దుకుంది.
తొలి దాడులు టెహ్రాన్‌లో, ఇతర ప్రాంతాలలో ఉన్న కీలక సైనిక స్థావరాలు, నాయకత్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఇది ఇరాన్ కమాండ్ వ్యవస్థను కూల్చివేయడానికి జరుగుతున్న ఒక వ్యూహాత్మక ప్రయత్నానికి సంకేతం. అత్యున్నత అధికార స్థాయిలో ఆ దేశం అపూర్వమైన నష్టాలతో సతమతమవుతున్న తరుణంలో, ఈ దాడులు కేవలం సైనికంగానే కాకుండా రాజకీయంగా కూడా ఒక మలుపు అని చెప్పవచ్చు.

**తొలి దాడి ఇరాన్ నాయకత్వాన్ని కుదిపేసింది**
తొలి విడత దాడుల్లో మరణించిన వారిలో 1989 నుండి ఇస్లామిక్ రిపబ్లిక్‌కు నాయకత్వం వహించిన అలీ ఖమేనీ కూడా ఉన్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)కు చెందిన పలువురు సీనియర్ కమాండర్లతో పాటు ఆయన మరణం, తక్షణమే ఒక నాయకత్వ శూన్యతను సృష్టించింది.
ఇరాన్ సైనిక, గూఢచార వ్యూహాలను దీర్ఘకాలంగా పర్యవేక్షిస్తున్న అగ్రశ్రేణి వ్యక్తులనే ఈ ఆపరేషన్ ఉద్దేశ పూర్వకంగా లక్ష్యంగా చేసుకుందని ఇజ్రాయెల్ ధృవీకరించింది. కొద్ది రోజుల్లోనే, ఇజ్రాయెల్, గల్ఫ్‌లోని అమెరికా అనుకూల దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులతో ప్రతిస్పందించి, ఈ ఘర్షణను ఒక విస్తృత ప్రాంతీయ సంఘర్షణగా మార్చింది.
మార్చి 8న, టెహ్రాన్‌లోని అధికారులు మొజ్తబా ఖమేనీ సర్వోన్నత నాయకుడిగా బాధ్యతలు స్వీకరిస్తారని ప్రకటించారు; గందరగోళం మధ్య కొనసాగింపును కాపాడే ప్రయత్నంగా ఈ చర్యను పరిగణించారు.

**వ్యూహాత్మక ఆస్తులే లక్ష్యంగా దాడి**
నాయకత్వానికి అతీతంగా, ఈ దాడులు ఇరాన్ ఆర్థిక, వ్యూహాత్మక వెన్నెముక వరకు విస్తరించాయి. దేశ ప్రాథమిక చమురు ఎగుమతి టెర్మినల్ అయిన ఖర్గ్ ద్వీపం, ప్రపంచంలోని అతిపెద్ద సహజ వాయు నిల్వలలో కీలకమైన సౌత్ పార్స్ వంటి ముఖ్యమైన ప్రదేశాలపై దాడులు జరిగాయి.
అంతేకాకుండా, తమ అణు ఆశయాలు శాంతియుతమైనవని టెహ్రాన్ చాలా కాలంగా నొక్కి చెబుతున్నప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన అనేక ప్రదేశాలపై కూడా దాడులు జరిగాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను, సైనిక కార్యకలాపాలను కొనసాగించే దీర్ఘకాలిక సామర్థ్యాన్ని బలహీనపరచడమే ఈ దాడుల లక్ష్యమని విశ్లేషకులు సూచిస్తున్నారు.

### మృతులలో ఉన్నత కమాండర్లు

యుద్ధం ప్రారంభమైన మొదటి నెలలోనే ఇరాన్ సైనిక, రాజకీయ వ్యవస్థలలోని ఉన్నతాధికారులు భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. మరణించినట్లు ధృవీకరించిన వారిలో
- అలీ ఖమేనీ - ఇరాన్ సర్వోన్నత నాయకుడు
- అలీ లారిజానీ - సర్వోన్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి
- అజీజ్ నసీర్‌జాదే - రక్షణ మంత్రి
- అబ్దుల్ రహీమ్ మౌసావి - చీఫ్ ఆఫ్ స్టాఫ్
- మొహమ్మద్ పక్‌పూర్ - ఐఆర్‌జిసి పదాతి దళాల కమాండర్
- ఘోలమ్రెజా సోలేమానీ - బసీజ్ కమాండర్
- అలీరెజా తంగ్సిరి - నావికాదళ కమాండర్
- మొహమ్మద్ షిరాజీ - సైనిక బ్యూరో అధిపతి
- అక్బర్ ఇబ్రహీమ్‌జాదే - సర్వోన్నత నాయకుడి కార్యాలయ ఉప అధిపతి
- ఘోలమ్రెజా రెజాయియాన్ - ఇంటెలిజెన్స్ అధిపతి (ఫరాజా)
- బహ్రామ్ హొస్సేనీ మోట్లాగ్ - ప్రణాళిక, ఆపరేషన్స్ అధిపతి
- హసనాలి తాజిక్ - లాజిస్టిక్స్ అధిపతి
- సలేహ్ అసది - సీనియర్ ఇంటెలిజెన్స్ అధికారి ఉన్నారు.

ఈ సంచిత ప్రభావం కారణంగా, ఇరాన్ క్రియాశీల పోరాటంలో కొనసాగుతూనే, తన కమాండ్ వ్యవస్థను పునర్నిర్మించుకోవడానికి తీవ్రంగా సతమతమవుతోంది.

**పెరుగుతున్న పౌరుల మరణాలు**
మానవతా సంక్షోభం తీవ్రంగా ఉంది. ఇరాన్‌లోని మానవ హక్కుల కార్యకర్తల ప్రకారం, మార్చి 26 నాటికి కనీసం 3,329 మంది మరణించారు, వీరిలో 1,492 మంది పౌరులు ఉన్నారు. వీరిలో 221 మంది చిన్నారులు కూడా ఉన్నారు. పౌర మౌలిక సదుపాయాలను అమెరికా, ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ ఆరోపించింది. ముఖ్యంగా, ఫిబ్రవరి 28న దక్షిణ ఇరాన్‌లోని ఐఆర్‌జిసి స్థావరం సమీపంలో ఉన్న ఒక బాలికల పాఠశాలపై దాడి జరిగిందని, ఈ దాడిలో సుమారు 110 మంది చిన్నారులతో సహా 168 మంది మరణించారని టెహ్రాన్ పేర్కొంది. ఈ సంఘర్షణ రెండో నెలలోకి ప్రవేశించగా, ఉద్రిక్తతలను తగ్గించడానికి స్పష్టమైన మార్గం లేకపోవడం, భౌగోళిక రాజకీయ పరిణామాలు కొనసాగుతుండటంతో ఈ ప్రాంతం ఉద్రిక్తంగానే ఉంది.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## నేడే సప్త కళల సమ్మేళనం



ఖమ్మం వుదయం బ్యూరో మార్చి 28):

ఫైర్ ప్రొడక్షన్ అండ్ పంచ్ ఎంటర్టైన్మెంట్స్ వారు సమర్పించు సప్త కళల సమ్మేళనం ఈ తేదీ 29.3.2026 ఆదివారం సమయం సాయంత్రం 6.30 నిమిషాలకు వేదిక భక్త రామదాసు కళాక్షేత్రం ఖమ్మం అందరు ఆహ్వానితులే సప్త కళల సమ్మేళనం అతిథులుగా ముఖ్య అతిథిగా కుడుదల ప్రవీణ్ కుమార్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మిత్ర గ్రూప్ చైర్మన్ సభ అధ్యక్షుడు వెల్లుల విజేత ఖమ్మం కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి విశిష్ట అతిథులు కళాసారథి ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులుడాక్టర్ నాగ బత్తిని రవి, వివి అప్పా రావు ఖమ్మం కళాపరిషత్ గౌరవ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వరరావు, బొమ్మ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ గుర్రం కాంతారావు ట్రస్మ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చెల్లా శేషగిరిరావు గారు అధ్యక్షులు ఖమ్మం జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలలు యం డి జాఫర్ మహిన్ గారు ట్రస్మ డివిజన్ అధ్యక్షులు కళ్ళ పాపారావు గారు తెలంగాణ ఏజెన్సీ అతిథులుగా సప్తకళల సమ్మేళనం పాల్గొంటారు. ఈ సందర్భంగా నాగబత్తిని రవి విజేత మేడం మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రదర్శనలు బొమ్మ డాన్స్ టీవీ అండ్ సినీ ఆర్టిస్ట్ జంక్షన్ శీను జూనియర్ చిరంజీవి డూప్ డాన్స్ డబల్ హిట్ డాన్స్ హలో మేన్ డాన్స్ స్ప్రింగ్ డాన్స్ వైబ్రెట్ బొమ్మ డాన్స్ అరుణ్ కుమార్ చెన్నై వారి చే సైకిల్ ఫీట్లు డాన్స్ సింగిల్ లెగ్ ప్రభు చెన్నై వారి చే ఉమ్మడి ఖమ్మం జిల్లా తెలంగాణ సంస్కృతిక సారధుల ఆటపాట ఫైర్ కుటుంబం ప్రదర్శనలు ఫైర్ మ్యాజిక్ జగ్లింగ్ రింగ్ భరత నాట్యం స్కేటింగ్ పై భరతనాట్యం ఉంటాయి. అని ఈ సందర్భంగా తెలియజేసారు అదే విధంగా ప్రేక్షక దేవుళ్ళు కవులు, కళాకారులు ప్రేక్షకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫైర్ కుటుంబం ఈ సందర్భంగా కోరారు.

## పరీక్ష కేంద్రాలు, అంగన్‌వాడీల తనిఖీ

**నిబంధనల ప్రకారం పరీక్షల నిర్వహణ**
**– జిల్లా కలెక్టర్ అద్వైత్ స్నేహ శబరీష్**
**మహబూబాబాద్, మార్చి 28 (వుదయం ప్రతినిధి):**

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ స్నేహ శబరీష్ శనివారం నెల్లికుదురు మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల సరళిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణపై ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ పలు సూచనలు చేశారు.

**పరీక్షల గణాంకాలు:**

జిల్లాలోని 45 కేంద్రాల్లో మొత్తం 8,165 మంది విద్యార్థులకు గాను,ఈ రోజు99.89%హాజరు నమోదైంది. కట్టుదిట్టమైన పర్యవేక్షణ 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్, ప్రతి కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్ చొప్పున నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుమారు 528 మంది సిబ్బంది, 45 వైద్య బృందాలు విధుల్లో ఉన్నాయి. సాంకేతిక పర్యవేక్షణ:సీసీ కెమెరాల నిఘాలో ప్రశ్నపత్రాల ప్రక్రియ సాగుతోంది. విద్యాశాఖ కార్యాలయం నుండి వైర్లెస్ సెట్ల ద్వారా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఏప్రిల్ 16 వరకు పరీక్షలు సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉందని కలెక్టర్ తెలిపారు.



**అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ**

పరీక్షా కేంద్రం సందర్శన అనంతరం కలెక్టర్ స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి ఆదేశాలు జారీ చేశారు. నాణ్యమైన బలవర్ధక ఆహారం అందించాలి.

**పిల్లలపై నిఘా..**

అతి తక్కువ బరువున్న , ఓ మోస్తరు తక్కువ బరువున్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
అంగన్‌వాడీల్లో ఆరోగ్యం, విద్య, పోషణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వి. రాజేశ్వర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యత

**- చట్టాలు ప్రజా ప్రయోజనార్థం వాటిని దుర్వినియోగం చేయరాదు**
**- జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ**
**యాదాద్రి భువనగిరి / మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి) :**



మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలను సమగ్రంగా అమలు చేయడం, మహిళలందరికి పని ప్రదేశంలో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం బాధ్యతగా చూడాలని జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, జిల్లా సంక్షేమాధికారి నరసింహారావు అన్నారు. పని ప్రదేశంలో మహిళలకు రక్షణ మరియు పోష్ చట్టం పై శనివారం ఆక్షన్ఎయిడ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని వెటర్నరీ మీటింగ్ హాల్ లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల స్థానిక మరియు ఇంటర్నల్ పిర్యాదుల కమిటీ సభ్యులు, జిల్లా, మండల సమాఖ్య సభ్యులకు ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇలాంటి శిక్షణలు మహిళలతో పాటుగా పురుషులకు కూడా అవసరమని, సంఘటిత రంగంతో పాటుగా అసంఘటిత రంగంలో కూడా అవగాహన కల్పించడం అవసరమని ఇంతటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆక్షన్ఎయిడ్ సంస్థను అభినందించారు. ఆక్షన్ఎయిడ్ ప్రతినిధి వందన పాల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వందనపాల్ మాట్లాడుతూ... విశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా 2013 లో పోష్ చట్టం వచ్చిందని. ఈ చట్టం ప్రకారం పని ప్రదేశంలో అంటే ఉద్యోగుల తో పాటు అన్ని రంగాల మహిళలందరికీ ఈ చట్టం వర్తిస్తుందని, గృహ కార్మికులు, నిర్మాణ రంగ కార్మికులు, వీధి వ్యాపారులకు కూడా వర్తిస్తుందని అన్నారు. ఈ చట్టంలో గోప్యత ఉంటుందని బాధిత మహిళలు మూడు నెలలోపు స్థానిక పిర్యాదుల కమిటీకి పిర్యాదు చేయవచ్చని అన్నారు. మహిళలు, పిల్లలు, కార్మికులు ప్రజలందరి ప్రయోజనార్థమే ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయని అంతటి గొప్ప చట్టాలు మనకు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలే తప్ప దుర్వినియోగం చేయరాదని అన్నారు. మహిళలందరికి రక్షణ కోసం, అభివృద్ధి, సాధికారత కోసం అనేక చట్టాలు పాలసీలు ఉన్నాయని వీటన్నింటి పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆక్షన్ఎయిడ్ ఆధ్వర్యంలో పోష్ చట్టం 2013 పై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాదని అందులో భాగంగ యాదాద్రి భువనగిరి జిల్లాలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. పోష్ చట్టం నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని సంస్థల్లో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని ఇందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ బాధ్యత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆక్షన్ఎయిడ్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ సురుపంగ శివలింగం అధ్యక్షత వహించగా జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితీ, డిప్యూటీ డిఎం అండ్ ఎచ్ వో డాక్టర్ యశోద, వీణ, సత్యవతి, సిడిపివోలు శైలజ, స్వరాజ్యం, యామిని, సమీరా వైద్యాధికారులు నితిష,నిరోష, మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి యశోద, హర్ష, నిఖిత, జిల్లా వ్యవసాయ శాఖ ఏడి నీలిమ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నుండి రమణ ,స్థానిక పిర్యాదుల కమిటీ సభ్యులు లావణ్య, సుమలతలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల నుండి సూపర్వైజర్లు, సిబ్బందితో పాటు సుమారు ఎనభై అయిదు మంది పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ,మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి):**

ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధుల నుండి ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు ప్రతి సోమవారం జరిగే సాధారణ ప్రజావాణికి హాజరు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముండటంతో, వారికి ప్రత్యేకంగా ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 74 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రతి అర్జీపై సంబంధిత శాఖలు సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేతతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎం.వి.ఐ కార్యాలయంఎదుట లారీ యజమానుల అర్ధనగ్న ప్రదర్శన

**క్యూఆర్ కోడ్ రేడియం స్టిక్కర్ల విధానాన్ని రద్దు చేయాలి**
**కోదాడ, మార్చి 28(వుదయం):**

క్యూఆర్ కోడ్ రేడియం స్టిక్కర్ల పేరిట జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ లారీ అసోసియేషన్ నాయకులు శనివారం కోదాడ ఎం.వి.ఐ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై లారీ యజమానులు చొక్కాలు విప్పి అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేశారు.
బయట మార్కెట్ లో తక్కువ ధరకు లభించే రేడియం స్టిక్కర్లను ప్రభుత్వం జీవో తీసుకువచ్చి ఏజెన్సీల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తూ లారీ యజమానులను, ఇతర వాహనదారులను వేధిస్తున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికే అనేక పన్నులతో మోయలేని భారంతో రవాణా రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నదని, కొత్తగా తీసుకువచ్చిన రేడియం స్టిక్కర్ల విధానం మరింత భారంగా మారిందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి



ఈ విధానాన్ని రద్దు చేసి దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షులు తూనం కృష్ణ, సెక్రటరీ యలమందల నరసయ్య, రాష్ట్ర చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, పెద్ది చంద్రమౌళి, కనగాల నాగేశ్వరరావు, లింగయ్య, గౌస్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**స్టేషన్ ఘనపూర్, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :**

పది పరీక్షలు ప్రశాంత వాతావరణం లో జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ఝా తెలిపారు.
శనివారం రోజున జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) మండల పరిధిలో గల జెడ్పీ ఎస్ఎస్, అలాగే అదే మండలంలోని ఛాగల్ గ్రామం లోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.
ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ సరళిని పరిశీలించారు.పరీక్షకు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, తాగునీటి వసతి, ఇతర మౌలిక వసతులు, ఆరోగ్య శిబిరం వంటి వాటి గురించి ఆరా తీశారు.ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా నిర్వహించాలని, పరీక్ష పూర్తైన వెంటనే జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి



**– జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
**వర్ధన్నపేట, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) పనులను ఎలాంటి పొరపాట్లు లేకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.
శనివారం రోజున వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవానీకుంట తండాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే పనులను ఆమె స్వయంగా పరిశీలించారు.
సాంకేతికత వినియోగంతో జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే మ్యాపింగ్ ద్వారా భూముల హద్దులను ఖచ్చితత్వంతో నిర్ధారించాలని కలెక్టర్ సూచించారు. వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సర్వే పురోగతిని కలెక్టర్ వివరించారు.మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమికి గాను, ఇప్పటికే 6,379 ఎకరాల సర్వే పూర్తయింది. మొత్తం 4,652 ఇళ్లకు సర్వే ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు.మొత్తం 158 బ్లాకులకు గాను 102 బ్లాకుల లో పనులు ముగిశాయని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.
భూ వివాదాల పరిష్కారానికి, స్పష్టమైన యాజమాన్య హక్కుల కల్పనకు ఈ సర్వే ఎంతో కీలకమని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో గ్యాస్ పెట్రోల్ డీజిల్ సమృద్ధిగా నిల్వలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
**జయశంకర్ భూపాలపల్లి మార్చి 28(వుదయం జిల్లా ప్రతినిధి):**



జిల్లాలో గ్యాస్, పెట్రోల్ మరియు డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.శనివారం ఐడిఓసి కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఎస్పి సంకీర్త్ తో కలిసి జిల్లా ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ పై పటిష్ట పర్యవేక్షణ కొనసాగాలని ఆదేశించారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లు వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం లక్షా 20 వేల మంది గ్యాస్ వినియోగిస్తున్నారని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, ఆసుపత్రులకు యధావిధిగా గ్యాస్ సరఫరా జరుగుతుందని, ఆయా శాఖల అధికారులు. పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ అత్యవసర సేవలకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలాల్లో డిటీలు, ఎస్ ఐ.లు పర్యవేక్షణ చేస్తున్నారని, వాహనాలు తనిఖీ చేసి కేసులు నమోదు చేయాలని ఆర్టిఓ కు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల బుకింగ్ సైకిల్ అమలులో ఉందని, బుకింగ్ క్రమం ప్రకారమే సిలిండర్ సరఫరా జరుగుతోందని తెలిపారు. సిలిండర్ డెలివరీ సమయంలో ఓటిపి విధానం తప్పని సరిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల అమాంతం బుకింగ్‌లు పెరగడం వల్ల డిమాండ్ అధికమవుతోందని గుర్తించిన కమిటీ, ప్రజలు అవసరానికి మించి బుకింగ్ చేయకుండా, నిల్వలు చేయకుండా ఉండాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలో ఎల్పీజీ వినియోగంపై వెల్ఫేర్ అధికారి, డీఈఓ పర్యవేక్షణ చేయాలని, వార్డెన్లు, హెడ్‌మాస్టర్లు సరైన వినియోగం చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా కొరత ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు.జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. బ్లాక్ మార్కెటింగ్, అనధికార రీఫిల్లింగ్ సెంటర్లు, అక్రమ నిల్వలు మరియు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్, పెట్రోల్, డిజిల్ నిల్వలను ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, పోలీస్ శాఖతో కట్టుదిట్టమైన అమలు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగించడం, మళ్లింపు, నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి మొత్తం 19 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. హోటళ్లు, ధాబాలలో అక్రమంగా వినియోగిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకుని, సంబంధితులపై నిత్యావసర వస్తువులు చట్టం 1955 సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేశామన్నారు.కమిటీ కఠినంగా వ్యవహరించాలని నిరంతర తనిఖీలు, అప్రమత్తత ప ద్వారా అక్రమాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. అధికారులు పారదర్శక సరఫరా, సమర్థవంతమైన పర్యవేక్షణ సమయానుకూల నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.ఎస్పి సంకీర్త్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ డీలర్లు తో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలు నమ్మి ఆందోళన చెందొద్దని సూచించారు. జిల్లాలో సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. అసత్య ప్రచారాలపై పర్యవేక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటిరద్దీ లేకుండా పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడోన్లు వద్ద పటిష్ట నిఘా.కొనసాగుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ డీఈఓ రాజేందర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, సంక్షేమ శాఖల అధికారులు, హెచ్పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ అమర్త్యదాస్ లు పాల్గొన్నారు.

## బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

**రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ ధ్వజం**
**హనుమకొండ, మార్చి 28 (వుదయం ప్రతినిధి):**



దేశంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. శనివారం రోజున హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలపై ఉన్న నేరారోపణలు, మహిళా భద్రతపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఆమె ఎండగట్టారు.
బీజేపీకి చెందిన సుమారు 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై అత్యాచార, లైంగిక వేధింపుల కేసులు ఉన్నాయని, వారికి ఆ పార్టీ రాజకీయ రక్షణ కల్పిస్తోందని విమర్శించారు. ఒకవైపు ప్రధాని మోదీ 'బేటీ బచావోబేటీ పడావో' అంటూ ప్రసంగాలు చేస్తూ, మరోవైపు మహిళలపై జరుగుతున్న దాష్టీకాలపై మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. వారణాసి వంటి నియోజకవర్గాల్లోనే మహిళలపై వేల సంఖ్యలో నేరాలు నమోదు కావడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ సీనియర్ నేత సుబ్రమణియన్ స్వామి మహిళా ప్రజాప్రతినిధులపై చేసిన వ్యాఖ్యలు అత్యంత తీవ్రమైనవని, వాటిపై ఇప్పటివరకు విచారణ జరపకపోవడం విచారకరమని అన్నారు. ఉన్నావ్, బిల్కిస్ బానో, అంకితా భండారీ కేసుల నుండి ప్రజ్వల్ రేవణ్ణా వ్యవహారం వరకు అన్నింటా బీజేపీ దోషులను వెనుకేసుకొస్తోందని ధ్వజమెత్తారు. నిందితులకు పెరోల్ ఇవ్వడం, క్షమాభిక్ష పెట్టడం వంటి చర్యలు మహిళా లోకాన్నిఅవమానించడమేనని అన్నారు.

**దేశవ్యాప్త నిరసనలకు పిలుపు**

మహిళా కాంగ్రెస్ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అన్ని జిల్లాల్లో ప్రెస్ మీట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, నాయకులు బంక సరళ, సునావత్ రాధా, మండల, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి



**– కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**
**హనుమకొండ, మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం రోజున కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లతో కలిసి భూసేకరణ, భూభారతి, మీసేవా దరఖాస్తుల పురోగతిని ఆమె సమీక్షించారు.
భూసేకరణలో సాధించిన పురోగతిపై వచ్చే శనివారం నాటికి పూర్తి నివేదిక సమర్పించాలి.
కాల్వల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం సోమవారం నుంచే పెగ్ మార్కింగ్ పనులు ప్రారంభించాలి.
మురుగునీటి శుద్ధి కేంద్రాలు నగర పరిధిలో ఎస్టీపీల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి సేకరించాలి. భూభారతి, సాదా బైనామా ఫైళ్లతో పాటు మీసేవా ద్వారా వచ్చే సర్టిఫికెట్ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలి.
ఆర్వోఆర్ (RoR) సీనియర్ సిటిజన్ కేసులను ప్రతి వారం పర్యవేక్షించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవోలను ఆదేశించారు.
ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్వో సత్యపాల్ రెడ్డి, ఆర్డీవోలు రమేష్, నారాయణ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నుల చెల్లింపులపై దృష్టి పెట్టాలి



**– జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కాశీ బుగ్గ ఈ-సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ**
**వరంగల్ టౌన్, మార్చి 28 (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు.
శనివారం రోజున వరంగల్ పరిధిలోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణలో గల ఈసేవా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈసేవా కేంద్రం లో ఆకస్మికంగా సందర్శించి పన్నుల సేకరణ తీరును, ప్రభుత్వ ఆస్తుల బిల్లుల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకొని మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధిలోని బకాయిలు పడి ఉన్న రైల్వే, పోస్టాఫీసులు, కేఎంసి తదితర ప్రభుత్వ కార్యాలయాల కు నోటీసులు అందజేసి వెంటనే పన్నులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి రెవెన్యు అధికారులు రావుల ఆనంద్, శ్రీనివాస్, ఆర్ ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం



**రామనామ స్మరణలతో మార్మోగిన మిథిలా ప్రాంగణం**
**ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి మార్ట్ ప్రారంభం**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 28 (వుదయం ప్రతినిధి):**

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మిథిలా ప్రాంగణంలో శనివారం అత్యంత వైభవంగా జరిగిన ఈ మహోత్సవంలో దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల మహోత్సవానికి హాజరై స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఆశీస్సులు పొందారు. మహోత్సవాన్ని ఆద్యంతం తిలకిస్తూ భక్తి పరవశంలో పాల్గొన్నారు.
పట్టాభిషేక వేడుకలు సంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. తొలుత రామాలయంలో భద్రుని మండపంలో స్వామివారి పాదుకలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం గౌతమీ నదీ తీరంనుంచి పవిత్ర తీర్థములను తీసుకువచ్చి రాజ లాంఛనాలతో మిథిలా ప్రాంగణానికి ఊరేగింపుగా స్వామివారిని తీసుకు వచ్చారు. పట్టాభిషేక వేడుకల సందర్భంగా మిథిలా ప్రాంగణం మొత్తం శ్రీరామ నామ స్మరణలతో మార్మోగింది. కార్యక్రమం అనంతరం భక్తులపై పుణ్య నదీ జలాలను చల్లి ఆశీర్వదించారు.ఈ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఐటీడీఏ పీఓ రాహుల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి రామభక్తుల చిరకాల వాంఛ అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సుమారు రూ.350 కోట్ల వ్యయంతో ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ఐటీడీఏ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గిరి మార్ట్‌ను గవర్నర్ సతీసమేతంగా ప్రారంభించారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధి, వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం లక్ష్యంగా ఈ గిరి మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. అడవి ఉత్పత్తులు, సేంద్రీయ ఆహార పదార్థాలు, గిరిజన హస్తకళా వస్తువులను ఒకే వేదికపై విక్రయానికి అందుబాటులో ఉంచడం ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.గిరి మార్ట్ ప్రారంభానంతరం అక్కడ అమ్మకానికి ఉంచిన గిరిజన ఉత్పత్తులను గవర్నర్ సతీసమేతంగా పరిశీలించి, వాటి ప్రత్యేకతలు, తయారీ విధానం, మార్కెటింగ్ సదుపాయాల గురించి జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.
గవర్నర్ పర్యటనను దృష్టిలో ఉంచుకొని పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించారు. మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో కృషి చేసింది

# విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

## - మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష



**ఉదయం ప్రతినిధి, ఆదిలాబాద్:** పట్టణ పరిశుభ్రతతో పాటు త్రాగు నీటీని సరఫరా చేయడములో పారిశుద్ధ, వాటర్ సప్లై కార్మికుల పాత్ర కీలకమని, విధుల పట్ల నిర్లక్ష్యం తగదని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. శనివారం ఉదయం 5 గంటలకు స్వయంగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సానిటేషన్ వర్కర్ల హాజరు పట్టికను పరిశీలించారు. దీంతోపాటే వాటర్ సెక్షన్ లో కూడా హాజరు పట్టికను పరిశీలించి రోజువారిగా విధులకు హాజరు కావాలని సూచించారు. ఎంతమంది విధుల్లో ఉన్నారు.. ఎంతమంది సెలవుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనుష సతీష్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సానిటేషన్ కార్మికుల పాత్ర ఎంతో ఉందన్నారు. వీరితో పాటే వాటర్ సప్లై సిబ్బందిది కూడా అంతే పాత్ర ఉంటుందన్నారు. ఈ కార్మికుల కోసం ప్రతి నెల వేతనాల రూపంలో 78 లక్షల రూపాయలను చెల్లించడం జరుగుతుందన్నారు. అయితే కొందరు మట్టుకు కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు తన పరిశీలనలో తెలిసిందన్నారు. గతంలో ఎవరు పట్టించుకోని కారణంగా కొందరు ఇష్టారితిన కార్మికులు విధులకు హాజరయ్యేవారన్నారు. ఇకనుండి అలా జరగకుండా చూసుకోవలాని హెచ్చరించారు. అవసరం లేని వారిని వేరే వాటికి సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు నీటిని వృధా చేయకుండా మితంగా వాడుకోవాలని, ఎంత నీరు అవసరమో అంతే పట్టుకున్నట్లయితే వెరే వారికి నీరు అందే అవకాశం ఉంటుందని అన్నారు. నీటి వృథాను నివారించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.నీటి సరఫరా సక్రమంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా శాలరీలు , పిఎఫ్ డబ్బులను వెంటవెంటనే వారి వారి అకౌంట్లో జమ చేయాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ కార్మికులకు సంబంధించిన సబ్బులు , డిటర్జెంట్లు , నూనెలు, గ్లౌజులు , ఆప్రాన్లను అతి త్వరలో కౌన్సిల్ తీర్మానం తీసుకొని అందించాలని, అధికారులు, కార్మికులకు ఎక్కడ సమస్య ఉన్న నేరుగా సంప్రదించాలని, తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని అన్నారు.

## సకాలంలో రోడ్డు నిర్మాణ..

# పనులు పూర్తి చేయాలి

### ఆర్&బీ శాఖ అభివృద్ధి పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమావేశం

**పెద్దపల్లి, (ఉదయం ప్రతినిధి)** ఆర్&బీ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆర్&బీ శాఖ అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి కాటారం పరిధిలో జరుగుతున్న రొడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. లింగాపూర్ రొడ్డు సంబంధించి విస్తరణ పనులు, మీడియన్, పైప లైన్ పనులు చేయాలని అన్నారు. రొడ్డు విస్తరణ పనులు సంబంధించి విద్యుత్ పోల్స్ తరలింపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి లో నిర్మించిన ఆర్&బీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశామని, సంబంధిత వివరాలను ఎంబీ రికార్డులలో నమోదు చేసి బిల్లులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. మానేరు నది పై చేపట్టిన బ్రిడ్జి టెండర్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రోడ్లు నిర్మించే సమయంలో త్రాగు నీటి పైప్ లైన్ పనులకు డ్యామేజి జరుగకుండా చూడాలని అన్నారు. మంథని గెస్ట్ హౌస్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. కునారం ఆర్ఓబి సంబంధించి అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూ సేకరణ పూర్తి చేశామని, అక్కడ ఇండ్ల, ఇతర నిర్మాణాల కూల్చివేత పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని స్టేడియం నిర్మాణానికి సంబంధించి అవసరమైన అనుమతులు త్వరగా సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్ అండ్ బీ భావ్ సింగ్, డీఈలు, ఏఈలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు



# 7న రాజన్న కోడెలు పంపిణీ

## కలెక్టర్ గరీమా అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల జిల్లా, (ఉదయం ప్రతినిధి)** వచ్చే నెల (ఏప్రిల్)7వ తేదీన వేములవాడ పరిధి తిప్పాపూర్ లోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని మధ్యస్థం నుంచి పెద్దగా ఉన్న 300 కోడెలు మంగళవారం ఉదయం 07.00 గంటలకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్న కారు రైతులు అర్హులని, వారు వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, తమ సమీప మండల వ్యవసాయ అధికారి/ ఏఈఓ నుంచి ధ్రువపత్రం, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారుఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో వచ్చే నెల (ఏప్రిల్ ) 7వ తేదీన మంగళవారం ఉదయం 07.00 గంటలకు వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు కోడెల కోసం రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ సక్రమంగా చూసుకోవాలని సూచించారు. పక్కదారి పట్టినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అగ్రవాల్ హెచ్చరించారు.







## పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, (ఉదయం ప్రతినిధి):** మద్నూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష వ్రాస్తున్న విద్యార్థుల హాజరు శాతం, సౌకర్యాల పై విద్యా శాఖ అధికారి రాజు ను అడిగి తెలుసుకొని, పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య , భద్రత దృష్ట్యా వైద్య సిబ్బంది, అవసరమైన మెడిషన్ ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ధర్మపురిలో 108 అంబులెన్స్ తనిఖీ

## సేవల నాణ్యతపై ఆకస్మిక సమీక్ష - ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్

**ధర్మపురి, (ఉదయం ప్రతినిధి):** మండల కేంద్రంలోని 108 అంబు లెన్స్ సేవల తీరుతెన్నులను శని వారం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ భూమా.నాగేందర్,జగిత్యాల జిల్లా మేనేజర్ అశోదా. ఐలయ్య కలిసి అంబులెన్స్‌ను సందర్శించి, అందులోని వైద్య పరికరాల పని తీరును స్వయం గా పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా అంబులెన్స్‌లో ఉన్న అత్యవసర వైద్య పరికరాలు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని అధికా రులు పరీక్షించారు. అనంతరం నిర్వహ ణ రికార్డులను సమీక్షించి,రోగు లకు అందుతున్న సేవల నాణ్య తపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగాప్రోగ్రాం మేనేజర్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రజలకు ఏమాత్రం జాప్యం లేకుండా,అత్యంత వేగంగా, సమర్థవంతంగా వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ప్రతి నిమిషం విలువైనదని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది ఈఎంటీ అనీల్,పైలట్ ఖయుమ్, పాల్గొన్నారు



# వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి



**కరీంనగర్ (ఉద యం ప్రతినిధి):** వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేసేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతిలో శనివారం రోజు రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, సానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది, వార్డు అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. 202526 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో వంద శాతం ఆస్తి పన్నుల వసూలు, మొండి బకాయి ధారులపై చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు, కమర్షియల్ ప్రాపర్టీలు, కమర్షియల్ రెసిడెన్షియల్ రెండు కలిసి ఉన్న ప్రాపర్టీలు, రివిజన్ పిటిషన్లు, డబుల్ నెంబర్స్ ప్రాపర్టీలు, ఆర్ ఆర్ ఆక్ట్ తదితర అంశాలపై అధికారులు సిబ్బందితో కమీషనర్ సుదీర్ఘంగా చర్చించారు. అధికారులు, వార్డు ఆఫీసర్ల వారిగా కలెక్షన్ వివరాలతో పాటు ఫీల్డ్ లెవల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్నుల వసూలుపై పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఆస్తి పన్ను వసూళ్ళలో అధికారులు, సిబ్బంది, వారెంట్ ఆఫీసర్లు, వార్డు ఆఫీసర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిణ చర్యలు తప్పవన్నారు. విధి నిర్వహణ సక్రమంగా లేని అధికారులకు షోకాజు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిగిలిన మూడు రోజుల గడువు ప్రతి రోజు దాదాపు రెండున్నర కోట్ల టార్గెట్ గా ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. టాప్ 200 మొండి బకాయి దారులతో పాటు కమర్షియల్, మిక్సుడ్, డబుల్ నెంబర్ ప్రాపర్టీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వార్డు ఆఫీసర్లకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం కనీసం 95 శాతంకు తగ్గకుండా టార్గెన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా ప్రభుత్వ ప్రాపర్టీల పన్నుల పై కూడ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉదయం 6 నుండి రాత్రి వరకు ప్రతి అసెస్మెంట్ ను విజిట్ చేసి పన్నులు కట్టించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొండి బకాయి దారులు పన్నులు చెల్లించకుంటే చట్ట ప్రకారం ప్రాపర్టీలను సీజ్ చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా ప్రాపర్టి టాక్స్ చెల్లించని వారి నల్లా కనెక్షన్లు, పవర్ కనెక్షన్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డబుల్ ఇంటి నెంబర్లు ఉన్న ప్రాపర్టీలకు సంబంధించి పాత ఇంటి నెంబర్ ఆస్తి పన్ను తో పాటు నూతనంగా ఇచ్చిన నెంబర్ పన్నులు కూడ కట్టించాలన్నారు. ఆర్ ఆర్ ఆక్టును తప్పక అమలు చేయాలన్నారు. రెడ్ నోటీసుల గడువు ముగిన బకాయి దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గడువు లోగా డిమాండ్ ప్రకారం పన్ను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీలు ఖాధర్ మోహియుద్దీన్, వేణు మాధవ్, అధికారులు పాల్గొన్నారు.

# కుక్క అడ్డు రావడంతో భార్యాభర్తలకు గాయాలు

**శంకరపట్నం : ఉదయం ప్రతినిధి** శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన శనిగరపు సంపత్ 38 మరియు అతని భార్య మౌనికతో కలిసి ఉదయం గద్దపాక నుండి చిగురుమామిడి వాళ్ల మేనత్త దహన సంస్కారాలకు వెళ్లి తిరిగి వస్తుండగా చిగురుమామిడి నుండి గద్దపాక కు వస్తుండగా మార్గమధ్యలో కేశపట్నం ఒక్కసారిగా సంపత్ మౌనికలు మోటార్ సైకిల్ మీద నుండి కింద పడ్డారు. 108 కి ఫోన్ చేయడంతో 108 సిబ్బంది ఈఎంటి గూడూరు సతీష్ రెడ్డి పైలెట్ ఎం గోపికృష్ణ అంబులెన్స్ లోనికి తీసుకొని ప్రథమ చికిత్స అందిస్తూ హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది



# మున్సిపల్ బడ్జెట్ రూ.25 కోట్ల 74 లక్షల 89 వేలు




**లక్షెట్టిపేట్, (ఉదయం ప్రతినిధి):** మున్సిపాలిటీ 202627 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం బడ్జెట్ రూ. 25 కోట్ల 74 లక్షల 89 వేలుగా శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) చంద్రయ్య, చైర్ పర్సన్ దొంత అంజలి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ మొత్తం రెవెన్యూ ఆదాయం రూ. 3 కోట్ల 42 లక్షల 63 వేలు కాగా, వీటిలో సిబ్బంది జీతాల కోసం రూ. కోటి 70 లక్షలు, పారిశుద్ధ్య నిర్వహణ రూ. 51 లక్షల 98 వేలు, కరెంటు చార్జీలు రూ. 6 లక్షలు, రుణాల చెల్లింపులు రూ. 20 లక్షలు, గ్రీన్ బడ్జెట్ రూ. 33లక్షల 60 వేలు, ఇంజినీరింగ్ నిర్వహణ రూ. 17 లక్షలు, పరిపాలన రూ. 42.55 లక్షలు, టౌన్ ప్లానింగ్ రూ. 1 లక్ష 50 వేలు, డిపాజిట్స్, అడ్వాన్స్ లు రూ.9 లక్షలుగా ఆమోదించారు. కాగా, రూ. 21 కోట్ల 42 లక్షల 26 వేలను పలు రకాల గ్రాంట్ ఆదాయంగా అంచనా వేశారు. మొత్తం రూ. 25 కోట్ల 80 లక్షల 84 వేలు గా మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ కు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) చంద్రయ్య మాట్లాడుతూ ఈ అంచనా బడ్జెట్ ను సభ్యులు సక్రమంగా అర్థం చేసుకోవాలని, అదే విధంగా ప్రతి కౌన్సిలర్ తమ వార్డ్ లలో ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మున్సిపాలిటీ ఆదాయంను పెంచే మార్గాలను పాటించాలన్నారు. చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య వైస్ చైర్ పర్సన్ మోతుకూరి రాజేశ్వరివెంకటస్వామి గౌడ్,మున్సిపల్ కమీషనర్ విజయ్ కుమార్, కౌన్సిలర్లు, మేనేజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రిని కలిసిన సముద్రాల శ్రీనివాస్



**కరీంనగర్ (ఉదయం ప్రతినిధి);** తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మొదటిసారి కలిసి శ్రీరామ నవమి సందర్భంగా పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం రోజున మీడియాకు పత్రిక ప్రకటన విడుదల చేశారు.ఎంఎస్ ఆర్థోపెడిక్ సర్జన్ గా సిద్ధిపేట జిల్లా కేంద్రంలో ప్రజలకు వైద్య సేవలుఅందిస్తున్నట్లు డాక్టర్ సముద్రాల శ్రీనివాస్ తెలిపారు. బీజేపీ నాయకులు మేయర్ కొలకాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాం కిరణ్ లతో కలిసి మహాశక్తి ఆలయం లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో , పూజా కార్యక్రమాల్లో పాల్గొని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసినట్లు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని కేంద్ర మంత్రితో పేర్కొన్నట్లు తెలిపారు.మొగిలిపాలెం బీజేపీ నాయకులు ఎర్రోజు లక్ష్మణ్ శ్రీనివాస్ వెంట ఉన్నారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

### రూ.5 లక్షల్లోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం
### కేవలం మూడు నెలల్లోనే పనులన్నీ పూర్తి
### ఫిల్లర్ రూఫింగ్ విధానంలో స్లాబ్ నిర్మాణం



**రాజన్న సిరిసిల్ల, ఉదయం ప్రతినిధి** ఇల్లు లేని వారి సొంత ఇంటి కల నిజం చేయాలని లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం జిల్లాలో విజయవంతంగా అమలవుతుంది. మోడల్ హౌస్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించింది. 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలతో ఇల్లు పూర్తవుతుందని స్పష్టం చేసింది గృహ నిర్మాణ శాఖ. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతోనే నూతన సాంకేతికత, అద్భుతమైన డిజైన్ లో స్లాబ్ తో ఇందిరమ్మ ఇల్లు పక్కాగా నిర్మించింది. ప్రజా ప్రభుత్వం అర్హులైన వారి సొంతింటి కల నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టింది. నిర్దేశించిన 400 నుంచి 600 చదరపు ఫీట్ల వరకు నిర్మించుకోవచ్చని, వారికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో నిర్మాణానికి అనుగుణంగా నేరుగా లబ్ధిదారు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేలా ఏర్పాట్లు చేసింది. పేదలకు 400 చదరపు ఫీట్లలో రూపాయలు ఐదు లక్షలు ఇల్లు నిర్మించుకునేలా స్పష్టమైన కార్యాచరణ అవగాహన కల్పించాలని ఉద్దేశంతో గృహ నిర్మాణ శాఖ మోడల్ నిర్మాణాలను జిల్లాలో చేపట్టింది.

**జిల్లాలో 11 నిర్మాణాలు పూర్తి..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాల్లో మొత్తం 11 మోడల్ ఇందిరమ్మ మోడల్ ఇండ్లను 400 చదరపు ఫీట్లలో ఒక ప్రణాళిక ప్రకారం కేవలం మూడు నెలల కాలంలోనే రూ. ఐదు లక్షలతో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

**ఇబ్బందులు దూరం చేసేందుకు కమిటీల సేవలు**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో మోడల్ హౌస్ లను నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ప్రతి మోడల్ హౌస్ లో ఒక హాల్, బెడ్ రూమ్ దానికి అటాచ్డ్ బాత్రూం, అలాగే కిచెన్ సదుపాయాలతో ఇంటిని పూర్తి చేశారు. గోడల నిర్మాణానికి సిమెంటు ఇటుకలు వినియోగించారు. కిటికీలు, దర్వాజలు చెదలు పట్టకుండా చాలా కాలం మన్నికగా ఉండేలా సిమెంటు ఫ్రేములు వినియోగించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయం అందించేందుకు ఇందిరమ్మ కమిటీలు, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు అందుబాటులో ఉన్నారు. ఇంటి నిర్మాణ సామగ్రి, ఇతర ఇబ్బందులను దూరం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**ఎండాకాలం చల్లగా.. చలికాలం వెచ్చగా ..**

ఇందిరమ్మ మోడల్ హౌస్ లు ఎండాకాలంలో చల్లగాను.. చలికాలంలో వెచ్చగా ఉండేలా సాంకేతికతను ఉపయోగించారు. స్లాబు నిర్మాణంలో ఫిల్లర్ రూఫింగ్ విధానాన్ని వినియోగించారు. ఇందులో సాధారణ ఇళ్లతో పోలిస్తే స్లాబ్ నిర్మాణంలో 40 శాతం ఖర్చు ఆదా అవుతుంది. కాంక్రీట్, ఐరన్ తక్కువగా ఉపయోగిస్తారు. స్లాబ్ చూడడానికి కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది.

**దీర్ఘకాలం పాటు మన్నికగా ఉండేలా..**

గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 లక్షలలోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. నాణ్యతలో కూడా ఇలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పూర్తి చేశారు. దీర్ఘకాలం పాటు నిలిచి ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఆర్థిక సహాయం లోనే ఇంటి నిర్మాణాన్ని చేశారు.

**ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ..**

జిల్లాలోని అర్హులైన వారు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఐదు లక్షలతోనే పూర్తిచేసేలా ప్రతి మండల కేంద్రం అలాగే మున్సిపాలిటీలో హౌసింగ్ అధికారులు పూర్తిస్థాయి సహకారం అందిస్తారు. సూచనలు పాటిస్తూ ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకునే అవకాశం ఉంది.

## జాతీయ లోక్ అదాలత్ ను

# ప్రారంభించిన జిల్లా న్యాయమూర్తి







**కామారెడ్డి, ఉదయం ప్రతినిధి ):** కామారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా న్యాయమూర్తి డా.వరప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో ఏర్పడిన వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక ఉత్తమ వేదిక అని తెలిపారు. అనవసర వివాదాలకు దూరంగా ఉండి, పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాల సమ్మతితో త్వరితగతిన పరిష్కారం పొందేందుకు లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుటుంబ, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో పరస్పర సమ్మతితో రాజీ కుదుర్చుకోవచ్చని చెప్పారు. అలాగే, సైబర్ నేరాల విషయంలో రూ.25,000 లోపు నష్టం జరిగిన సందర్భాల్లో, కోర్టు అనుమతితో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే రీఫండ్ ప్రక్రియ పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి అధికారులు నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రాజీ పడదగిన కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. వేగవంతమైన న్యాయ పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. న్యాయమూర్తులు, కామారెడ్డి అదనపు కలెక్టర్ విక్టర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు, కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మానేరు రివర్ ఫ్రంట్ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కరీంనగర్(ఉదయం ప్రతినిధి );** కరీంనగర్ ఎల్.ఎం.డి రిజర్వాయర్ దిగువన నిర్మాణంలో ఉన్న మానేరు రివర్ ఫ్రంట్ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పరిశీలించారు.మున్సిపల్, రెవిన్యూ, నీటిపారుదల శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి రివర్ ఫ్రంట్ బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణ అంచనా వ్యయం, పూర్తిచేసిన పనుల వివరాలు, చేయవలసిన నిర్మాణాలు తదితర అంశాలను అధికారులు వివరించారు. రివర్ ఫ్రంట్ నిర్మాణంలో భాగంగా టూరిజం అభివృద్ధి నమూనా, పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఏయే నిర్మాణాలు ఎంత విస్తీర్ణంలో ఎక్కడ చేపడుతున్నారని విషయాలను గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. నది లోతు, ఇరువైపులా కట్ట నిర్మాణం ఎత్తు, ప్రైవేటు, ప్రభుత్వ భూమి సేకరణ వంటి వివరాలను అడిగారు. పలు అభివృద్ధి పనుల గురించి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలెక్టర్ కు వివరించారు. మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, నీటిపారుదల శాఖ ఎస్ ఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## గర్భిణులు, శిశువుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు
- స్కానింగ్ సెంటర్ల పై నిఘా ఉంచి సమాచారం అందించండి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్






నాగర్ కర్నూల్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)

జిల్లాలో గర్భిణీల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్య శాఖ అధికారులకు, ఏఎన్ఎంలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గర్భధారణ సమయంలో మహిళలు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా, ప్రతి నెల నిర్వహించే గర్భిణీలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఏఎన్ఎంలకు సూచించారు. శనివారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ (లింగ ఎంపిక నిషేధం) చట్టం 1994 & నిబంధనలు 1996 పైన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పీహెచ్ సీల ఏఎన్ఎమ్ లకు ఒకరోజు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గర్భిణీ స్త్రీకి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా హై రిస్క్ గర్భిణీ లను ముందుగానే గుర్తించి, వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. హై రిస్క్ ఉన్న గర్భిణీలకు అవసరమైన ల్యాబొరేటరీ పరీక్షలు, మందులు, పోషకాహార సూచనలు అందించి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించడంలో ముందస్తు జాగ్రత్తలే అత్యంత కీలకమైందని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు గర్భిణీలతో నిరంతరం సంబంధం కొనసాగించాలని, వారిని సమయానికి ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి గర్భిణీ స్త్రీకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య శాఖ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. అదేవిధంగా గర్భిణీ స్త్రీలు ప్రతినెల గర్భస్థ ఆరోగ్య పరీక్షలకు హాజరవుతున్నారా లేరా అని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 1వ 2వ 3వ గర్భస్థ పరీక్షల తర్వాత , నెల వారీ ఆరోగ్య పరీక్షలకు హాజరుకాకుంటే అందుకు గల కారణాలను తెలుసుకోవాలని, ఏదైనా అబార్షన్ జరిగిందా అనే వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని ఏదైనా స్కానింగ్ సెంటర్లో అబార్షన్లు లింగస్థ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఏఎన్ఎమ్లకు సూచించారు.

జిల్లాలో బాలికల శాతం గణనీయంగా తగ్గిందని,1000 మంది బాలురకు 894 మంది బాలికలు ఉన్నారని, ఈ నిష్పత్తి ఇలాగే కొనసాగితే జిల్లాకు చాలా నష్టం వాటిల్లుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్లు తో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు అబార్షన్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్ , డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ తారా సింగ్, భీమ్లా నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 2న గ్రామ సభలను విజయవంతం చేయాలి

జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అమరేందర్ తో కలిసి జిల్లా అధికారులతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 2న జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డుల్లో సభలు విధిగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేసవి దృష్టిలో ఉంచుకొని గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు సదుపాయాలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. వేసవి దృష్ట్యా, సభలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాలని మరియు ప్రజలకు సౌకర్యం కల్పించే విధంగా షామియానాలు ఏర్పాటు చేయమని డిపిఓ శ్రీరాములు ను ఆదేశించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన నివేదికను అందజేయాలని తెలిపారు.

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుంచి వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలియజేశారు. అందువల్ల, గ్రామ, మండల మరియు నియోజకవర్గ స్థాయిలో సభలను విజయవంతంగా అమలు చేయడం, ప్రణాళికల ప్రకారం ప్రతి కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో డిపిఓ శ్రీరాములు, డిఆర్డిఎ పిడి చిన్న ఓబులేష్, డీఈఓ రమేష్ కుమార్, డిటిఓ చిన్న బాలు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశ్వర్లు, నాగర్ కర్నూల్ డి.ఎస్.పి శ్రీనివాసులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్య సేకరణలో లక్ష్యాలను అధిగమించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి



**వికారాబాద్: వుదయం ప్రతినిధి** శనివారం కలెక్టరేటులోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం సేకరణకై సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ... రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్య సేకరణకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రబీ 2025-26 వరి ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలోని 129 వరి ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అధికారులు సమన్వయంతో పనిచేసి వరి ధాన్య సేకరణ సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. వివిధ ఏజెన్సీల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి ధాన్యం, పదివేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని సేకరించే దిశగా అధికారులు పనిచేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, జిల్లా అదనపు జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి, డి సి ఎం ఎస్ బిజినెస్ మేనేజర్ వెంకట రమణారెడ్డి, డిప్యూటీ డిఆర్డిఏ నరసింహులు, రవాణా కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, వుదయం ప్రతినిధి:** పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. శనివారం పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ జిల్లా కేంద్రం లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా పర్యటించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం చీఫ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డ్యూటీ రిజిస్టర్, ప్రశ్నపత్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం అదేవిధంగా మెడికల్ సిబ్బంది గురించి ఆరా తీసి అక్కడ ఉన్న మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీటి సదుపాయంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, చీఫ్ సూపరింటెండెంట్ రాజులు ఉన్నారు.

## దివ్యాంగులకు పారదర్శకంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలి




**వనపర్తి మార్చ్ 28 (ఉదయం ప్రతినిధి)** యూడిఐడి(యూనిక్ డిజేబుల్ ఐడి ) నిబంధనల ప్రకారం దివ్యాంగులకు పారదర్శకంగా డిజేబుల్ ఐడి లను జారీ చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ సూచించారు. శనివారం సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఆదనపు కలెక్టర్లు, డిఆర్డిఓ లతో యూనిక్ డిసేబుల్ ఐడీలు జారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్కు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుండి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్, డి ఆర్ డి ఓ ఉమాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ అధికారులకు పలు సూచనలు చేశారు. యూడిఐడి నిబంధనల ప్రకారం పారదర్శకంగా సర్టిఫికెట్లు జారీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు సర్టిఫికెట్లు జారీ అవ్వడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అర్హులైన వికలాంగులకే కార్డులు అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే, క్యాంప్లకు వచ్చే వికలాంగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల్లో ఎలాంటి పెండింగ్ లేకుండా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీసీ అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యూడిఐడి(యూనిక్ డిజేబుల్ ఐడి ) నిబంధనల ప్రకారం దివ్యాంగులకు పారదర్శకంగా డిజేబుల్ ఐడి సర్టిఫికెట్లు జారీ చేయాలని డి ఆర్ డి ఓ కు సూచించారు. యు డి ఐ డి లకు సంబంధించి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలికిన కలెక్టర్



**మహబూబ్ నగర్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)** జిల్లా కేంద్రం లో జిల్లా కోర్ట్ ఆవరణలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం లో పాల్గొనే నిమిత్తం మహబూబ్ నగర్ కు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద పుష్ప గుచ్ఛం, మొక్క అంద చేసి ఘన స్వాగతం పలికారు.ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద హై కోర్ట్ న్యాయమూర్తులు పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## అంగన్వాడీ కేంద్రాల్లో సంపూర్ణమైన పౌష్టికాహారం



**వుదయం న్యూస్ కొండపాక ప్రతినిధి మార్చి 28** అంగన్వాడి కేంద్రంల్లో మంచి సంపూర్ణమైన పౌష్టికాహారం లభిస్తుందని సిఆర్పి సునీత అన్నారు. మండల పరిధిలోని బందారం గ్రామంలో రెండు, మూడవ అంగన్వాడి కేంద్రాలలో శనివారం ఈసీసీ డే, అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలకు ప్రభుత్వం నుండి పుష్కలమైనటువంటి పోషకాహారలతో కూడిన ఆహారం లభిస్తుందని ఆమె గర్భిణీలకు బాలింతరకు సూచించారు 3 నుండి 5 సంవత్సరాల పిల్లల తల్లులు అంగన్వాడి కేంద్రాలలో అందించే పౌష్టికాహారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బంధారం తో పాటు కొండపాక మండల కేంద్రంలో 1,2,3,4, అంగన్వాడి కేంద్రాల్లో బాలమేల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు వారి పిల్లల యొక్క సృజనాత్మకతను బయటకు తీయడానికి అంగన్వాడి కేంద్రాలు ఎంతగా ఉపయోగపడుతుందని గ్రామ సర్పంచ్ మంచాల నవీన్ శ్రీనివాస్ అన్నారు రిలియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే బాలమేల కార్యక్రమాన్ని.నిర్వహించడంతో పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీయడానికి ఎంతగానో దోహద పడుతుంద ని వార న్నారు. అంగన్వాడి కేంద్రాల లో లభిస్తున్నటువంటి పోషకాలను ప్రతి గర్భవతులు ,తల్లులు, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాలు పిల్లలకు ఆటలతో పాటు కథలు, పాటలు, నృత్యాలు వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడంతో అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో బలోపేతం అవుతాయని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఐసిడి ఎస్ సిడిపిఓ. రమాదేవి, సూపర్వైజర్ ఇందిర, సిఆర్పి సుచిత,అంగన్వాడి టీచర్లు పి రజిత, సిహెచ్ అండల్, మహాలక్ష్మి , లలిత, సరళ ,యమునా, గర్భవతులు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**నారాయణపేట మార్చి 28 (వుదయం ప్రతినిధి)** పేద ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకా లను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నా రు.శనివారం ఆయన కార్యాల యంలో నారాయ ణపేట నియోజక వర్గానికి చెందిన ప్రవీణ్ కు సి ఎం రిలీఫ్ ఫండ్ కింద 20 వేల చెక్కును అందజేశారు.నారా యణపేట పట్టణానికి చెంది న అనారోగ్యంతో బాధపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం పరంగా చెక్కు లుఅందజేశారు.ఈ సంద ర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడు తూ ప్రతి వ్యక్తి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ మాట్లాడుతూ చెక్కు అందజేసిన మంత్రి కిషన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాల్ యాదవ్, నవీన్ , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ఏడాది కిందటే జోస్యం చెప్పా.. కవిత కొత్త పార్టీ పెడతారని

### మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**సంగారెడ్డి వుదయం.** మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలంగాణ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేస్తారని తాను సంవత్సరం క్రితమే చెప్పానని తెలిపారు. అప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో మార్పుల సంకేతాలు కనిపించాయని ఆయన పేర్కొన్నారు. కల్వకుంట్ల కవిత భవిష్యత్ రాజకీయ దిశపై తన అంచనాలు ఇప్పుడు నిజమవుతున్నాయని రఘునందన్ రావు అన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత భారత్ రాష్ట్ర సమితి లో అంతర్గత విభేదాలు తీవ్రతరం అయ్యాయని, చివరికి పార్టీ నాలుగు ముక్కలుగా విడిపోయే పరిస్థితి వస్తుందని అప్పుడే జోస్యం చెప్పానని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అదే దిశగా సాగుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మరియు బీఆర్ఎస్ రెండూ ఒకటేనని ఆరోపిస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా భారతీయ జనతా పార్టీ వైపు చూడాలని, రాష్ట్ర అభివృద్ధి కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

**(కంది వుదయం)** సంగారెడ్డి జిల్లా కంది మండలం జుల్కల్ గ్రామంలో శనివారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భర్త మరణాన్ని తట్టుకోలేక ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులకు విషమిచ్చి హత్య చేసి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన మమత (28) భర్త జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఆమె తన ఏడేళ్ల కుమారుడు మణికంఠ, ఐదేళ్ల కుమార్తె ప్రళయకు విషం ఇచ్చింది. అనంతరం ఇంట్లోనే ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకుంది. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డీఎస్పీ సత్తయ్య గౌడ్ ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లక్ష్య ఛేదనకు నిరంతర సాధన చేయాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణపేట మార్చి 28 (వుదయం ప్రతినిధి)** విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఆ లక్ష్య ఛేధన కు నిరంతర సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం ఆయన మద్దూరు మండలంలోని పెదిరి పాడ్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలలోని వంట గది, మరుగు దొడ్లు, స్టాక్ రూమ్, ఆర్వో ప్లాంట్ ను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు, చదువు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థినిలు కలెక్టర్ కు తెలిపారు. ప్రతీ వారం సినిమా చూస్తున్నారా అని ఆరా తీశారు. ఇకపై ప్రతీ శనివారం విద్యార్థినులకు పాఠశాలలో మంచి సందేశాత్మక సినిమాలను చూపించాలని ఎస్. వో కు ఆయన సూచించారు.

అనంతరం అక్కడున్న వైద్యులతో మాట్లాడి పాఠశాలలో విద్యార్థినిలు ఏ ఏ రుగ్మతలతో బాధపడుతున్నారని, వారిలో ఏ ఏ ఆరోగ్య సమస్యలు గుర్తించారని అడిగి తెలుసుకున్నారు. ఎనిమియా సమస్యతో ఉన్న విద్యార్థినిలు ఎక్కువగా ఉన్నారని, అందుకు తగిన మందులను ఇస్తున్నామని,ఆహారాన్ని పెట్టిస్తున్నామని వైద్యులు కలెక్టర్ కు తెలిపారు. మొత్తానికి పాఠశాలలో అన్ని బాగున్నాయని, పాఠశాలలో మరుగు దొడ్లు శుభ్రంగా ఉన్నాయని, ఆవరణ, వంటగది, తరగతి గదులు పరిశుభ్రంగా ఉన్నాయని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

### పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దు

పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. నారాయణపేట మండలంలోని కోట కొండ జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో పరీక్షా సరళిని పరిశీలించారు. కేంద్రాల్లో కొంత మంది విద్యార్థులు వాచ్ లు ధరించి వస్తున్నారని తెలిసిందని, పరీక్షా కేంద్రాలలోకి వాచ్ లు, ఇతర ఏ ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకు వెళ్ళేందుకు అనుమతి లేదని, సీ.ఎస్. డీ.వో లు, ఇన్విజిలేటర్ల కు సైతం కేంద్రాల్లో సెల్ ఫోన్లు తీసుకు వచ్చేందుకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు కూడా పరీక్షా కేంద్రం బయటే బందోబస్తు నిర్వహించాలన్నారు.అనంతరం శనివారం నాటి పరీక్ష కు ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎం.ఈ.వో బాలాజీ, సీ.ఎస్.డీ.వో పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం




**మహబూబ్ నగర్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)** జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని వినియోగించుకుని ఇరుపక్షాలు,పరస్పర సమ్మతి,అంగీకారం తో తమ వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి పిలుపునిచ్చారు.శనివారం మహబూబ్నగర్ జిల్లా కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి.శ్రావణ్ కుమార్ లు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమం లో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి మాట్లాడుతూ లోక్ అదాలత్ రెండు పదాల కలయిక అని అంటే ప్రజల న్యాయస్థానం అని పిలువబడుతుందని తెలిపారు. మహబూబ్ నగర్ లో జాతీయ లోక్ అదాలత్ ను మార్చి 14 న నిర్వహించాల్సి ఉండేదని, కాని మార్చి 14,15 తేదీల్లో న్యాయ మూర్తుల సమావేశం కారణంగా రెండు వారాలు వాయిదా పడి గురువారం మార్చి 28 న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ వ్యవస్థ భారతదేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలలో అత్యంత సమర్థవంతమైనదిగా నిలుస్తోందని పేర్కొన్నారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న సివిల్, మోటార్ ప్రమాద క్లెయిమ్ కేసులు, బ్యాంకు రుణాలు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ వివాదాలు వంటి అనేక కేసులను లోక్ అదాలత్ ద్వారా వేగంగా పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా పక్షాల మధ్య పరస్పర అంగీకారంతో వివాదాలను ముగించవచ్చని, దీనివల్ల శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలను సులభంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు వేగవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన న్యాయం అందించడమేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయం అందుబాటులోకి తీసుకురావడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖ్యంగా చిన్నచిన్న వివాదాలు, కుటుంబ కలహాలు, రుణ సమస్యలు వంటి అంశాలను కోర్టు వెలుపలే సర్దుబాటు చేసుకోవడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు.

బలహీన,అణగారిన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు న్యాయ సేవాధికార సంస్థలు .ప్రజల్లో చట్ట అవగాహన పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత మాట్లాడుతూ జిల్లాలో లోక్ అదాలత్ ద్వారా 2033 కేసులు గుర్తించినట్లు,వీటి పరిష్కారానికి మహబూబ్ నగర్ లో 7 బెంచిలు,జడ్చర్ల లో రెండు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం లో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సి.హెచ్ పంచాక్షరి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అనంత రెడ్డి, న్యాయవాదులు, న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, పోలీసు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రాష్ట్ర హై కోర్ట్ న్యాయమూర్తులకు ఘన స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి జాతీయ లోకా అదాలత్ కార్యక్రమం లో పాల్గొనే నిమిత్తం మహబూబ్ నగర్ కు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి. సామ్ కోషి,రాష్ట్ర హై కోర్ట్ న్యాయ మూర్తి ఎన్.వి. శ్రావణ్ కుమార్ లకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎన్.ప్రేమలత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాలు ఆర్&బి అతిథి గృహం వద్ద పుష్ప గుచ్చం, మొక్క అంద చేసి ఘన స్వాగతం పలికారు అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.

## పెండింగ్ కేసులకు లోక్ అదాలత్లో పరిష్కారం

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, మార్చి 28:వు దయం.** జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల పెండింగ్ కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ వేదికగా పెండింగ్లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని వివరించారు. దీంతో కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. పెండింగ్ కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర మాట్లాడుతూ, లోక్ అదాలత్లు ప్రజలకు త్వరిత, తక్కువ వ్యయంతో న్యాయం అందించే సమర్థవంతమైన వేదికలని పేర్కొన్నారు. ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా కోర్టులపై భారం తగ్గడమే కాకుండా సామరస్య వాతావరణం నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇవ్వాలి: సీపీఎం



**నల్గొండ,మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి):** నల్లగొండ పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల లబ్ధిదారులందరికీ తక్షణమే ప్రొసీడింగ్ ఆర్డర్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఆర్డీఓ అశోక్ రెడ్డికి సీపీఎం నాయకులు మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా లబ్ధిదారులు న్యాయం కోసం పోరాడుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ప్రజల కోసం పనిచేస్తున్నామని చెప్పే ప్రభుత్వ ప్రతినిధులు పేదల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం అర్హులైన లబ్ధిదారులు కిరాయిలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు చేపట్టినా అధికారుల నుంచి స్పష్టమైన చర్యలు కనిపించలేదని అన్నారు. నవంబర్ 20న పత్రాలు అందజేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య మాట్లాడుతూ, లబ్ధిదారులందరూ నిజమైన అర్హులేనని, ఇళ్ల నిర్మాణ పనులు కూడా మధ్యలోనే ఆగిపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ప్రొసీడింగ్ ఆర్డర్లు జారీ చేసి ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, డబుల్ బెడ్‌రూమ్ పోరాట సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్, సభ్యులు గంజి రాజేష్, సిహెచ్ అనురాధ, గౌసియా బేగం, సిరాజ్, పగిళ్ల శీను, గిరిజ, ఎస్.కె లతీఫ్, విజయలక్ష్మి, జయమ్మ, గణేష్, రాధా తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం ఐక్య పోరాటాలు:సిఐటియు



**నల్గొండ,మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక హక్కుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని పలు రైస్ మిల్లులలో పరిశ్రమల కార్మికుల స్థితిగతులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్ తదితర రాష్ట్రాల నుండి వలస వచ్చిన కార్మికులు రైస్ మిల్లుల్లో హమాలీ పనులు, డ్రైవింగ్ వంటి పనులు చేస్తున్నారని తెలిపారు.వలస కార్మికుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి వారికి నివాసం, ఆహారం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వాల నుంచి రైస్ మిల్ యాజమాన్యాలకు రావాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సర్వేలోవెల్లడైందన్నారు.ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు రాజేష్, మితిలేష్, రాము, వెంకట్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే–అంబేద్కర్ జన జాతరను విజయవంతం చేయాలి



**నల్గొండ,మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి):** మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని నిర్వహించనున్న పూలే-అంబేద్కర్ జన జాతరను విజయవంతం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సమాజంలో కుల వివక్షను నిర్మూలిస్తూ సమానత్వ విలువలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ జనజాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శనివారం నల్గొండలోని ఎంవీఎన్ ట్రస్ట్ భవనంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్వకేట్ దర్శనం నరసింహ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేలపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినప్పటికీ సమాజంలో కుల వివక్ష ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు.దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించినప్పటికీ, కులం-మతం పేరుతో ప్రజలను విభజించే ధోరణులు పెరుగుతున్నాయని వారు విమర్శించారు. సామాజిక న్యాయం సాధనలో ఇంకా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు తగిన స్థాయిలో సంక్షేమ పథకాలు అందకపోవడం బాధాకరమన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు మరింత బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.మహనీయులు తమ జీవితాలను పణంగా పెట్టి సాధించిన హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇప్పటికీ సమాజంలో అణిచివేత, వివక్ష, దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో వాటిపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కుల వివక్షకు వ్యతిరేకంగా సామాజిక భద్రత, సమానత్వం కోసం పూలే-అంబేద్కర్ ఆలోచనల దిశగా సమాజం ముందుకు సాగాలని, యువత ఈ ఉద్యమంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.ఏప్రిల్ 19న నల్గొండ పట్టణంలోని టీఎన్జీవో భవనంలో జరిగే పూలే-అంబేద్కర్ జన జాతరలో పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు, కార్మికులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 1 నుండి 14 వరకు నియోజకవర్గ కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు, మండల స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారీ ఐలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అద్దంకి రవీందర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హాశం, సిఐటియు జిల్లా కార్యదర్శి మహమ్మద్ సలీం, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ప్రజానాట్యమండలి ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

### మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు



**దమ్మపేట మార్చి 28 (వుదయం ప్రతినిధి ):** :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట గ్రామంలో అంతర్జాతీయ కోఆర్డినేటర్ మరియు మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు భానుమతి దంపతుల వివాహ మహోత్సవ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తన వివాహ మహోత్సవం సందర్భంగా కార్మికులకు బట్టల పంపిణీ చేయడం జరుగుతుంది వస్తుంది అని ఆయన తెలియజేశారు అదేవిధంగా దమ్మపేట సివిల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన గొంది మురళి మోహన్ ను,దార మల్లికార్జునరావు ఘనంగా శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు,

యార్లగడ్డ బాబు, సి కె, నాగార్జున, చిన్నశెట్టి సత్యనారాయణ, పానుగంటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

## పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోండి



**చండూరు, మార్చి 28 (వుదయం):** మండలంలో కొనసాగుతున్న విద్యుత్ అంతరాయం, లో వోల్టేజ్ సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల విద్యుత్ అధికారి పల్లపు సాయి గణేష్‌తో చరవాణి ద్వారా మాట్లాడి సమస్యల తీవ్రతను వివరించారు.

అనంతరం చండూరులో రైతులతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, మండలంలోని పలు గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య తీవ్రమైందని, విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో సాగు నీటి పంపులు సరిగా పనిచేయడం లేదన్నారు. దీంతో రైతులు వేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చోట వ్యవసాయ కనెక్షన్ల వద్ద లోడ్ బ్యాలెన్సింగ్ పనులు తక్షణమే చేపట్టాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రైతులు కారింగు వెంకన్న, కన్నెగోని యాదయ్య, సురిగి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ శాంతి స్థాపనకు బౌద్ధం మార్గదర్శి

### శ్రీలంక మంత్రి హిణిడుమ సునీల్ సేన్వి



**నల్గొండ,మార్చి 28 (వుదయం జిల్లా ప్రతినిధి):** ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ప్రపంచంలో శాంతి స్థాపన అత్యంత కీలకమైందని శ్రీలంక బుద్ధ సేన రిలీజియస్, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి హిణిడుమ సునీల్ సేన్వి అన్నారు. శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలు మానవ సమాజానికి అత్యవసరమని ఆయన పేర్కొన్నారు.శనివారం తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ సమీపంలో ఉన్న బుద్ధవనాన్ని మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనం ప్రాజెక్టును పరిశీలించి అక్కడి నిర్మాణ శైలి, బౌద్ధ సాంస్కృతిక ప్రతిరూపాలు, విగ్రహాలు, ధ్యాన కేంద్రాలను ఆసక్తిగా వీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో, ముఖ్యంగా తెలంగాణలో బౌద్ధ వారసత్వానికి ఉన్న ప్రాముఖ్యత విశేషమని అన్నారు. బుద్ధవనం వంటి ప్రాజెక్టులు బౌద్ధ ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇటువంటి ప్రాజెక్టులు ఆధ్యాత్మికతతో పాటు సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూడా దోహదపడుతున్నాయని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య విభేదాలు, సంఘర్షణలు పెరుగుతున్న ఈ కాలంలో శాంతి సందేశం అత్యంత అవసరమని పేర్కొన్నారు. బుద్ధుని ఉపదేశాలు అయిన అహింస, దయ, కరుణ, సమానత్వం వంటి విలువలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. బౌద్ధం ద్వారా మనుషులు తమలోని కోపం, ద్వేషాన్ని తగ్గించుకొని శాంతియుత జీవన విధానాన్ని అలవరచుకోవచ్చని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రపంచ బుద్ధ శాంతి సమావేశంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, ఆ సమావేశం ద్వారా ప్రపంచ శాంతి దిశగా అనేక అంశాలు తెలుసుకునే అవకాశం లభించిందని చెప్పారు. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులతో ఆలోచనలు పంచుకోవడం ఒక విశేష అనుభవమని తెలిపారు.బుద్ధవనం వంటి ఆధునిక బౌద్ధ ప్రాజెక్టులు శ్రీలంకలో కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశం మరియు శ్రీలంక మధ్య బౌద్ధ సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి ఇలాంటి పర్యటనలు ఉపయోగపడతాయని అన్నారు.ఈ పర్యటనలో 21 దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు, భిక్షుణీలు, విదేశీ ప్రతినిధులు పాల్గొని బుద్ధవనం ప్రత్యేకతలను పరిశీలించారు. కార్యక్రమంలో బుద్ధవనం చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, బుద్ధవనం స్థాపకుడు మాజీ డీజీపీ ఆంజనేయ రెడ్డి, నటుడు గగన్ మాలిక్, వియత్నాం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తిక్ నాథ్ టు, నవ నలంద వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సిద్ధార్థ్ సింగ్, శాసన సభ్యుడు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజనీరింగ్ & మేనేజ్ మెంట్ సైన్స్‌పై మూడవ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్



**సత్తుపల్లి మార్చి 28 ( వుదయం ప్రతినిధి):** స్థానిక సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజనీరింగ్ & మేనేజ్ మెంట్ సైన్స్ పై మూడవ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఈరోజు కళాశాల కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించటం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ&కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి హాజరు అయ్యారు. కళాశాల సెక్రటరీ&కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ మరియు మేనేజ్మెంట్ సైన్స్లో ఇటీవలి పోకడలపై 3వ అంతర్జాతీయ సదస్సు (ఐసిఆర్టిఈఎం2026) అనేది, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు మరియు ఆవిష్కర్తలను ఒకచోట చేర్చి, జ్ఞానాన్ని పంచుకోవడానికి మరియు ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ సైన్స్లోని తాజా పరిణామాలను అన్వేషించడానికి రూపొందించబడిన ఒక అంతర్జాతీయ వేదిక. ఈ సదస్సు వినూత్న పరిశోధనలను ప్రదర్శించడానికి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను చర్చించడానికి మరియు వివిధ రంగాలలోని సమకాలీన సవాళ్లను పరిష్కరించడానికి ఒక చైతన్యవంతమైన వేదికను అందిస్తుందని చెప్పారు. ముఖ్య స్పీకర్ గా అజయ్ కుమార్ షా సహాయ ఆచార్యులు విభాగం స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్ అనుబంధం కాఠ్మండు విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ లా, ధూలిఖేల్, నేపాల్...డాక్టర్ మోహెద్ అక్బర్ డిపార్ట్ మెంట్ అఫ్ కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ యూనివర్సిటీ అఫ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ సైన్సెస్ ఫ్రొం మస్కట్. ఒమాన్ సాంకేతిక నిర్వాహక పురోగతికి దోహదపడే అత్యాధునిక ఆవిష్కరణలు, నూతన పద్ధతులు మరియు ఆచరణాత్మక పరిష్కారాలపై అర్థవంతమైన చర్చలను ప్రోత్సహించడం ద్వారా విద్యాసంస్థలు,

పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడమే ఐసిఆర్టిఈఎం2026 లక్ష్యం. జ్ఞానాన్ని పంచుకోవడానికి మరియు నెట్వర్కింగ్ చేయడానికి అవకాశాలను కల్పించడం ద్వారా, ఈ సదస్సు వినూత్న ఆలోచనలను ప్రేరేపించి, ప్రభావవంతమైన పరిశోధనల అభివృద్ధిని ప్రోత్సహించాలని కోరుకుంటుంది.

ఈ కార్యక్రమంలో ప్రముఖ నిపుణులచే కీలకోపన్యాసాలు, సాంకేతిక పత్రాల సమర్పణలు, ప్యానెల్ చర్చలు,ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయి. ఇవన్నీ ఇంజనీరింగ్,మేనేజ్మెంట్ సైన్స్లో అభివృద్ధి చెందుతున్న పోకడలు, పరివర్తనాత్మక ఆలోచనలను అన్వేషించడంపై దృష్టి సారిస్తాయి. జ్ఞానాన్ని పెంపొందించడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ సైన్స్ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అంకితమైన సహకార వాతావరణానికి దోహదపడటానికి, మేధోపరంగా ఉత్తేజపరిచే ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఐసిఆర్టిఈఎం 2026 పండితులు, నిపుణులు విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్యాట్రన్ గా ప్రముఖ పారిశ్రామికవేత్త,విద్యాధికులు,హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత,రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి , ప్యాట్రన్ గా విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, కళాశాల సెక్రటరీ&కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి , ప్రోగ్రాం చైర్ అండ్ కన్వీనర్ గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి , కో కన్వీనర్ డాక్టర్ తోటకూర వీరన్న ఏఐ&యంయల్, ఏఐ&డియస్ విభాగాధిపతి ,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్. రంజిత్ కుమార్,మేనేజింగ్ పార్టనర్,డి3 సోలుషన్స్ వ్యహరించటం జరిగింది.

## తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



**కరీంనగర్ మార్చి 28 (వుదయం ప్రతినిధి)** కరీంనగర్ పట్టణంలోని ఫిలిం భవన్ వేదికగా శనివారం తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గజ్జెల కాంతం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పట్టణ అధ్యక్షుడిగా నక్క అన్వేష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా సామిడి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్యాల కిరణ్ కుమార్ నియామకమయ్యారు. కార్యదర్శులుగా లింగంపల్లి రాజేష్, వడ్డూరి పవన్ బాబు, కల్లిపెల్లి కళ్యాణ్, వజ్రాల శివసాయి. సంయుక్త కార్యదర్శిగా ఎలగందుల చిరంజీవి. కోశాధికారిగా ఎదునూరి గణేష్. ప్రచార కార్యదర్శులుగా నక్క వీరునాథ్, బెజ్జంకి సంపత్, మెరుగు లక్ష్మీనారాయణ.ఈ సందర్భంగా గజ్జెల కాంతం మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అంబేద్కరిజం భావజాలంతో ముందుకు సాగాలని, పట్టణంలోని దళిత యువత సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దాం లక్ష్మణ్, సముద్రాల అజయ్, రాష్ట్ర నాయకులు గజ్జెల ఆనంద్ రావు, కల్లిపెల్లి శంకర్, గోషె శంకర్, కొండ్ర సంపత్, జిల్లా ప్రధాన కార్యదర్శి మనాల నారాయణ, మైసని మనోహర్, మహిళా అధ్యక్షురాలు కొండ్ర స్వరూప, జిల్లా నాయకులు తమ్మట్ల అంజయ్య, ఐనపల్లి గద్దె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పేద వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తాం

**సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్**



**జయశంకర్ భూపాలపల్లి మార్చి 28(వుదయం జిల్లా ప్రతినిధి):** పేద వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తాం అని మహాదేవపూర్ సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్ అన్నారు మహాదేవపూర్ మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ (షెడ్యూల్ కులాల) భవనాన్ని శనివారం గ్రామ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్ లు సందర్శించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు భవన ప్రస్తుత పరిస్థితిని వారు క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని అన్నారు దళిత వర్గాల సామాజిక, సాంస్కృతిక అవసరాల కోసం నిర్మించిన ఈ భవనం పాడవకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు సహకారంతో త్వరలోనే మైనర్ రిపేరింగ్ పనులకు నిధులు కేటాయించి భవనాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని, పేద వర్గాలఅభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీతోపాటు తమ పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విధేయుడి కి దక్కిన గౌరవం

**జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా దినేష్ సంగనభట్ల నియామకం**

**సీఎం రేవంత్, మంత్రి అడ్లూరి కి కృతజ్ఞతలు తెలిపిన దినేష్**



**ధర్మపురి మార్చి 28 (వుదయం ప్రతినిధి):** మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా, పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకున్న నాయకునిగా పార్టీకి అందించిన సేవలను గుర్తిస్తూ పార్టీకి చేసిన సేవలను పార్టీ అధిష్టానం మరువదని మరోసారి నిరూపితమైంది, దీనికి నిదర్శనమే కాంగ్రెస్ పార్టీ నాయకులు సంఘన భట్ల దినేష్ కు లభించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి,జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సంఘన బట్ల.దినేష్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసిం ది.ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా జీవో ఆర్టీ నెం.63ను విడుదల చేశారు.

1960 తెలంగాణ ప్రజా గ్రంథాల యాల చట్టంలోని సెక్షన్ 10, సబ్ సెక్షన్ (2), (3) ప్రకారం ప్రభుత్వం తనకున్న అధికారాలను వినియో గిస్తూ దినేష్ ను నాన్‌అఫీషియల్ సభ్యునిగా,చైర్మన్‌గా నియమించింది.ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన సిఫార్సుల మేరకు ఈ నియామకం జరిగినట్లు ప్రభు త్వం పేర్కొంది.ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయాల అభివృద్ధిలో ఈ నియామకం కీలక పాత్ర పోషించనుంది.నియామక పత్రం తాలూకు ప్రతులను సంబంధిత జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు, ట్రెజరీ కార్యాలయాలకు సమా చారం నిమిత్తం పంపారు. గ్రంధా లయ సంస్థ చైర్మన్ గా తన నియామకం పై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీ విధేయుడికి దక్కిన గౌరవంగా పార్టీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. ధర్మపురి నరసింహుని సాక్షిగా స్వామి ఆశీస్సులతో, సీఎం రేవంత్ రెడ్డి ,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి. లక్ష్మణ్ చొరవ తో తనకు పదవి దక్కినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి దినేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహాశక్తి ఆలయంలో సోమనాథ మూల జ్యోతిర్లింగ దర్శనం



**కరీంనగర్ మార్చి28(వుదయం ప్రతినిధి );** సుమారు వెయ్యి ఏళ్ల నాటి ప్రాచీనమైన సోమనాథ్ జ్యోతిర్లింగాలు కరీంనగర్ మహాశక్తి ఆలయంలో ఈరోజు భక్తులకు దర్శనమిచ్చింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ శ్రీ రవిశంకర్ ఆశీస్సులో కరీంనగర్ ఆధ్వర్యంలోని పవిత్ర సోమనాథ మూల జ్యతిర్లింగాలను ఈరోజు ఉదయం శ్రీ మహాశక్తి ఆలయానికి తీసుకువచ్చారు. భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకున్నారు. వాస్తవానికి దేశవ్యాప్తంగా భక్తులందరికీ జ్యోతిర్లింగాల దర్శనం కల్పించాలనే మహాశయంతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక ప్రాంతాల్లో జ్యోతిర్లింగాల దర్శనం కల్పించారు. తెలంగాణలో ఉగాది పర్వదినం సందర్భంగా హైదరాబాద్ లో జ్యోతిర్లింగాల దర్శనం భక్తులకు కల్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి మేరకు ఈ మూల జ్యోతిర్లింగాలను మహాశక్తి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య రిషి దేవ్ రథ్ మూల జ్యోతిర్లింగాలకు రుద్రాభిషేకం చేశారు. జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భారీ ఎత్తున భక్తులు మహాశక్తి ఆలయానికి తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో గాన కచేరి నిర్వహించారు. వినసొంపైన ఆధ్యాత్మిక గీతాలు వింటూ జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకుంటూ భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాశక్తి ఆలయ పూజారులు, వేదపండితులతోపాటు స్టేట్ టీచర్స్ కో ఆర్డినేటర్ గంగిశెట్టి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వెలుగుమట్లలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు

### రాష్ట్ర మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు



ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

విద్యుత్, త్రాగునీటి సదుపాయాల పనులు పూర్తి

లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి - 28:** వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాప్ ద్వారా వివరిస్తూ కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తి అయ్యాయని, వాటర్ ట్యాంక్ నుండి ఇంటింటికీ త్రాగునీటి పైప్‌లైన్ అనుసంధానం జరుగిందని తెలిపారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారుఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల మౌలిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సామాజిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్&బీ ఎస్ఈ యాకుబ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు డి. జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

# ఎముకలకు పుష్టినిచ్చే కూరగాయలు!



చలికాలంలో ఒక్కోసారి ఎముకలు, కీళ్ళు తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. ముఖ్యంగా అరవై ఏళ్లు పైబడిన వారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. అయితే నేటి కాలంలో యువత కూడా కీళ్ల నొప్పులతో సతమతం అవుతున్నారు. దీనికి అతిపెద్ద కారణం కాల్షియం లోపం. అందుకు కారణం ప్రోటీన్ కు ఇచ్చిన ప్రాముఖ్యత కాల్షియంకు ఇవ్వకపోవడమే. నేటి జీవనశైలి కారణంగా ఉదయం ఎండలో నడిచేవారే కరువయ్యారు. దీంతో శరీరంలో విటమిన్ డి లోపం తలెత్తుతుంది. దీని కారణంగా చిన్న వయస్సులోనే ఎముకలు పెళుసుగా మారుతాయి. పాలు, పాల ఉత్పత్తులకు దూరంగా ఉండేవారికి ఈ కింది కూరగాయల ద్వారా పుష్కలంగా కాల్షియం అందుతుంది. నువ్వులలో ఆరు రెట్లు ఎక్కువ కాల్షియం ఉంటుంది. కాబట్టి శీతాకాలంలో వీటిని సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. 100 గ్రాముల నువ్వులలో దాదాపు 975 గ్రాముల కాల్షియం లభిస్తుంది. నువ్వుల లడ్డులు, చట్నీలు, సలాడ్లలో కలిపి తినవచ్చు. శీతాకాలంలో క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలపడతాయి. నువ్వులు చిన్నగా కనిపించినప్పటికీ వాటిని కాల్షియం సూపర్ ఫుడ్ గా పరిగణిస్తారు. శీతాకాలంలో లభించే ఆకుకూరల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. పాలకూర, మెంతులు, పాలకూరలో కాల్షియం, విటమిన్ కె అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలపరుస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు కూడా తగ్గుతాయి. కిడ్నీ బీన్స్, చికపీస్‌లో కూడా కాల్షియం అధికంగా ఉంటుందని చాలా మందికి తెలియదు. ఒక కప్పు ఉడికించిన శనగల్లో 80 నుండి 100 గ్రాముల కాల్షియం ఉంటుంది. ఇది ప్రోటీన్, ఫైబర్, ఐరన్‌ను కూడా అందిస్తుంది. చల్లని చికపీస్, కిడ్నీ బీన్స్‌తో తయారు చేసిన వంటకాలు ఎముకలకు బలం చేకూరుస్తాయి. ఎండిన అంజీర్ పండ్లలో కాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు బలంగా ఉంటాయి. రోజుకు 4 నుండి 5 ఎండిన అంజీర్ పండ్లను తినడం వల్ల శరీర కాల్షియం అవసరాన్ని సులభంగా తీరుస్తుంది. అంజీర్ పండ్లు మలబద్ధకం సమస్యను కూడా తగ్గిస్తాయి. రక్తాన్ని పెంచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. జున్ను, పాలు లేకుండా కూడా శరీరం కాల్షియం పొందగలదు. అందుకు ఆహారంలో సోయాబీన్స్, టోఫు, సోయా మిల్క్ చేర్చుకుంటే సరిపోతుంది. సోయాబీన్స్‌లో కూడా కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల టోఫులో దాదాపు 350 గ్రాముల కాల్షియం ఉంటుంది. పాలు తాగడానికి ఇష్టపడని వారు, లాక్టోస్ అసహనం ఉన్నవారికి ఇది చాలా మంచిది. జీడిపప్పు, వాల్‌నట్‌లతో పాటు డ్రై ఫ్రూట్స్‌లో బాదం ఒకటి. కానీ బాదం శరీరంలో కాల్షియం పనితీరును నెరవేరుస్తుందని చాలా మందికి తెలియదు. బాదం మెదడుతో పాటు ఎముకలకు కూడా మంచిది. 100 గ్రాముల బాదంలో 260 మి.గ్రా కాల్షియం ఉంటుంది. చల్లని వాతావరణంలో రోజూ 5 నుంచి 7 బాదం పలుకులు నానబెట్టి తినడం వల్ల చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రాగుల్లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. 100 గ్రాముల రాగులు మూడు గ్లాసుల పాలలో ఉన్నంత శక్తిని కలిగి ఉంటాయి. ఎందుకంటే కేవలం 100 గ్రాముల రాగులు శరీరానికి 350 గ్రాముల కాల్షియం అందుతుంది. పిల్లలు నుంచి మహిళలు, సీనియర్ సిటిజన్లకు అందరికీ రాగులు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది.

# చికెన్, మటన్ లివర్ ఏది డేంజర్!

చికెన్, మటన్ లివర్ రెండూ పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాలు. స్త్రీలు వీటిని తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. నాన్ వెజ్ ప్రియులకు వారానికి ఒక రోజు మాంసం తినే అలవాటు సర్వసాధారణం. ఈ క్రమంలోనే చికెన్ లివర్, మటన్ లివర్‌లను ఎక్కువగా తింటుంటారు. ఈ రెండు ఆహార పదార్థాలలో అనేక పోషకాలు దాగున్నాయి. అందుకే మాంసాహారం ఇష్టపడే చాలామంది చికెన్, మటన్ లివర్‌ను ఇష్టంగా తింటారు. అయితే, వీటిలో ఆరోగ్యానికి ఏది మంచిది, ఎవరు వీటిని తినకూడదు అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందామా..





చికెన్ లివర్ తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చికెన్ లివర్‌లో ఐరన్, సెలీనియం, విటమిన్ ఏ, బీ12, ఫోలేట్, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే సెలీనియం క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అదనంగా, విటమిన్ ఏ, బీ12 కంటి ఆరోగ్యాన్ని, మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి చక్కెర స్థాయిలను నియంత్రించడంలో తోడ్పడుతుంది. ఉడికించిన చికెన్ లివర్‌ను మితంగా తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుందని చెబుతుంటారు. మటన్ లివర్ విషయానికి వస్తే.. చాలామంది చికెన్ లివర్ కంటే మటన్ లివర్ తినడానికి ఎక్కువ ఇష్టపడతారు. మటన్ లివర్‌లో విటమిన్లు ఏ, డీ, బీ12, జింక్, పొటాషియం, కాపర్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. వీటిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. రక్తహీనతతో బాధపడేవారికి మటన్ లివర్ ఒక మంచి ఆహారం అని చెప్పొచ్చు. ఇది రక్త స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బీ12 శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తుంది. అయితే ఇన్ని పోషకాలు ఉన్న చికెన్, మటన్ లివర్‌ను కొందరు తినకూడదు. అలా తింటే లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు, అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు, గుండె జబ్బులతో బాధపడుతున్నవారు, గర్భిణీ స్త్రీలు చికెన్ లేదా మటన్ లివర్‌ను తినకూడదు. ఈ వ్యక్తులు తినడం వల్ల లేనిపోని అనారోగ్య సమస్యలు వస్తాయి. అయితే, వీటిలో ఇనుము, విటమిన్లు, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, కొందరికి ఆరోగ్యపరమైన సమస్యలను తెచ్చిపెడతాయి. కిడ్నీలో రాళ్లు, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు ఉన్నవారు, గర్భిణీ

# గుండెపోటు లక్షణాలు..

ఇటీవల కాలంలో గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ అనేవి ఆకస్మిక మరణాలకు కారణమవుతున్నాయి. అయితే, గుండెపోటు రావడానికి ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించి ముందుగా జాగ్రత్త పడితే ప్రాణాలను కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. తీవ్రమైన గుండెపోటుకు 10 నుంచి 15 నిమిషాల ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని, వాటిని గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. గుండెపోటు ఇటీవల కాలంలో వయస్సుతో అనేవి ఇప్పుడు మనిషికి ప్రాణాంతకంగా మారాయి. అయితే, గుండెపోటుకు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గుర్తించి జాగ్రత్త పడితే ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఇటీవల ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే శ్యామ్ బిహారీ లాల్ గుండెపోటుతో మరణించారు. ఆస్పత్రికి తరలించి చికిత్స అందించేలోపే ఆయన తుదిశ్వాస విడిచారు. అయితే, గుండెపోటుకు ముందు కనిపించిన లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఆయన కొంత ముందుగా ఆస్పత్రికి రాలేకపోయారని, దీంతో తాము ఆయన ప్రాణాలు కాపాడలేకపోయామని వైద్యులు వెల్లడించారు. బిహారీ లాల్‌కు అకస్మాత్తుగా ఛాతిలో తీవ్రమైన నొప్పి వచ్చింది. అయితే, ఆయన దాన్ని తేలికగా తీసుకున్నారు. అందుకే ఆయన త్వరగా ఆస్పత్రికి రాలేదు. పరిస్థితి విషమించిన తర్వాత



ఆస్పత్రిలో చేరారని, కొంత సమయానికే ఆయన మరణించారని వైద్య నివేదికలు పేర్కొన్నాయి. వైద్యుల ప్రకారం.. ప్రతి వ్యక్తికి గుండెపోటుకు ముందు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో ఆ లక్షణాలు 10 నుంచి 15 నిమిషాల ముందుగానే కనిపిస్తాయి. మరికొందరిలో 4–5 గంటల్లో కనిపిస్తాయి. గుండెలోని అడ్డంకులు రక్తం సరిగ్గా పంపింగ్ కాకుండా నిరోధిస్తున్నాయనడానికి ఇదొక హెచ్చరిక సంకేతం. ఈ పంపింగ్ సమస్య వచ్చిన వెంటనే ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఛాతినొప్పి గుండెపోటుకు ప్రధాన సంకేతం. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చు. తీవ్రమైన ఛాతీ నొప్పిని విస్మరించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సంబంధం లేకుండా ప్రభావితం చేస్తున్న తీవ్రమైన వ్యాధి. చాలా సందర్భాల్లో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే ప్రాణాలు పోతున్నాయి. మరికొందరైతే ఉన్నస్థలంలోనే కుప్పకూలిపోయి ప్రాణాలు కోల్పోతున్నారు. గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్

# నల్లబెల్లం, తెల్లబెల్లం ఆరోగ్యానికి ఏది బెస్ట్?

బెల్లం అనగానే మనందరికీ గుర్తొచ్చేది తీపి. పంచదార కంటే బెల్లం ఆరోగ్యం అని అందరికీ తెలుసు. కానీ మార్కెట్లో దొరికే రకరకాల బెల్లాల్లో ఏది అసలైనదో, ఏది ఆరోగ్యానికి మరింత మేలు చేస్తుందో చాలామందికి తెలియదు. ఏదైనా ఒకటే కదా అని అనుకుంటాం. మన వంటకాల్లో, ముఖ్యంగా పండుగ ప్రసాదాల్లో బెల్లానికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం నుంచి మన పెద్దలు పంచదార కంటే బెల్లాన్నే ఎక్కువగా వాడేవారు. అయితే, నేటి కాలంలో మార్కెట్లో రంగు రంగుల బెల్లాలు కనిపిస్తున్నాయి. అన్ని రకాల బెల్లాల్లో తాటి బెల్లం మంచిదని చెబుతారు. ఇది తాటి చెట్టు నుంచి తీసిన నీరా ద్వారా తయారవుతుంది. ఇందులో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం వంటి



ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. దీనివల్ల జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా బాడీ డిటాక్స్ అవుతుంది. మనం నిత్యం వాడేది చెరకు బెల్లం. ఇది శక్తిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇందులో మనం గమనించాల్సింది రంగు. మార్కెట్లో తెల్లగా లేదా పసుపు రంగులో మెరిసిపోయే బెల్లం కనిపిస్తే అది కెమికల్స్ కలిసిన బెల్లం అని గుర్తుంచుకోవాలి. సహజమైన పద్ధతిలో తయారైన బెల్లం ముదురు గోధుమ రంగులో లేదా నలుపు రంగులో ఉంటుంది. రంగు తక్కువగా ఉన్న బెల్లమే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కొబ్బరి పువ్వుల నుంచి తీసిన రసంతో ఈ బెల్లం తయారు చేస్తారు. ఇది దక్షిణ భారతదేశంలో కొన్ని చోట్ల కనిపిస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. ఆరోగ్య పరంగా చూస్తే తాటి బెల్లం మొదటి స్థానంలో ఉంటుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. ఇక సాధారణ చెరకు బెల్లం కొనేటప్పుడు అది ముదురు రంగులో, గట్టిగా ఉండేలా చూసుకోవాలి. తెల్లటి బెల్లం తయారీలో సోడియం కార్బోనేట్ వంటి రసాయనాలు వాడతారు. ఇవి ఆరోగ్యానికి హానికరం. కాబట్టి, రు ఇకపై బెల్లం కొనేటప్పుడు కేవలం రుచిని మాత్రమే కాకుండా, అది ఏ రకమో మరియు దాని రంగును బట్టి సరైనది ఎంచుకోండి. తీపి తింటూనే ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

# పాప్‌కార్న్‌ను ఇలా తిన్నారనుకోండి!

పాప్‌కార్న్‌ను సరైన పద్ధతిలో తినకపోవడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు అంటున్నారు. పాప్‌కార్న్‌లో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని.. అది జీర్ణక్రియను మెరుగుపరుస్తుందని.. కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుందన్నారు. పాప్‌కార్న్.. పిల్లల నుంచి పెద్దల వరకు ఇష్టపడి తినే స్నాక్. సరైన పద్ధతిలో దీనిని తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని.. అలాగే మార్కెట్‌లో దొరికే వివిధ రకాల ఫ్లేవర్డ్ పాప్‌కార్న్‌ల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. అవి ఆరోగ్యానికి హానికరం అని చెప్పారు. పోషకాహార నిపుణుల ఇలా అన్నారు.. ఎలాంటి కృత్రిమ రుచులు, అధిక ఉప్పు లేదా వెన్న లేని సాదా పాప్‌కార్న్ మన శరీరానికి ముఖ్యమైన పోషకాలు అందిస్తుంది. పాప్‌కార్న్‌లో ఉండే అధిక ఫైబర్ జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రేగు కదలికలను పెంచి, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. పాప్‌కార్న్‌లో ఉండే ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్(ఒఆఒ) స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి మంచిది, హృదయ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అటు ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడంలో దోహదపడుతుంది. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది ఒక చక్కటి స్నాక్‌గా ఉపయోగపడుతుంది. పాప్‌కార్న్‌లో పాలీఫినాల్స్ లాంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్‌ను నశింపజేసేలా చేస్తాయి. తద్వారా క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. యాంటీఆక్సిడెంట్ల సమృద్ధి వృద్ధాప్య ప్రక్రియను ఆలస్యం చేయడంలో సహాయపడుతుంది. ఇది



చర్మం ముడతలు పడటం, అల్జీమర్స్, జుట్టు రాలడం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా దోహదపడుతుంది. పాప్‌కార్న్‌లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. ఇది ఫైబర్ కారణంగా కడుపు నిండుగా ఉన్న అనుభూతిని ఇస్తుంది. త్వరగా ఆకలి వేయకుండా చేస్తుంది. దీని వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక మంచి స్నాక్. పాప్‌కార్న్ సహజంగా గ్లూటెన్ రహితమైనది. గ్లూటెన్ అలర్జీ ఉన్నవారు లేదా గ్లూటెన్ రహిత ఆహారాన్ని ఇష్టపడేవారికి ఇది మంచి ఆప్షన్.

# ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగితే..?

కరివేపాకు నీటిని ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో తాగడం వల్ల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి జుట్టు, చర్మ సౌందర్యాన్ని పెంచుకోవాలనుకునే వారికి కరివేపాకు నీరు ఒక దివ్యౌషధం. మన వంటగదిలో పోపు పెట్టాలన్నా, వంటకానికి మంచి సువాసన రావాలన్నా కరివేపాకు ఉండాల్సిందే. అయితే కరివేపాకు కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. దానిలో దాగి ఉన్న పోషకాలు ఆరోగ్యానికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. ముఖ్యంగా ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో కరివేపాకు మరిగించిన నీటిని తాగడం వల్ల అనేక వ్యాధులను దూరం పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కరివేపాకు నీరు శరీరంలోని జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపులో మంట వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలనుకునే వారికి ఇది ఒక సహజసిద్ధమైన పరిష్కారం. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కరివేపాకు నీరు ఒక వరం లాంటిది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను సాధారణ స్థితిలో ఉంచడానికి సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే కార్బజోల్ ఆల్కలాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తాయి. శరీరంలోని మెటబాలిజంను పెంచడంలో కరివేపాకు కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వు పేరుకుపోకుండా నిరోధించడమే కాకుండా శరీర బరువును ఆరోగ్యకరంగా తగ్గించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారు తమ మార్నింగ్ డ్రింక్‌గా దీనిని ఎంచుకోవచ్చు. కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ తో పాటు ఇనుము, కాల్షియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. తలలో రక్త ప్రసరణను మెరుగుపరిచి జుట్టు రాలడం, చుండ్రు వంటి సమస్యలను తగ్గిస్తుంది. జుట్టు మందంగా, బలంగా పెరిగేలా చేస్తుంది. ముఖంపై నల్లటి మచ్చలు, పిగ్మెంటేషన్, పొడి చర్మం సమస్యలకు కరివేపాకు నీరు చక్కటి పరిష్కారం. ఇది చర్మ రంగును మెరుగుపరిచి మెరిసేలా చేస్తుంది.



# అందానికి.. 'నైట్' రొటీన్!

చర్మంపై పడిన దుమ్ము–ధూళి అలాగే ఉండిపోవడం, మేకప్ తొలగించుకోకపోవడం.. వంటి కారణాల వల్ల చర్మ రంధ్రాలు మూసుకుపోతాయంటున్నారు నిపుణులు. ఫలితంగా మొటిమలు, బ్లాక్ హెడ్స్.. మొదలైన సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అందుకే రాత్రి పూట చర్మాన్ని సంరక్షించుకునే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలంటున్నారు. మేకప్‌ని ఇలా తొలగించుకోవాలి..

రాత్రి పూట పడుకున్న సమయంలో మన శరీరం చర్మ కణాల్ని రిపేర్ చేస్తుంది. అయితే పడుకునే ముందు మేకప్ తొలగించకపోవడం వల్ల చర్మ రంధ్రాల్లో చేరిన దుమ్ము–ధూళి అక్కడే ఉండిపోతుంది. దానివల్ల మొటిమలొస్తాయి. కాబట్టి పడుకునే ముందు మేకప్ పూర్తిగా తొలగించుకోవాల్సి ఉంటుంది. అయితే చాలామంది మేకప్ తొలగించుకోవడానికి క్లెన్సర్‌ని మాత్రమే ఉపయోగిస్తుంటారు. కానీ మేకప్ రిమూవర్‌ని వాడడం మంచిది. దీనివల్ల చర్మపు పీహెచ్ మారకుండా ఉంటుంది అంటున్నారు నిపుణులు. మేకప్ తొలగించుకోవడానికి ఒక కాటన్ బాల్‌ని తీసుకొని దాన్ని రిమూవర్‌లో ముంచి మసాజ్ చేస్తున్నట్టుగా తొలగించుకుంటే.. మేకప్ పూర్తిగా తొలగిపోతుంది.. ఫలితంగా చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుందని చెబుతున్నారు నిపుణులు.

రోజూ కాకపోయినా.. అప్పుడప్పుడైనా చర్మాన్ని స్క్రబ్ చేస్తూ ఉండాలి. దీనివల్ల చర్మం మీద పేరుకున్న మృతకణాలు ఎప్పటికప్పుడు తొలగిపోతాయట. ఫలితంగా చర్మ రంధ్రాలు మూసుకుపోకుండానూ జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. రాత్రి పూట ఈ ప్రక్రియను పాటిస్తే మెరుగైన ఫలితాలుంటాయంటున్నారు. దీంతో పాటు చర్మతత్వానికి సరిపడే స్క్రబ్‌ని ఎంచుకోవడం కూడా ముఖ్యమేనని సూచిస్తున్నారు. కంటి కింది భాగం మాదిరిగానే పెదాలు కూడా సున్నితంగా ఉంటాయి. అందుకే పెదాలపై స్క్రబ్ చేయకూడదట. పెదాలను గోరువెచ్చని నీటితో కడిగి ఓ శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. మరీ గట్టిగా కాకుండా నెమ్మదిగా రుద్దడం వల్ల అక్కడ ఏర్పడిన మృతకణాలు తొలగిపోతాయట. తర్వాత లిప్‌బామ్ పూయడం వల్ల వాటికి తేమ అందుతుంది. దీనివల్ల పెదాలు పొడిబారకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. ఇవన్నీ చేసినా మాయిశ్చరైజర్ రాసుకోవడం చాలా అవసరం. తద్వారా చర్మానికి తేమ అంది సున్నితంగా మారుతుందని చెబుతున్నారు నిపుణులు.



# చర్మం పొడిబారితే..!



చర్మం పొడిబారినప్పుడు బయట దొరికే వాటికి బదులు.. ఇంట్లోనే లభించే కొన్ని సహజసిద్ధమైన పదార్థాలను మాయిశ్చరైజర్లుగా వాడుకోవచ్చంటున్నారు నిపుణులు. బయట దొరికే మాయిశ్చరైజర్లు కంటే సహజసిద్ధమైన మాయిశ్చరైజర్లు చర్మానికి మంచివి. అలా కాకుండా చర్మం రోజంతా తేమగా, తాజాగా ఉండాలంటే విటమిన్ 'ఇ' నూనెను వాడమంటున్నారు నిపుణులు. ఇది చర్మంపై సులువుగా పరచుకోవడంతో పాటు చర్మం లోపలి పొరల్లోకి బాగా ఇంకుతుందట. యాంటీ ఆక్సి డెంట్‌గా పనిచేసే ఈ నూనె ఎండ వల్ల కమిలిన చర్మానికీ చక్కటి పరిష్కారం! దీంతో పాటు కొబ్బరి నూనె, ఆలివ్ నూనె, ఆర్గన్ ఆయిల్.. వంటివి కూడా సహజసిద్ధమైన మాయిశ్చరైజర్లుగా పనిచేస్తాయని చెబుతున్నారు నిపుణులు. పొడిబారిన చర్మా నికి, పెదాలకు తేమనందించడంలో షియా బటర్ చక్కగా పనిచేస్తుంది. ఇందులోని ఫ్యాటీ ఆమ్లాలు, విట మిన్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని పునరుత్తేజితం చేసి మెరిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. కలబంద గుజ్జులో 'ఎ', 'సి', 'ఇ'.. వంటి విటమిన్లు ఉంటాయి. ఇవి చర్మం పై ఏర్పడిన ర్యాషెస్‌ను తగ్గించడంతో పాటు ఎక్కువ సమయం పాటు చర్మాన్ని తేమగా ఉంచుతాయని చెబుతున్నారు నిపుణులు.

## మరో 5 లక్షలకు పైగా ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా



రెండు విడతల్లో 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా కోసం కొత్తగా టెండర్లు పిలిచే యోచనలో ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఉన్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాపై ప్రభావం పడటంతో విద]ుత్తు సాయంతో వంట చేసుకునే ఉపకరణాలకు గిరాకీ పెరిగింది. గిరాకీకి తగ్గట్లుగా సరఫరా పెంచేందుకు ఇటీవలే లక్ష ఇండక్షన్ స్టవ్‌లకు టెండర్ ప్రక్రియను ఈఈఎస్ఎల్ పూర్తి చేసింది. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, వినియోగదారుల అభిప్రాయాలు సేకరించి, ఇండక్షన్ ఆధారిత వంట సామగ్రికీ టెండర్ ప్రక్రియను నిర్వహించింది.




# ఆరోగ్య బీమా ప్రీమియం రూ.1.2 లక్షల కోట్లు

దేశంలో ఆరోగ్య బీమాపై అవగాహన.. అందుకనుగుణంగా పాలసీల కవరేజీ పెరుగుతోంది. 2024-25లో మొత్తం ఆరోగ్య బీమా ప్రీమియం విలువ రూ.1.2 లక్షల కోట్లను అధిగమించింది. 2023-24 ప్రీమియం కంటే ఇది 9% అధికం. ఆరోగ్య పరిరక్షణ కోసం తప్పనిసరిగా మెరుగైన చికిత్స పొందాలనే ధోరణి ప్రజల్లో పెరుగుతోంది. దీనికితోడు వైద్య ఖర్చులు అధికమవుతుండటంతో, బీమా తీసుకోవడానికి అధికులు ముందుకు వస్తున్నారని ఆర్థిక శాఖ తెలిపింది. పాలసీదారులకు సకాలంలో మద్దతు అందేలా చూసేందుకు భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ).. నగదు రహిత ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల ప్రాసెసింగ్ కోసం, కంపెనీలకు నిర్దిష్ట కాల పరిమితులను నిర్దేశించింది. నగదు రహిత ప్రీ-ఆథరైజేషన్‌ను ఒక గంటలోగా, తుది ఆథరైజేషన్‌ను మూడు గంటల్లోగా ఆమోదించాలి. పాలసీదారుల వయసు పెరగడం, అధిక కవరేజీ, మెరుగైన సదుపాయాల వల్ల ఆరోగ్య బీమా ప్రీమియం పెరుగుతోందని వివరించింది.



ఐఆర్‌డీఏఐ 2024 నిబంధనలు.. అన్ని సంబంధిత ప్రమాద కారకాల ఆధారంగా బీమా ఉత్పత్తులకు న్యాయబద్ధంగా ధరలు నిర్ణయించాలని, అవి ఆచరణీయంగా, విలువ ఆధారితంగా కొనసాగాలని నిర్దేశిస్తున్నాయి. విశ్వసనీయ గణాంకాలు, వినియోగదారు అభిప్రాయం ఆధారంగా క్రమానుగత సమీక్షలు జరగాలని సూచిస్తున్నాయి. ఐఆర్‌డీఏఐ బీమా భరోసా పోర్టల్ ప్రకారం, 2024-25లో 1,37,361 సాధారణ, ఆరోగ్య బీమా ఫిర్యాదులు నమోదు కాగా, అందులో 1,27,755 (93%) పరిష్కారమయ్యాయి. క్లెయిమ్‌ల తిరస్కరణ లేదా నిరాకరణకు గల కారణాలు చాలా వరకు నిర్దిష్ట పాలసీ షరతులు, పరిమితులేనని పేర్కొంది. బీమా మొత్తాన్ని క్లెయిమ్ మించడం, కో-పేమెంట్ నిబంధన, పాలసీలలో ఉప పరిమితులు, టాప్-అప్ పాలసీల్లో మినహాయింపు, గది అద్దెపై పరిమితి, దామాషా ఛార్జీలు, వైద్యేతర ఖర్చుల వంటివి ఉన్నాయి. స్పష్టతను పెంచడానికి, క్లెయిమ్‌ల ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, పాలసీదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి ఐఆర్‌డీఏఐ అనేక చర్యలు తీసుకుందని ఆర్థిక శాఖ తెలిపింది.

# రిఫండ్లకు ఇబ్బందేమీ లేదు



వచ్చే ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టం-2025 అమల్లోకి రానున్న నేపథ్యంలో పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఊరటనిచ్చింది. పాత చట్టం కింద పన్ను రిటర్నులు దాఖలు చేసి, రిఫండు కోసం ఎదురుచూస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందీ లేదని పేర్కొంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భారతదేశంలో 65 ఏళ్లనాటి ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త ఆదాయ పన్ను చట్టం-2025 అమలుకు రంగం సిద్ధమైంది. ఈ మార్పు నేపథ్యంలో తమ పాత రిఫండ్లు ఏమవుతాయో అని ఆందోళన చెందుతున్న వారి సందేహాలను నివృత్తి చేస్తూ, పన్నుల బోర్డు ఒక సమగ్ర ప్రకటన విడుదల చేసింది. పాత ఆదాయపు పన్ను చట్టం నుంచి నూతన ఆదాయపు పన్ను చట్టానికి మారడం వల్ల పన్ను చెల్లింపుదారులు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలను కోల్పోరని ఆదాయపు పన్ను శాఖ స్పష్టం చేసింది. తరచూగా అడిగే ప్రశ్నల పత్రం ప్రకారం నూతన చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత కూడా పాత చట్టం కింద ఏర్పడిన హక్కులు, ప్రయోజనాలు చట్టపరంగా రక్షణ పొందుతాయి. బాధ్యతలూ కొనసాగుతాయని తెలిపింది. 'ఒక పన్ను చెల్లింపుదారుడు కొత్త పన్ను చట్టం ప్రారంభానికి ముందు ఏదైనా పన్ను సంవత్సరానికి సంబంధించి రిఫండు పొందేందుకు అర్హులైతే, ఏప్రిల్ 1, 2026 తర్వాతా దానికి అర్హులే'నని పేర్కొంది.

# ట్యాబ్లెట్ పీసీల్లో శామ్‌సంగ్ జోరు

దేశంలో ట్యాబ్లెట్ పీసీ మార్కెట్, గతేడాది వార్షిక ప్రాతిపదికన 2% వృద్ధి చెందింది. ఈ విభాగంలో శామ్‌సంగ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, యాపిల్, ఏసర్ సరఫరాలు తగాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజా నివేదికలో పేర్కొంది. భారత ట్యాబ్లెట్ మార్కెట్, ప్రీమియం ఉత్పత్తుల వైపు మళ్లుతోందని, అధిక పనితీరు కలిగిన వాటికి వినియోగదారులు మొగ్గుచూపుతున్నారని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రిన్సిపల్ అనలిస్ట్ అన్షికా జైన్ తెలిపారు.



రూ.30,000-40,000 ధర కలిగిన ట్యాబ్లెట్ల విభాగం అత్యంత వేగంగా వృద్ధి చెందుతోందని, ఈ విభాగం సరఫరాలు దాదాపు 7 రెట్లు పెరిగినట్లు వెల్లడించారు. భారత్‌లో శామ్‌సంగ్ ట్యాబ్లెట్ పీసీ సరఫరాలు 15% పెరిగాయి. శామ్‌సంగ్ మార్కెట్ వాటా 2024లో 27% కాగా, 2025లో 31 శాతానికి పెరిగింది. గెలాక్సీ ట్యాబ్ ఏ9, ఏ11 సిరీస్‌లు ఈ వృద్ధికి దోహదపడ్డాయి. గెలాక్సీ ట్యాబ్ ఎస్ పోర్ట్‌ఫోలియోతో రూ.15,000-30,000 విభాగంలో కంపెనీ ఆధిపత్యం చెలాయించింది. 20% మార్కెట్ వాటాతో యాపిల్ రెండో స్థానంలో నిలిచింది. కంపెనీ సరఫరాలు గతేడాది 2% తగ్గాయి. లెనోవో 15% వాటాతో 24% వృద్ధిని, షియామీ 11% వాటాతో 74% వృద్ధి సాధించాయి. ఏసర్ మార్కెట్ వాటా 21% నుంచి 10 శాతానికి పడిపోయింది. 10 లక్షల ఎగుమతులు: భారత ట్యాబ్లెట్ల తయారీ రంగానికి 2025 ఒక మలుపుగా నిలిచింది. గతంతో నామమాత్రంగా ఉన్న ఎగుమతులు, 2025లో 10 లక్షల యూనిట్లను మించాయి. ఎగుమతుల్లో శామ్‌సంగ్, లెనోవో అగ్రస్థానాల్లో ఉన్నాయి. మన దేశం నుంచి అమెరికా, ఐరోపా మార్కెట్లకు ఎక్కువ ఎగుమతులు వెళ్లాయి. వార్షిక సరఫరాల్లో 50% దేశీయంగానే ఉత్పత్తి అయ్యాయి. ఇది దేశీయ తయారీ సామర్థ్యాలు పెరగడానికి నిదర్శనం అని నివేదిక వెల్లడించింది. 2026లో కూడా భారత ట్యాబ్లెట్ విపణి బలమైన వృద్ధిని కొనసాగించే అవకాశం ఉందని కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది. ముఖ్యంగా కృత్రిమ మేధ ఫీచర్లు ఉన్న ట్యాబ్లెట్లు వినియోగదారులను ఆకట్టుకుంటాయని, భారత్ ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా మరింత బలోపేతం కానుందని నివేదిక పేర్కొంది.

# నిపుణుల కంటే ఏఐతో పని చౌక

నిపుణులతో పోలిస్తే, కృత్రిమ మేధ(ఏఐ)తో మేధోపరమైన పనులు చౌకగా నిర్వహించుకునేలా అడుగులు పడుతున్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. 'ఇన్‌ఫరెన్స్' దశలో ఉన్న ఏఐ మోడళ్లను పనిచేయించే విషయంలో.. నిపుణుల వ్యయాల కంటే తక్కువ ఖర్చుతో, వారికి సమానమైన మేధోశక్తితో ఏఐ చేయగలుగుతోందని ఫోర్బ్స్‌కిచ్చిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో బోధనా పద్ధతులు మారకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్‌పై అధికంగా ఆధారపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. ఏఐకయ్యే శిక్షణ ఖర్చులు, మనుషుల సామర్థ్యం మధ్య పోలికల విషయాని కొస్తే.. మానవ మేధకు దశాబ్దాల పాటు బయోలాజికల్ 'శిక్షణ', జీవితకాలం పాటు శక్తి వినియోగం అవసరం. మేధో ఫలితాలను ఒక్కో యూనిట్ ఆధారంగా చూస్తే.. ఏఐ వ్యవస్థలు మెరుగ్గా మారుతున్నాయి. సామర్థ్యం మరింత పెరిగే అవకాశాలూ కనిపిస్తున్నాయి. ఒక్కో పని చొప్పున చూసినా ఏఐ చౌకగానే ఉంటోంది. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవు. నిపుణులు చేసే పని మారుతుంది. ఉద్యోగాలపై ఏఐ చూపే ప్రభావంలో ఏకరూపత ఉండకపవచ్చు. కొన్ని ఉద్యోగాల్లో పాక్షిక ఆటోమేషన్ కనిపించొచ్చు. మరి కొన్ని పూర్తిగా మారిపోవచ్చు. సరికొత్త ఉద్యోగాలూ రావచ్చు. యూట్యూబర్లు, కంటెంట్ క్రియేటర్లు ఇటీవలి వరకూ లేరు.. ఇపుడు ఎక్కువ మంది యువత ఆ బాట పడుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. ఉద్యోగం విషయంలో సవాళ్లను ఎదుర్కోవాలంటే, ఇప్పటి నుంచి దశాబ్దం తర్వాత ఎటువంటి నైపుణ్యాలు అవసరమో అంచనా వేయడం ముఖ్యం. ఒకప్పుడు కోడింగ్ అందరికీ అవసరమైన నైపుణ్యం. ఇపుడు ఏఐ టూల్స్‌ను అందిపుచ్చుకోవడం కీలకంగా మారింది. మనకు ఇపుడు నైపుణ్యం అడ్డంకిగా లేదు. వనరులే ముఖ్యం. అందుకే దేశాలు ఏఐ మౌలిక వసతులను స్థానికంగా అభివృద్ధి చేసుకోవాలా, లేదా బయటి ప్రొవైడర్లపై ఆధారపడాలా అన్నది నిర్ణయించుకోవాలి. సాంకేతికతలో మార్పులు రావడం అసలైన సవాలు కాదు. విద్యా వ్యవస్థలు వాటిని అందుపుచ్చుకోవడమే సిసలు సవాలు. బోధనాపద్ధతుల్లో మార్పురాకపోతే, విద్యార్థులు ఏఐ టూల్స్ పైనే అధికంగా ఆధారపడే అవకాశం ఉంది. ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని గుర్తుంచుకుని, అభ్యాస వ్యవస్థలను విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, సమస్య-పరిష్కారాలతో రీడిజైన్ చేయాలి. ఏఐని అందిపుచ్చుకునే విషయంలో భారత్ అత్యంత క్రియాశీలక మార్కెట్‌గా ఉంది. మౌలిక వసతుల నుంచి అప్లికేషన్ల వరకు.. ఇలా పూర్తి స్టాక్‌పై పెట్టుబడులు పెడుతోంది. ఓపెన్‌ఏఐ కోడింగ్ ప్రోడక్ట్‌కు భారత్ అత్యంతవేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్‌గా ఉంది. త్వరలో అతిపెద్ద మార్కెట్‌గానూ మారొచ్చు. సంప్రదాయఇంటర్నెట్ సేవలతో పోలిస్తే ఏఐ సేవలను అందించడం చాలా ఖరీ దైన వ్యవహారం. అందుకే కంపెనీలు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవడం ముఖ్యం. భారత్ వంటి మార్కెట్లను అవి కనుగొనాలి. ఏఐ ఆధారిత వ్యక్తిగత ఏజెంట్లను మరింతగా అందిపుచ్చుకోవడానికి భద్రత, గోప్యత.. అతిపెద్ద సమస్యలుగా ఉన్నాయి. సునిశిత వ్యక్తిగత సమాచారం విషయంలో ప్రస్తుత వ్యవస్థలు అంత నమ్మదగినవి కావు. అందువల్ల వాటికి సమాచారం ఇచ్చే ముందు జాగ్రత్తగా ఉండాలి.







## బ్యాడ్మింటన్‌కు మారిన్ వీడ్కోలు



స్పెయిన్ బ్యాడ్మింటన్ దిగ్గజం కరోలినా మారిన్ ఆటకు వీడ్కోలు పలికింది. చాలా కాలంగా మోకాలి గాయంతో బాధపడుతున్న మారిన్ గురువారం రిటైర్‌మెంట్ ప్రకటించింది. ''ప్రొఫెషనల్ బ్యాడ్మింటన్‌లో నా ప్రయాణం ముగిసింది.హెలువాలో జరిగే ఐరోపా ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగట్లేదు. చివరగా నా తోటి షట్లర్లతో పోటీపడాలని అనుకున్నా. కానీ గాయం కారణంగా ఆ సాహసం చేయదలుచుకోలేదు'' అని 32 ఏళ్ల మారిన్ సామాజిక మాధ్యమంలో పేర్కొంది. 2016 రియో ఒలింపిక్స్, 2018 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ పి.వి.సింధును ఓడించి మారిన్ విజేతగా నిలిచింది. దూకుడైన ఆటకు మారుపేరైన ఈ ఎడమచేతి వాటం షట్లర్.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో (2014, 2015, 2018)లో మూడు స్వర్ణాలు, ఒక రజతం (2023) గెలిచింది. ముఖ్యంగా సింధుతో మారిన్ పోరాటాలను అభిమానులు అంత తేలిగ్గా మరిచిపోలేరు. గాయాలతో బాధపడుతూనే కెరీర్‌ను కొనసాగించిన మారిన్.. ఆఖరిగా 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడినా.. పతకం సాధించలేకపోయింది.

# అలా అయితే.. ధోని రిటైర్ అయిపోవాలి: రవిచంద్రన్ అశ్విన్

ఐపీఎల్ (IPL) ప్రారంభానికి ముందు ఎంఎస్ ధోనిపై (MS Dhoni) రవిచంద్రన్ అశ్విన్ కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. అతడిని చెన్నై సూపర్‌కింగ్స్ ఇంపాక్ట్‌ప్లేయర్‌గా ఆడించొద్దని సూచించాడు. అతడు జట్టులో ప్లేయింగ్ ఎలెవన్‌లో కచ్చితంగా ఉండాలన్నాడు. 'ధోని ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగడాన్ని నేను ఒప్పుకోను. అతడు ఒకవేళ చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో ఉంటే... కచ్చితంగా ఆడాల్సిందే. ఆడొద్దు అనుకుంటే సీజన్ మొత్తం ఆడొద్దు. అంతేకానీ అతడు ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రం బరిలోకి దిగొద్దు' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో విశ్లేషించాడు. 'మీరు చెన్నై సూపర్‌కింగ్స్ ప్లేయింగ్ ఎలెవన్‌ను తయారుచేస్తుంటే.. అందులో ఎంఎస్ ధోనికి కచ్చితంగా స్థానం కల్పించాలి. ఒకవేళ అతడు ఆడొద్దు అనుకుంటే.. రిటైర్ అవ్వాలి. అయితే.. తాను ఆడగలననే నమ్మకం అతడిలో 100 శాతం ఉంది. ధోని మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనిద్వారా అతడు తాను ఆడగలననే సందేశాన్ని ఇస్తున్నాడు. ఒకవేళ అతడు ఆడాలనుకుంటే.. నువ్వు ఆడటం కుదరదు.. అని అతడితో చెప్పడం మీకు సాధ్యం కాదు' అని అశ్విన్ పేర్కొన్నాడు. 'దిక్సూచిలా పని చేస్తాడు' 'అతడు మీ ఆరో నంబర్ బ్యాటర్ కాదనే విషయాన్ని నేను అంగీకరిస్తున్నా. అతడు రెండు పాత్రలు పోషించగలడు. మైదానంలో ధోని.. రుతురాజ్ గైక్వాడ్‌కు దిక్సూచిలా పనిచేస్తాడు. కొత్త బౌలింగ్ లైనప్‌నకు సహాయ సహకారాలు అందిస్తాడు. గత సంవత్సరం అతడు చివరి మూడు ఓవర్లు ఆడాలని చూశాడు. కానీ ప్రతిసారీ టాప్ ఆర్డర్ పరుగులు రాబట్టలేదు. అతడు కాస్త ముందే బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సింది. అయితే ఈసారి మాత్రం ఆ పరిస్థితి లేదు. వారు టాప్ ఆర్డర్‌ను పటిష్టం చేసుకున్నారు' అని అశ్విన్ అన్నాడు. 'ఈ సీజన్‌లోనూ ధోని ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే కాస్త ముందు బ్యాటింగ్‌కు వస్తాడేమో. దాదాపు అన్ని మ్యాచుల్లోనూ చివర్లోనే బ్యాటింగ్‌కు వచ్చే అవకాశముంది. కీపింగ్‌పై అతడు ప్రధానంగా దృష్టి సారిస్తాడు. ఫీల్డ్ సెట్టింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు మార్గనిర్దేశనం చేస్తాడు. మొత్తానికి ధోని పెద్దన్న పాత్ర పోషిస్తాడు' అని రవిచంద్రన్ అశ్విన్ వెల్లడించాడు.



## స్వర్ణ పోరుకు చికిత ద్వయం

ఆసియాకప్ ప్రపంచ ర్యాంకింగ్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నమెంట్లో తెలంగాణ అమ్మాయి చికిత తానిపర్తి జోరు కొనసాగుతోంది. ఫైనల్ చేరిన కాంపౌండ్ మహిళల జట్టులో సభ్యురాలైన తెలుగమ్మాయి.. మిక్స్‌డ్ విభాగంలో రజత్ చౌహాన్ భాగస్వామిగా స్వర్ణ పోరుకు అర్హత సాధించింది. గురువారం సెమీఫైనల్లో చికిత-రజత్ జంట 157-153తో విక్టోరియా లిన్-బన్‌యాడ్ మిర్జామెటోవ్ (కజకిస్థాన్) జోడీని ఓడించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో రుమా బిస్వాస్-దేవాంగ్ గుప్తా జంటకు చుక్కెదురైంది. క్వార్టర్స్‌లో రుమా జంట 2-6తో థియ్ డావో-హోయాంగ్ గుయెన్ (వియత్నాం) ద్వయం చేతిలో ఓడింది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్, ఉదయ్ కాంభోజ్ ఫైనల్ చేరడంతో స్వర్ణం, రజతం భారత్‌కే ఖరారయ్యాయి. ప్రథమేశ్ 149-148తో సహచరుడు రజత్ చౌహాన్‌పై నెగ్గగా.. ఉదయ్ 147-145తో పిరావత్ (థాయ్‌లాండ్)ను ఓడించాడు. రజత్ కాంస్యం కోసం పోరాడనున్నాడు. మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో రిధి ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీస్‌లో జింగ్ లీ (మలేసియా)పై రిధి 6-0తో విజయం సాధించింది. మొత్తంగా ఈ టోర్నీలో మహిళల రికర్వ్ వ్యక్తిగత, పురుషుల రికర్వ్ టీమ్, మహిళల కాంపౌండ్ టీమ్, మిక్స్‌డ్ కాంపౌండ్ టీమ్, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో భారత్ ఫైనల్ చేరింది. భారత్ ఇప్పటికే కాంపౌండ్ పురుషులు, మహిళల టీమ్ విభాగాల్లో కాంస్యాలు గెలిచింది.




## ముంబయి తిరిగి ఆ పొరపాటు చేయదనుకుంటున్నా: మహ్మద్ కైఫ్



ఐపీఎల్ (IPL) ప్రారంభానికి ముందు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ ముంబయి ఇండియన్స్‌కు కీలక సూచనలు చేశాడు. ప్రస్తుతం ముంబయికి హార్దిక్ పాండ్య కెప్టెన్‌గా ఉన్నాడు. టీ20 వరల్డ్ కప్ 2026లో టీమ్‌ఇండియాను విజేతగా నిలిపిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రస్తుతం ముంబయి టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ యాదవ్‌కు ముంబయి కెప్టెన్సీ అప్పజెప్పాలని ఇటీవల భారత జట్టు మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అభిప్రాయం వ్యక్తం చేశాడు. దీనికి భిన్నంగా మహ్మద్ కైఫ్ స్పందించాడు. అలా చేయడం పొరపాటే అవుతుందన్నాడు. కెప్టెన్సీ మార్పు విషయంలో ముంబయి ఇండియన్స్ మరోసారి తప్పు చేయదనుకుంటున్నా. వారు రోహిత్ శర్మ నుంచి కెప్టెన్సీని హార్దిక్‌కు అప్పగించిన తర్వాత జట్టు ప్రదర్శన పడిపోయింది. హార్దిక్ పాండ్య ఇప్పుడు కుదురుకుంటున్నాడు. సూర్యకుమార్ యాదవ్ కూడా కెప్టెన్సీ ఆప్షన్. కానీ రోహిత్ శర్మ విషయంలో జరిగినట్లుగా మళ్లీ హార్దిక్ పాండ్యకు జరగొద్దు' అని కైఫ్ అన్నాడు. జోష్ హేజిల్‌వుడ్ ఆర్సీబీ శిబిరంలో చేరాడు. అతడి రాకతో ఆర్సీబీ బౌలింగ్ విభాగం బలంగా మారింది. అయితే అతడు వెంటనే బరిలోకి దిగే అవకాశాలు లేవు.గాయాల నుంచి కోలుకుంటున్న అతడు కొన్ని మ్యాచ్‌ల అనంతరం మైదానంలో కనిపించే ఛాన్స్ ఉంది. గత సీజన్‌లో ఆర్సీబీని ఐపీఎల్ విజేతగా నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. 12 మ్యాచుల్లో 22 వికెట్లు తన ఖాతాలో వేసుకొని, సత్తా చాటాడు. ఆర్సీబీ జట్టు నువాన్ తుషార లేకుండానే బరిలోకి దిగనుంది. అతడికి శ్రీలంక క్రికెట్ బోర్డ్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) రాకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఆటగాళ్లకు మ్యాచ్ ఫిట్‌నెస్ లేనప్పుడు శ్రీలంక క్రికెట్ బోర్డ్ ఎన్‌ఓసీ జారీ చేయదని సమాచారం. తుషార గాయానికి గురికాలేదు.. అయినప్పటికీ అతడు మ్యాచ్‌లు ఆడేంత ఫిట్‌గా లేడని వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్ 2026లో పాల్గొనాలనుకునే తమ కాంట్రాక్టు ఆటగాళ్లంతా కచ్చితంగా ఫిజికల్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలని శ్రీలంక క్రికెట్ బోర్డ్ గతవారం స్పష్టం చేసింది. అయితే.. శ్రీలంక తీసుకుంటున్న ఇలాంటి కఠిన చర్యలను శ్రీలంక మాజీ క్రికెటర్ చమిందా వాస్ ఖండించాడు. 'క్రికెట్ విషయానికి వస్తే ఫిట్‌నెస్ చాలా ముఖ్యం. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ మీరు దాన్ని సంవత్సరాల తరబడి నిర్లక్ష్యం చేసి, ఆపై ఐపీఎల్‌కు ముందు అకస్మాత్తుగా కఠినమైన ప్రమాణాలను అమలు చేయలేరు.' అని చమింద వాస్ విమర్శించాడు.

## 'ఇంపాక్ట్'కు నేను వ్యతిరేకం: గిల్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనకు వ్యతిరేకత పెరుగుతోంది. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్‌ల తర్వాత గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై అభ్యంతరం తెలిపాడు. అది ఆటగాళ్ల నైపుణ్యాన్ని దెబ్బ తీస్తుందని చెప్పాడు. ముంబయిలో ఐపీఎల్ జట్ల కెప్టెన్ల సమావేశంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. ''ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను నేను వ్యతిరేకిస్తున్నా. క్రికెట్ 11 మంది ఆట. కానీ ఒక ప్లేయర్ అధికంగా జట్టులో చేరడం.. ఆటగాళ్ల నైపుణ్యాన్ని దెబ్బ తీస్తుంది'' అన్నాడు. అయితే ఈ నిబంధన 2027 వరకు కొనసాగనుంది. గుజరాత్ టైటాన్స్ గురించి మాట్లాడుతూ.. ''గత మూడు, నాలుగు సీజన్లలో నేను బాగానే పరుగులు చేశా. కాబట్టి ప్రత్యేకంగా నిరూపించుకోవాల్సిన అవసరం లేదని భావిస్తున్నా. మొదటి నుంచి మేము జట్టుగా స్థిరంగా రాణిస్తున్నాం. ఈ సారి కూడా అదే కొనసాగిస్తే మరో ట్రోఫీ గెలుస్తాం'' అని పేర్కొన్నాడు. 2022లో ఐపీఎల్‌లో ప్రయాణం ప్రారంభించిన గుజరాత్.. హార్దిక్ పాండ్య సారథ్యంలో తొలి ఏడాదే ఛాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.






# వుదయం సినిమా

## బరి పూజా కార్యక్రమం



ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మిస్తున్న నూతన చిత్రం 'బరి' పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మాతగా యదు వంశీ తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'బరి'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలను శనివారం నాడు నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టగా మైత్రీ మూవీస్ నిర్మాత నవీన్ యెర్నేని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు మేర్లపాక గాంధీ, నిర్మాత రాజీవ్ రెడ్డి ఎదుగురు స్క్రిప్ట్ అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం యూనిట్ చిత్రానికి సంబంధించిన విశేషాల్ని పంచుకున్నారు.

## యూత్ మూవీ బ్లాక్ బస్టర్ థ్యాంక్ మీట్




కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ మూవీ "యూత్". తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఈ 2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. మంచి యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ గా "యూత్" మూవీకి తెలుగు ప్రేక్షకుల ఘన విజయాన్ని అందించారు. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను చార్మింగ్ స్టార్ శర్వానంద్ అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు.

## పెద్ది పహిల్వాన్
### నెం.1 ట్రెండింగ్‌లో గ్లింప్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' కోసం చేసిన ఫియర్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. చరణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఈ స్పెషల్ గ్లింప్స్‌తో పాటు వచ్చిన పోస్టర్లు ఆయనను పూర్తిగా కొత్త అవతార్‌లో చూపించాయి. పహిల్వాన్ లుక్‌లో ఆయన కనిపించిన తీరు ప్రేక్షకులని సర్ప్రైజ్ చేసింది. 'పెద్ది పహిల్వాన్' గ్లింప్స్ విడుదలైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ తో దేశవ్యాప్తంగా నెం.1 ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది.

ఈ సినిమాలో చరణ్ బాడీ లాంగ్వేజ్, ఫిజిక్ పూర్తిగా రా అండ్ ఫెరోషియస్‌గా కనిపిస్తోంది. నిజమైన ఫైటర్‌లా కనిపించే బలమైన భుజాలు, చేతులు, భారీ ఛాతీ, కండలు తిరిగిన దేహంతో అసలైన పహేల్వాన్‌గా కనిపించారు. రెజ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్ ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను మరింత పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. ముందుకు దూసుకెళ్లే సీన్స్‌లో, గదను పట్టుకుని కూర్చునే షాట్స్‌లో, హనుమాన్ ప్రేరణతో వచ్చిన యోధుడిలా ఆయన ఆగ్రహం, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయి. దుమ్ము ఎగిరే ఫ్రేమ్స్, నరాలు బిగుసుకునే ఎఫర్ట్, కళ్లలో కనిపించే ఫైర్ అన్నీ కలిపి ఒక థండరస్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తున్నాయి.

ఇది కేవలం ఒక మేకోవర్ కాదు.. బలం, క్రమశిక్షణ, మైథిక్ పవర్ కి ప్రతీకలా నిలిచే పాత్ర. ఈ గ్లింప్స్‌తో పెద్ది సినిమా స్కేల్, మాస్ ఇంపాక్ట్, హై వోల్టేజ్ ఎలివేషన్ ఎంత భారీగా ఉండబోతుందో స్పష్టమవుతోంది.

దర్శకుడు బుచ్చి బాబు సనా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తుండగా, ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా, మైత్రి మూవీ మేకర్స్ ప్రెజెంటేషన్‌లో, సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో భారీ కాన్వాస్‌పై రూపొందుతోంది.

## నిధుల సేకరణలో టీచ్ ఫర్ ఛేంజ్
### హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహణ
### ప్రభుత్వ పాఠశాలల పిల్లల విద్యకు మద్దతు



ప్రీమియర్ ఎనర్జీస్ సమర్పణలో, నటి మరియు సామాజిక సేవకురాలు లక్ష్మీ మంచు ఆధ్వర్యంలో నిర్వహించిన టీచ్ ఫర్ ఛేంజ్ వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం 2026, హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం, కార్పొరేట్, విద్యా రంగం, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై, ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పిల్లల నాణ్యమైన విద్యకు మద్దతు తెలిపారు. ఈ వార్షిక కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం మరియు వెనుకబడిన వర్గాల పిల్లల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం యొక్క ప్రాముఖ్యతను ప్రస్తావించింది. ప్రతి చిన్నారికి వారి సామాజికఆర్థిక పరిస్థితులు ఏవైనా సరే, నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం, కార్పొరేట్లు, స్వచ్ఛంద సంస్థలు మరియు వ్యక్తుల మధ్య భాగస్వామ్యం అవసరమని ఈ వేదిక నొక్కి చెప్పింది. ఈ వేడుకలో భాగంగా భారత సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు విద్యా సేవకు మద్దతుగా ర్యాంప్ వాక్ చేశారు. ప్రముఖ డిజైనర్ రామ్‌జ్ రూపొందించిన ప్రత్యేక కలెక్షన్స్‌తో పాటు సాఖీ హెరిటేజ్ దుస్తులు మరియు రోజ్ జ్యువెలరీ ఆభరణాలు ప్రదర్శించబడ్డాయి. ఈ ఫ్యాషన్ ప్రదర్శన సినిమా, ఫ్యాషన్ మరియు సేవ భావనల సమ్మేళనంగా నిలిచింది.



## టీఎఫ్ జేఏ డైరీ లాంచ్



తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతి సంవత్సరం తెలుగు సంవత్సరాది సందర్భంగా జర్నలిస్టుల కోసం డైరీ విడుదల చేయడం, ఇన్సూరెన్స్ ప్లాన్‌ను రెన్యువల్ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. 2026-2027 సంవత్సరానికి సంబంధించిన డైరీ మరియు ఇన్సూరెన్స్ రెన్యువల్‌ను మెగాస్టార్ చిరంజీవి గారి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.

ఈ ఏడాది ప్రత్యేకంగా, ప్రతి ఫిల్మ్ జర్నలిస్ట్ కుటుంబానికి (2+2) అందించే ఇన్సూరెన్స్ కవరేజీని ₹5 లక్షల నుంచి ₹10 లక్షలకు పెంచడం జరిగింది.

అదేవిధంగా, ప్రమాదాల సమయంలో జర్నలిస్టులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక యాక్సిడెంట్ పాలసీ ప్రవేశపెట్టారు.

ఏదైనా ప్రమాదం కారణంగా 2 నుంచి 12 నెలలు బెడ్ రెస్ట్ అవసరమైన పరిస్థితుల్లో, ప్రతి వారం ₹10,000 చొప్పున సహాయం అందేలా ఈ పాలసీ రూపొందించబడింది.

తెలుగు ఫిల్మ్ జర్నలిస్టులకు గుర్తింపు కల్పించే విధంగా అసోసియేషన్ తరఫున ఐడి కార్డులు జారీ చేయగా, వాటిని కూడా చిరంజీవి గారు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారు టీఎఫ్ జేఏ చేపడుతున్న కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందిస్తూ ₹5 లక్షల చెక్కును అందించి, సభ్యుల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో టీఎఫ్ జేఏ ప్రెసిడెంట్ వై.జె. రాంబాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాదం రఘు, ట్రెజరర్ నాయుడు సురేంద్ర, పొలిటి బ్యూరో కన్వీనర్ వారణాసి లక్ష్మీనారాయణతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ మరియు పోలిట్ బ్యూరో సభ్యులు పాల్గొన్నారు.

## బైకర్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చే సినిమా

చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హైఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ డాల్బీ సినిమా, ఈపీఐక్యూ, 4డిఎక్స్, పిసిఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. ఇప్పటికే గ్లింప్స్‌లు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్‌రెడ్డి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**బైకర్ ఆడియన్స్‌కు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది?**

బైకర్ 100% థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. డాల్బీ విజన్‌లో కూడా షూట్ చేశాం. ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరూ ఈ సినిమా సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఖచ్చితంగా ఈ సినిమా థియేటర్‌లో చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఉంటుంది.

**ఈ కథ రాయడానికి ఇన్స్పిరేషన్?**

బైక్ అనేది అందరికీ ఒక ఎమోషన్. నాకు పర్సనల్‌గా ఆ ఎమోషన్ అంటే చాలా ఇష్టం. ఇందులో రేసింగ్‌తో పాటు చాలా మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఉంది. ఫాదర్‌సన్ మధ్య ఉండే ఎమోషన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది.

**షూటింగ్‌లో మీరు ఎదుర్కొన్న చాలెంజెస్ ఏమిటి?**

ఈ సినిమాలో రేసింగ్ సీక్వెన్స్‌లను రియల్ రేసర్స్‌తో షూట్ చేశాం. షూట్ చేసినప్పుడు చాలా యాక్సిడెంట్లు జరిగాయి. ఒక షాట్ చేసిన తర్వాత రెండు గంటలు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చేది. కేవలం యాక్షన్‌కే 60 రోజులకు పైగా పట్టింది. ఈ సినిమా రెండు టైమ్‌లైన్స్‌లో జరుగుతుంది. 90స్‌లో టూ స్ట్రోక్ బైక్స్ ఉండేవి, అవి ఇప్పుడు లేవు. వాటిని డిజైన్ చేయడానికి చాలా టైం పట్టింది. ఇందులో రేసింగ్ ఇండోనేషియాలో షూట్ చేశాం. ఆ బైక్స్ అన్నీ మళ్లీ ఇండియాకు తీసుకురావడం కూడా చాలా పెద్ద ప్రాసెస్. అలాగే ఈ సినిమా కోసం న్యూజీలాండ్, ఆస్ట్రేలియా నుంచి రేసర్స్ ని రప్పించాము.

**ఇండియాలో ఈ స్పోర్ట్స్ ఉందా?**

ఉంది. కానీ రావాల్సిన పాపులారిటీ రాలేదు. ఇందులో రాజశేఖర్ గారి క్యారెక్టర్‌తో ఇదే అంశాన్ని ప్రెజెంట్ చేస్తున్నాం. ఇండియాలో శ్యామ్ కొఠారి అనే వెటరన్ రేసర్ ఉన్నారు. కానీ ఆయనకి క్రికెట్‌లో కపిల్ దేవ్‌కి వచ్చినంత గుర్తింపు రేసింగ్‌లో రాలేదు. ఈ రేసింగ్ స్పోర్ట్ మనకి ఎప్పటినుంచో ఉంది, కాకపోతే ఇందులో కొంచెం రిస్క్ ఎక్కువ. కపిల్ దేవ్‌కి ఉన్నంత గుర్తింపు శ్యామ్ కొఠారికి కూడా రావాలనేదే నా మోటివ్. ఇది ఫిక్షనల్ స్టోరీ అయినప్పటికీ రేసింగ్ విషయంలో కొన్ని ట్రూ ఇన్సిడెంట్స్‌ను ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నాం. రాజశేఖర్ గారు కోచ్ అలాగే ఫాదర్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఆయన క్యారెక్టర్ రెగ్యులర్ ఫాదర్‌లా ఉండదు. ఆయన చుట్టూ ఒక కథ తిరుగుతుంది. ఆయన ఆ క్యారెక్టర్ చేయడంతో ఎమోషన్ ఇంకా స్ట్రాంగ్ అయ్యింది.

**ఈ సినిమా ఎలాంటి కొత్తదనం ఇస్తుంది?**

ఎఫ్ వన్ సినిమా రిలీజ్ అయినప్పటికీ నా సినిమా పూర్తి అయిపోయి పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. ఎమోషన్, డ్రామా పరంగా రెండు కూడా చాలా డిఫరెంట్ సినిమాలు.



## మహాకాళి తన పోర్షన్ షూటింగ్ పూర్తి చేసుకున్న అక్షయ్ ఖన్నా



అక్షయ్ ఖన్నా పుట్టినరోజు సందర్భంగా, దర్శకుడు ప్రశాంత్ వర్మ 'మహాకాళి' సెట్స్ నుంచి ఒక కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ (PVCU)లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చాప్టర్ గురించి ఒక ఎక్సయిటింగ్ అప్‌డేట్‌ను ఇచ్చారు. ఆర్కేడీ స్టూడియోస్ బ్యానర్‌పై ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్‌దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రశాంత్ వర్మ షోరన్నర్‌గా వ్యవహరిస్తుండగా, పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం భారతీయ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పౌరాణిక చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది చిత్ర బృందం 100 రోజుల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేయగా, చివరి 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శుక్రాచార్యుడి కీలక పాత్ర కోసం అక్షయ్ ఖన్నా తన చిత్రీకరణను పూర్తి చేశారు. నిర్మాతలు త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు. మల్టీ స్టూడియోల వీఎఫ్ఎక్స్ పనులు శర వేగంతో సాగుతున్నాయి. ఈ చిత్రంలో భూమి శెట్టి టైటిల్ పాత్రలో నటిస్తున్నారు. ఆమె ఉగ్రరూపంలో కనిపించిన ఫస్ట్‌లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా టాలీవుడ్ అరంగేట్రం భారీ అంచనాలను రేకెత్తించగా, అతని ఫస్ట్ లుక్‌కు కూడా సోషల్ మీడియాలో అద్భుతమైన ప్రశంసలు లభించాయి. ఇప్పుడు అతను తన భాగానికి సంబంధించిన చిత్రీకరణను పూర్తి చేయడంతో, అతని పాత్రపైనా, పీవీసీయూపైనా అంచనాలు మరింత పెరిగాయి. ఈ చిత్రానికి స్మరణ్ సాయి సంగీతం, సురేష్‌రగుతు సినిమాటోగ్రఫీ, శ్రీనాగేంద్ర తంగలా ప్రొడక్షన్ డిజైనర్. 'మహాకాళి' విజువల్ వండర్ గా రూపుదిద్దుకుంటోంది.



## నేను చాలా బిజీ

చిన్న సినిమాగా విడుదలై, గత సంవత్సరం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న చిత్రాల్లో 'రాజు వెడ్స్ రాంబాయి' ఒకటి. ఇందులో తేజస్వి రావు హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమాలో ఈ ముద్దుగుమ్మ తన అందంతో పాటు నటనతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమా సూపర్ సక్సెస్ కావడంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ టాలీవుడ్ ఇండస్ట్రీలో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. దీంతో ఈమె ప్రస్తుతం ఏ చిత్రాల్లో నటిస్తుందో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో బాగా నెలకొంది. తాజాగా ఈమె తాను నటిస్తున్న చిత్రాల గురించి వెల్లడించింది. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఓ సిరీస్‌లో నటిస్తున్నట్లు తెలిపింది. అలాగే కిరణ్ అబ్బవరం హీరోగా రూపొందుతున్న ఓ మూవీతో పాటు, తిరువీర్‌తో కలిసి మరో సినిమాలో కూడా నటిస్తున్నట్లు చెప్పింది. ఇలా మొత్తం మూడు ప్రాజెక్టులతో చాలా బిజీగా ఉన్నట్లు ఈ బ్యూటీ వెల్లడించింది.



## మే 22న హార్రర్ త్రిల్లర్ చిత్రం విచిత్ర

జ్యోతి పూర్వాజ్ ప్రధాన పాత్రలో , రవి,శ్రేయ తివారి హీరో హీరోయిన్ గా సిస్ ఫిలిమ్స్ బ్యానర్ పై సైపుద్దీన్ మాలిక్ నిర్మాణ దర్శకత్వం లో వస్తున్నా చిత్రం 'విచిత్ర',ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ సెన్సర్ పనులు పూర్తి చేసుకుని మే 22న విడుదల కానుంది.

ఈ సందర్భంగా ఈ చిత్రం దర్శక నిర్మాత సైపుద్దీన్ మాలిక్ మాట్లాడుతూ మా విచిత్ర మూవీ లో హీరోగా రవి, హీరోయిన్ శ్రేయ తివారి, జ్యోతి పూర్వరాజ్, 'బేబీ' శ్రీ హర్షిణి, రవి ప్రకాష్, సూర్య, ఛత్రపతికి శేఖర్, మీనా వాసన్ ముఖ్య పాత్రలుగా నటించిన చిత్రం "విచిత్ర"

"ప్రపంచం మొత్తం దూరమైన దగ్గరగా ఉండేది అమ్మ ప్రేమే" ప్రతి ఆడతల్లి గుండె తల్లడెల్లేలా సెంటిమెంట్ నేపథ్యంతో రూపొందిన సినిమా "విచిత్ర", ఫ్యామిలీ తో కలిసి సంతోషంగా ఎంజాయ్ చేస్తూ,చూసే చిత్రం "విచిత్ర".

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.